అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 08 -01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 11 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50

పెట్రో వడ్డన షురూ..

పెట్రోల్‌పై రూ. 0.21, డీజిల్‌పై రూ. 0.08 పైసల పెరుగుదల

న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పెట్రో ఉత్పత్తుల ధరలు సోమవారం మళ్లీ పెరిగాయి. దేశంలోని ప్రధాన నగరాలల్లో లీటరు పెట్రోల్‌పై రూ.0.21, డీజిల్‌పై రూ.0.08 పైసలు పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. గత నెలలో వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత పెట్రో ధరలు వరుసగా నాలుగు రోజులు పెరిగాయి. తిరిగి పదిహేను రోజుల పాటు తగ్గుతూ వచ్చిన ఇంధన ధరలు.. సోమవారం మళ్లీ పెరిగాయి. సవరించిన ధరల ప్రకారం.. ఢిల్లీలో లీటరు ...9లో



కూటమిలో చేరని పార్టీలను

ఓడిస్తాం : అమిత్‌షా

ఈవీఎంలతో పొత్తు పెట్టుకున్నారా? : శివసేన

- బీజేపీ, శివసేన మధ్య మాటల యుద్ధం

వివరాలు 9లో



ఇందిరా గాంధీ సాధికారతకు ప్రతిరూపం

రిజర్వేషన్లు, కుల రాజకీయాలపై నమ్మకం లేదు

- మహిళలు రిజర్వేషన్ పొందాలి : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



వివరాలు 2లో

అగ్రవర్ణాల్లో పేదలకు

10 శాతం రిజర్వేషన్లు




నేడు పార్లమెంట్‌లో బిల్లు

- ఎన్నికల గిమ్మిక్కు అన్న ప్రతిపక్షం

న్యూఢిల్లీ : మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వ విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నది. దీనిపై ఓటింగ్ జరిగే అవకాశం వున్నది. రు.8 లక్షల్లోపు వార్షికాదాయం వున్న అగ్ర కులస్తులందరూ ఈ కోటా పరిధిలోకి రానున్నారు. దీర్ఘకాలంగా ఈ డిమాండ్ వున్నప్పటికీ ఎన్నికల వేళ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకున్నది. దీన్ని రాజకీయంగా చూడరాదని, ప్రజల మనోభావాలను గుర్తించి, వారి అవసరాలను తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని కేంద్ర మంత్రి విజయ్ సాంప్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతం మించరాదని పేర్కొంటూ 1992లో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే 2010లో మరో తీర్పు ఇస్తూ, రిజర్వేషన్లను ...9లో

క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన కేరళ సీఎం 9లో



ఆర్థికంగా వెనకబడిన ఉన్నత కులాలకు 10% రిజర్వేషన్ ప్రకటించిన మోడీ ప్రభుత్వం!

పంటల బీమా పథకం

లోపాలెన్నో!

నిధుల కొరత.. పరిహారం అందించడంలో నిర్లక్ష్యం



- కవరేజ్ ఏరియా 24 శాతంకన్నా తక్కువ
- చేరేందుకు ఆసక్తి చూపని రైతులు : పార్లమెంటరీ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ: కేంద్రం అమలు చేస్తున్న పంటలబీమా పథకాలను రైతులకు చేర్చడంలో తీవ్ర లోపాలున్నాయని పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ పథకాలవైపు రైతులను ఎక్కువ సంఖ్యలో ఆకర్షించేందుకు తగినన్ని నిధులు కేటాయించకపోవడాన్ని కమిటీ తప్పుపట్టింది. రైతుల అవసరాలకు తగినట్టుగా పథకాల అమలు తీరు లేదని విమర్శించింది. బీజేపీ సీనియర్ నేత మురళీమనోహర్‌జోషి నేతృత్వంలోని కమిటీ కేంద్రానికి పలు సిఫారసులు చేసింది.

వాతావరణ మార్పులపై జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఏపీసీసీ)పై 2018-19 అంచనాల కమిటీ తన 30వ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. సుస్థిర వ్యవసాయంపై ఏర్పాటైన జాతీయ మిషన్ రైతులపై దృష్టి సారించడంలో వైఫల్యం చెందినట్టు నివేదిక తెలిపింది. నాణ్యమైన విత్తనాలతో మెరుగైన వ్యవసాయ పద్ధతులను అనుసరించేందుకు రైతులకు



ప్రభుత్వం సహకరించాలని కమిటీ సూచించింది. 2016లో ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్ బీవై) పథకం.. విపత్తుల వల్ల లేదా ప్రతికూల వాతావరణం వల్ల పంట నష్టపోయిన రైతుల కోసమని కమిటీ గుర్తు చేసింది. ఈ పథకం అమలులో పారదర్శకత లోపించిందని కమిటీ విమర్శిం చింది. ప్రీమియం అధికంగా ఉండటం, పథకంలో చేరి పంట నష్టపోయిన రైతులకు బీమా సొమ్మును అందించకపోవడం లేదా ఆలస్యం చేయడం వంటి పలు లోపాల్ని ...9లో

అంగన్‌వాడీలో గర్భిణిపై దాడి

బయట పడిన పిండం.. పరిస్థితి విషమం

- టేకులపల్లి మండలంలో ఘటన



నవతెలంగాణ-టేకులపల్లి

అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం అడిగిన ఏడు నెలల గర్భిణి పొట్టపై ఆయా భర్త అతి కిరాతకంగా కాలుతో తన్నడంతో పిండం బయట పడింది. బాధితురాలి పరిస్థితి విషమంగా ...9లో

ఢిల్లీలో పార్టీ భవన్‌కు

జాగా ఇవ్వండి

ప్రధాని మోడీకి టీఆర్ఎస్ ఎంపీల విజ్ఞప్తి

- టీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలిచినా.. నాకు స్వీటివ్వలే : మోడీ

వివరాలు 9లో



అందరితోపాటే..

నామినేటెడ్ సభ్యుడి ప్రమాణం..

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం

- ఆంగ్లో ఇండియన్ సభ్యుడిగా స్టీఫెన్‌సన్ నియామకం
- గవర్నర్‌కు ప్రతిపాదనలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో ఎన్నడూ లేని విధంగా శాసనసభలోని ఇతర సభ్యుల మాదిరిగానే నామినేటెడ్ సభ్యుడితోనూ ప్రమాణ స్వీకారం చేయించాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది. ఆంగ్లో ఇండియన్ ఎల్విన్ స్టీఫెన్‌సన్‌ను నామినేటెడ్ సభ్యుడిగా నియమించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపింది. ఆయన ఆమోదించిన వెంటనే గెజిట్ విడుదల అవుతుంది.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సీఎం కేసీఆర్ అధ్యక్షతన సోమవారం ప్రగతి భవన్‌లో జరిగింది. నామినేటెడ్ సభ్యుడి నియామకంలో సాధారణంగా జాప్యం జరుగుతుంటుందని.. అందువల్ల ఇతర సభ్యులతో కలిపి ఆయన ప్రమాణ స్వీకారం చేయటమనేది సాధ్యపడటం లేదు. అందువల్ల విలువైన పదవీ కాలాన్ని కోల్పోతున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం ఈ సందర్భంగా పేర్కొంది. ఈ సమస్యను నివారించటానికి వీలుగా తొలి క్యాబినెట్ సమావేశంలోనే ...9లో



పెండింగ్ వేతనాల కోసం..

మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసిన కార్మికులు



నవతెలంగాణ- దేవరకొండ

మూడు నెలల పెండింగ్ వేతనాలివ్వాలనీ, 14 జీవో ప్రకారం కనీస వేతనమివ్వాలనీ డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్యాలయానికి తాళం వేశారు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా దేవరకొండలో జరిగింది. మున్సిపల్ ...9లో

రైతు రుణమాఫీ సమర్థనీయమే

అది ఓ ప్రోత్సాహకం : ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్



న్యూఢిల్లీ: రైతులకు రుణ మాఫీ చేయడం తప్పేమీకాదని ప్రతిష్టాత్మక నోబెల్ గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ స్పష్టం చేశారు. రుణమాఫీని కొందరు తప్పు పడుతున్నారు. కానీ, అది అంత చెడ్డదేమీకాదని సేన్ అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులకు అది ఓ ప్రోత్సాహకం. అదొక్కటే సరిపోదు. మరి కొన్ని ప్రోత్సాహకాలు కూడా వ్యవసాయ ...9లో

భద్రత లేని బతుకులు

సర్కారు పథకాల నిర్వాహకులకు కేంద్రం మొండిచేయి

మధ్యాహ్నభోజన కార్మికులకు గౌరవ వేతనం వెయ్యి రూపాయలే

- స్వచ్ఛ కార్మికులకు రూ.2,300..ఆశాలకు రూ.7,500లే
- ఇంత తక్కువ జీతాలతో బతికేదెట్టా అంటున్న కార్మికులు
- కార్పొరేట్లకు అప్పగించేందుకు కేంద్రం కుట్ర
- కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కనీస సౌకర్యాల కల్పన డిమాండ్‌తో సార్వత్రిక సమ్మెలో పాల్గొనున్న స్కీమ్ వర్కర్లు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భావి భారత పౌరులకు అన్నం వండి పెడుతున్న అమ్మలు అత్తెసరు గౌరవవేతనంతో బతుకులీడుస్తున్నారు. సర్కారు స్వచ్ఛంగా వేతనాలివ్వకపోవటంతో స్వచ్ఛకార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాలతో ఆశాలు నిరాశతో పని చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎం, కస్తూర్బాగాంధీ, సర్వశిక్షా అభియాన్, ఐకేపీ, అంగన్‌వాడీ, ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకాల్లో పనిచేస్తున్న ఏ ఒక్కరికీ సర్కారు కనీస వేతనాలు దక్కట్లేదు. అరకొర వేతనాలతో బతుకుతూ...మోడీ సర్కారు తుమ్మితే ఊడిపోయే ...9లో

కార్మికుల సత్తా చూపుతాం



ప్రజా వ్యతిరేక విధానాలపై నేడు,రేపు జాతీయ సమ్మె

- కార్మికుల హక్కుల పరిరక్షణకు ఢిల్లీలో భారీ ర్యాలీ : సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీకి కార్మికుల ఐక్యత చూపిస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ స్పష్టంచేశారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని ఆయన అభిప్రాయ పడ్డారు. సోమవారం పది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తపన్ సేన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా 8,9వ తేదీల్లో (మంగళ, బుధ వారాలు)దేశవ్యాప్తంగా జరిగే జాతీయ సమ్మెలో అన్నివర్గాలు పాల్గొంటున్నట్టు తెలిపారు. జాతీయ సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ, ధర్నాలు, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సంఘటితంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన మూడు సంవత్సరాల్లో కనీసం కార్మిక సంఘాలతో చర్చలు కూడా నిర్వహించలేదని... దాంతో పాటు కార్మిక హక్కులపై పెద్ద ఎత్తున దాడి జరుగుతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. హేతుబద్ధత ...9లో

పోలీసులపై దాడి చేయండి.. చంపండి

బెంగాల్ బీజేపీ నాయకుల వివాదాస్పద వ్యాఖ్యలు



కోల్‌కత: తెల్లవారు లేచింది మొదలు నిద్రపోయే దాకా పోలీసుల సహకారం లేకుండా అడుగుతీసి అడుగు బయటపెట్టలేని నాయకులు.. అధికారం అంది చూసుకుని వారిపై ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. బెంగాల్‌కు చెందిన ఇద్దరు బీజేపీ నాయకులు పోలీసులపై చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. 'ఈ జిల్లాలో ఉన్న పోలీసులతో ఏమీ కాదు. మీరు ఆయుధాలు పట్టుకుని తిరగండి. అలా ఉంటేనే వాళ్లు మన మాట వింటారు. మన ప్రత్యర్థులను ఏమీ అనొద్దు. వారిపై దాడి చేస్తే కేసులు నమోదవుతాయి. కానీ పోలీసులపై దాడి చేయండి.. మీ మాట వినకుంటే చంపేయండి. ఏమీ కాదు..' అంటూ బెంగాల్‌లో బీజేపీ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. వివరాల్లోకెళ్తే.. బర్దూమ్ జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు కలోసాన మండల్ సోమవారం తన మద్దతుదారులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు. తృణమూల్ కార్యకర్తలను ఏమీ అనవద్దని, వాళ్లు తమ ప్రత్యర్థులు కారని, పోలీసులే తమ ప్రత్యర్థులని అన్నారు. పోలీసులపై దాడి చేయాలని తన అనుచరులకు సూచించారు. మరో బీజేపీ నాయకురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు లాకెట్ చటర్జీ తన అనుచరులతో మాట్లాడుతూ.. 'మనం అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థ మీద ఆధారపడితే భవిష్యత్‌లో ఏమీ చేయలేం. గతంలో జరిగిన కొన్ని ఘటనలు ఇదే చెబుతున్నాయి. అందుకే.. ఆయుధాలు ధరించండి. మిమ్మల్ని మీరే రక్షించుకోండి' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఆకలిని తట్టుకోలేక

గిరిజన బాలిక ఆత్మహత్యాయత్నం

న్యూఢిల్లీ : ఆకలిని తట్టుకోలేక ఓ గిరిజన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాలో చోటుచేసుకున్నది. గత నెల 31న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రేషన్ షాపులో గోధుమలు ఇవ్వాలని పలుమార్లు బాలిక అభ్యర్థించినా.. వాటిని ఇవ్వకపోవడంతో ఆకలిని భరించలేక ఈ చర్యకు పాల్పడిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) విచారణ ప్రారంభించింది. ఈ సంఘటనపై దర్యాప్తు చేయడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు ఎన్‌సీపీసీఆర్ అధికారులు తెలిపారు.

ఉత్తరాదిన చలి 'పంజా'

న్యూఢిల్లీ : గత కొన్ని రోజులుగా ఉత్తరాది రాష్ట్రాలను మంచు దుప్పటి కప్పేస్తున్నది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్‌లో ఎముకలు కొరికే చలి, హిమాచల్‌ప్రదేశ్‌ను మూడు రోజుల శీతల వాతావరణం అనంతరం సూర్యుడు దర్శనమిచ్చాడు. ఢిల్లీలో ఆదివారం స్వల్పంగా వర్షం కురవడంతోపాటు కొంత మేర వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టింది. కానీ హిమపాతం అదే స్థాయిలో సంభవించింది. రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రత 7.1 డిగ్రీలు ఉండగా, గరిష్ట ఉష్ణోగ్రత 19 డిగ్రీలు నమోదయ్యాయి. పొగ మంచు వల్ల పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఉత్తరప్రదేశ్‌ను చలి వణికిస్తోంది. భారీగా కురుస్తున్న హిమపాతానికి లక్నో, తదితర ప్రాంతాల్లో పాఠశాలలను మరోసారి మూసివేయాల్సి వచ్చింది. అక్కడ కూడా తేలికపాటి వర్షాలు కురిసాయి. నాలుగు రోజులపాటు ఇంకా చలి వాతావరణం కొనసాగనుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జమ్ము కాశ్మీర్ ఏకంగా మంచుతో గడ్డకట్టుకుపోయింది. అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. జమ్ములోని ద్రాస్ పట్టణంలో మైనస్ 24.8 డిగ్రీలు నమోదు కావటంతో జలాశయాలన్నీ గట్టకట్టుకుపోయాయి. నీటి సరఫరా కూడా పూర్తిగా స్థంభించిపోయింది. చలి తీవ్రతతో పాటు వర్షాలతో గజగజ వణికిన హిమాచల్ ప్రదేశ్ ప్రజానీకం మూడురోజుల అనంతరం సూర్యుని వెలుతురు రావటంతో కొంతమేర ఉపశమనం పొందారు.

యువకుడిని చితకబాదిన ఐఏఎస్

కోల్‌కత: తన భార్యపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణతో ఓ యువకుడిని చితకబాదాడో ఐఏఎస్ అధికారి. ఈ ఘటన బెంగాల్‌లోని అలీపుర్‌దౌర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. నిఖిల్ నిర్మల్ అలీపుర్‌దౌర్ జిల్లా మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్నారు. అదే జిల్లాకు చెందిన ఓ యువకుడు.. నిఖిల్ భార్య ఫేస్‌బుక్ పేజీలో అసభ్యకర వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. దీనిపై మొదలు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ అధికారి.. తర్వాత యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. అక్కడ తన భార్యతో కలిసి నిందితుడిని చితకబాదారు. అంతేగాక 'ఈ జిల్లాలో నువు ఎక్కడికి వెళ్లినా నాపై చర్య తీసుకోకుండా నేను చేస్తాను. నీ ఇంటికొచ్చి నిన్ను చంపేస్తా' అంటూ ఆ యువకుడిని బెదిరించారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్ అవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇదంతా పోలీసుల ఎదుటే జరుగుతున్నా వారు చూస్తూ ఉండటం గమనార్హం.

మిమ్మల్ని రెండేండ్ల క్రితమే విడిచిపెట్టాం...!

బీజేపీ 'ఒంటరిపోరు'పై శివసేన

ముంబయి: బీజేపీ అహంకారమే ఆ పార్టీని అందరికీ దూరం చేస్తోం దని శివసేన ఘాటుగా విమర్శించింది. మహారాష్ట్రలో బీజేపీ ఒంటరి గానే పోటీ చేస్తుందంటూ ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా చేసిన ప్రకటనపై శివసేన తీవ్రంగా స్పందించింది. శివసేన నేత సంజయ్ రౌత్ సోమ వారం ఇక్కడ ఒక మీడియాతో మాట్లాడారు. 'మిమ్మల్ని రెండేండ్ల క్రితమే విడిచిపెట్టేశాం. మిమ్మల్ని వద్దనుకున్నాం. అయినా మమ్మల్ని ఎందుకు పట్టుకొని వెంటాడుతున్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా ప్రజలు మిమ్మల్ని వద్దనుకున్న విషయాన్ని మరచి పోవద్దు. మేం గత 50 ఏళ్లుగా ప్రజలతో మమేకమై వుండబట్టే ప్రస్తుత స్థితిలో కొనసాగుతున్నాం' అని వ్యాఖ్యానించారు. లాటూర్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ 'ఏదైనా పొత్తు కుదిరితే భాగస్వామ్య పార్టీ అభ్యర్థులకు కూడా మనం సహకరిస్తాం. శివసేనతో పొత్తుపై ఆలోచించాల్సిన పని లేదు. ఒంటరి పోరుకు సమా యత్తం కండి' అని పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన రౌత్ 'మీ వైఫల్య భయం తోనే మీరీ మాటలు మాట్లాడుతున్నారు. ఓటమి భయం మీకు.. మాకు కాదు. ఎదుటివారికి గుండెపోటు (ఓటమి) అంటూ ఎందు కు మాట్లాడ తారు? ఐదు రాష్ట్రాల ఎన్నికలతో గుండెపోటు వచ్చింది మీకు.ఈ రాష్ట్రాల ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టేశారు. ఇంకా అహంకా రంతో మాట్లాడితే మహారాష్ట్ర ప్రజలు కూడా మీకు ఇదే శాస్తి చేస్తారు' అని అన్నారు.

గతేడాది 80మంది ఆర్మీ జవాన్ల ఆత్మహత్య

- ఎయిర్‌ఫోర్స్‌లో 16మంది, నేవీలో 8మంది బలవన్మరణం

న్యూఢిల్లీ: దేశ సరిహద్దులో ధైర్యంగా గస్తీ చేపట్టే జవాన్లలో ఆత్మస్థైర్యం సడలుతోంది. పై అధికారుల ఒత్తిళ్లు, కఠిన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే జవాన్లు మానసికంగా వేధనకుగురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. యోగా, ధ్యానం, మానసిక కౌన్సెలింగ్ కార్యక్రమాలు, పై అధికారులతోపాటు ఇతర ర్యాంక్ అధికారుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. జవాన్ల ఆత్మహత్యలు మాత్రం ఆగడం లేదు. గతేడాదిలో అంతకు క్రితం ఏడాది కంటే ఎక్కువ మంది ఆర్మీ జవాన్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. గత మూడేండ్ల(2016- 18)లో డిఫెన్స్‌లో 334 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. వైమానిక, నావికా దళాల్లో కంటే ఆర్మీలో అధికంగా ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయి. గతేడాది 80మంది ఆర్మీ జవాన్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. 2017లో 75మంది ఆర్మీ జవాన్లు ఆత్మహత్య చేసుకున్నారు. గతేడాది వైమానిక దళంలో 16మంది, నావికా దళంలో ఎనిమిది మంది ఆత్మహత్య చేసుకున్నట్టు కేంద్ర రక్షణ సహాయ మంత్రి సుభాశ్ భామ్రే రాజ్యసభకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు. కాగా, 2016లో 104 మంది ఆర్మీ జవాన్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. 2017లో ఎయిర్‌ఫోర్స్‌లో 21 మంది, 2016లో 19మంది ఆత్మహత్య చేసుకోగా, 2017లో నేవీలో ఐదుగురు, 2016లో ఆరుగురు ఆత్మహత్యలకు పాల్పడినట్టు కేంద్ర మంత్రి వివరించారు.

లెఫ్ట్ కార్యకర్తలపై టీఎంసీ దాడులు

సమ్మె విజయవంతానికి వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల పోరాటం



సమ్మె ప్రచారంలో లెఫ్ట్ కార్యకర్తలు

కోల్‌కతా : కేంద్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు సృష్టిస్తున్న అడ్డంకులను అధిగమించి ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సాధారణ సమ్మెను విజయవంతం చేసేందుకు వామపక్షాలు, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు పోరాటం చేస్తున్నాయి. రాష్ట్రంలోని మమతా బెనర్జీ ప్రభుత్వం ఇతర రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు భిన్నంగా ఈ సమ్మెకు వ్యతిరేకంగా దుర్మార్గమైన సర్క్యులర్ జారీ చేసింది. ఉపాధ్యాయులతో సహా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులెవరైనా ఈ తేదీల్లో విధుల్లోకి హాజరుకాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. అలాగే ఈ రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వ ఆఫీసులు పనిచేసే విధంగా పోలీసులు రక్షణ ఏర్పాట్లు చేయాలని మరొక ఉత్తర్వుల్లో ఆదేశాలు ఇచ్చింది. కాగా, మరోవైపు ఈ సమ్మెను విజయవంతంగా చేయాలని ప్రచార ర్యాలీలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) కార్యకర్తలపై టీఎంసీ కార్యకర్తలు దాడులకు దిగుతున్నారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఉషతి వద్ద జరిగిన దాడిలో ఇద్దరు సీపీఐ(ఎం) కార్యకర్తలు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న ర్యాలీలకు మంచి స్పందన వస్తోంది. ఈ ర్యాలీల్లో వందలాది మంది సామాన్య ప్రజలు, శ్రామికులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. టీఎంసీ కార్యకర్తల 'డెన్'గా పేరొందిన కమలగజి ప్రాంతంలో వారికి భయపడకుండా ర్యాలీలకు ప్రజానీకం భారీగా కదలిరావడం విశేషం. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సూర్యకాంత మిశ్రా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతిపాదిస్తున్న ఫెడరల్ ఫ్రంట్ బీజేపీకి మద్దతునిచ్చేందుకేనని అన్నారు. రెండు రోజుల సమ్మెను అడ్డుకోవాలని చూస్తే శ్రామిక వర్గం నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని సూర్యకాంత మిశ్రా, లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు, 17 వామపక్ష పార్టీల ప్రతినిధులు హెచ్చరించారు. కాబోయే ప్రధాని మంత్రి రేసులో మమతాబెనర్జీ కూడా ఉన్నారని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ దిలీప్ ఘోష్ వ్యాఖ్యలు చూస్తే, రానున్న ఎన్నికల కోసం బీజేపీ – టీఎంసీ మధ్య ఒప్పందం కుదిరినట్టు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు.

మిమ్మల్ని జైలుకు పంపిస్తాం

ఐటీ చట్ట దుర్వినియోగంపై అధికారులకు 'సుప్రీం' హెచ్చరిక

న్యూఢిల్లీ : సమాచార సాంకేతిక చట్టం(ఐటీ)లో తొలగించిన సెక్షన్ కింద అరెస్టులు చేయడాన్ని నిరోధించడంలో విఫలం కావడంతో ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం తప్పుపట్టింది. సైబర్, ఈ కామర్స్ నేరాలపై చర్యలకు అనుమతి కల్పించే ఐటీ చట్టంలోని 66(ఎ) సెక్షన్‌ను అస్పష్టమైన, రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంటూ 2015లో సుప్రీం తీర్పునిచ్చింది. అయినప్పటికీ ఈ సెక్షన్ కింద 22 మందిపై విచారణ జరిగిందని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పీయూసీఎల్) అనే ఎన్‌జీవో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు... ఈ సెక్షన్ కింద అరెస్టు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ రోహింగ్టన్ నారిమన్, వినీత్ శరణ్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. మీడియా కథనాలు, జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నుండి సేకరించిన సమాచారం, ఆన్‌లైన్‌లోని డేటాబేస్ కేసుల ఆధారంగా పరిశోధించి పిటిషన్ దాఖలు చేసినట్టు పీయూసీఎల్ వెల్లడించింది. ఈ డేటా సంబంధిత అంశాలపై సమగ్ర సమాచారం అందించలేదని, శ్రేయా సింఘాల్ కేసులో ఈ సెక్షన్ చెల్లదని తీర్పు వెలువడినా.. ఇంకా ఈ సెక్షన్ కొనసాగు తుందని పిటిషన్‌లో పేర్కొంది. ఈ సెక్షన్ రద్దుకు ముందు ..ఇంటర్నెట్‌లో అభిప్రాయాలను వెల్లడిస్తున్న వారిని అరెస్టులు చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే సెక్షన్ 66(ఎ)ను తొలగించాలని సామాజిక కార్యకర్తలు పిటిషన్‌లు దాఖలు చేయడంతో 2015లో ఈ సెక్షన్ చట్టవిరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది.

పౌరసత్వ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం

నేడు లోక్‌సభముందుకు వచ్చే అవకాశం

- వ్యతిరేకిస్తున్న మిత్రపక్షాలు శివసేన, జేడీయూ
- రాజ్యాంగ విరుద్ధం : కాంగ్రెస్, తృణముల్, సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ: బీజేపీ ఎన్నికల వాగ్దానమైన వివాదాస్పద 'పౌరసత్వ సవరణ బిల్లు'కు కేంద్ర క్యాబినెట్ సోమవారం ఆమోదం తెలిపింది. బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన ముస్లింయేతరులకు భారతపౌరసత్వాన్ని కల్పించడం బిల్లు ముఖ్యోద్దేశం. ఈ విషయాన్ని అధికారిక వర్గాలు ధ్రువీకరించాయి. ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర క్యాబినెట్ బిల్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బిల్లు నేడు లోక్‌సభ ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని అధికారిక వర్గాల సమాచారం. 2016లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై జాయింట్ పార్లమెంటు కమిటీ(జేపీసీ) నివేదికపై లోక్‌సభలో ప్రజంటేషన్ అనంతరం కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. కాగా, బిల్లుకు ఈశాన్య భారతదేశం నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా అసోంతో పాటు ఇతర ఈశాన్యరాష్ట్రాలు బిల్లుకు వ్యతిరేకంగా నిరసనను వ్యక్తం చేస్తున్నాయి. అఫ్ఘానిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ లాంటి దేశాల నుంచి భారత్‌కు వచ్చిన మైనారిటీ ప్రజలకు(హిందువులు, సిక్కులు,బుద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులు) ఆరేండ్ల తర్వాత ఎలాంటి పత్రాలు అవసరం లేకుండా మనదేశ పౌరసత్వం కల్పించాలంటే 'పౌరసత్వ చట్టం 1955'లో సవరణ చేయాల్సి ఉంటుంది. అంతక ముందు ఇది 12 సంవత్సరాలుగా ఉండేది.

బిల్లుకు వ్యతిరేకంగా నేడు ఈశాన్య విద్యార్థి సంఘాల బంద్

పౌరసత్వ చట్టం సవరణకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈశాన్య భారతదేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈశాన్యంలో తీవ్రంగా ప్రభావితం చూపే ఎనిమిది విద్యార్థి సంఘాలు, అసోంలోని 40కి పైగా సామాజిక–సాంస్కృతిక సంస్థలు మంగళవారం 11 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. కాగా, మతం ఆధారంగా చేసుకొని పౌరసత్వాన్ని కల్పించడం రాజ్యాంగానికి విరుద్ధమని, లౌకిక దేశంలో ఇది సరైనది కాదని కాంగ్రెస్, సీపీఐ(ఎం), తృణముల్ సహా పలుపార్టీలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లు విషయంలో బీజేపీ మిత్రపక్షాలైన శివసేన, జేడీయూల నుంచి కూడా ఎదురుగాలి వీస్తున్నది. బిల్లును పార్లమెంటులో అడ్డుకుంటామని ఆ రెండు పార్టీలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే దేశవిభజన సమయంలో బాధితులైనవారికి భారత ఒక సురక్షిత ప్రాంతమని, పౌరసత్వ బిల్లు పార్లమెంటులో పాస్ అవుతందన్న ఆశాభావాన్ని ప్రధాని మోడీ అసోంలోని సిల్చార్‌లో ఇటీవల మాట్లాడుతూ ఆశాభావం వ్యక్తం చేశారు.



బీజేపీకి మరోషాక్ కూటమి నుంచి ఏజీపీ బయటకు

గువహతి : లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీకి మరో గట్టి షాక్ తగిలింది. కమలం పార్టీకి మరో పార్టీ కటీఫ్ చెప్పింది. అసోం ప్రభుత్వ నుంచి వైదొలుగుతున్నట్టు బీజేపీ మిత్రపక్షం అసోం గణపరిషత్ (ఏజీపీ) సోమవారం ప్రకటించింది. పౌరసత్వం (సవరణ)బిల్లు–2016ని నిరసిస్తూ ఏజీపీ ఈ నిర్ణయం తీసు కుంది. పౌరసత్వం బిల్లుతో అసోం ప్రజల ఉనికికి ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందనీ ఏజీపీ ఆరోపి స్తున్నది. ఆ బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేసినా బీజేపీ హైకమాండ్ పట్టించుకోలేదని విమర్శించింది. తమకు అసోం ప్రజల ప్రయోజనాలు ముఖ్యమనీ, అందుకే బీజేపీ ప్రభుత్వం నుంచి తప్పుకుంటున్నట్టు స్పష్టం చేసింది. తమ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే గతంలో ఆ పార్టీతో చేతులు కలిపామనీ, కానీ బీజేపీ దానినే ఫణంగా పెడుతుంటే చూస్తూ ఊరుకోబోమని అతుల్ బోరా ఏజీపీ చీఫ్ అన్నారు. ఈ చట్టంతో అస్సామీల సంస్కతి, సంప్రదాయాలతో పాటు తమ ఉనికి దెబ్బతినే ప్రమాద ముందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రజల ఆందోళనకు మద్దతు ప్రకటించిన ఏజీపీ, ఎన్డీయేకు గుడ్‌బై చెప్పింది. ఇప్పటికే పలు పార్టీలు ఎన్డీయేకు గుడ్‌బబై చెప్పాయి. చంద్రబాబు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ, ఉపేంద్ర కుశ్వాహ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీలు ఎన్డీయే నుంచి బయటకు వచ్చాయి.. అటు శివసేన సైతం బీజేపీపై బాహాటంగా విమర్శలుచేస్తున్నది.

వారం ముందు నోటీసు తప్పనిసరి

రాష్ట్రంలో హర్తాళ్లపై కేరళ హైకోర్టు

తిరువనంతపురం: కేరళలో మెరుపు హర్తాళ్లను ఆరాష్ట్ర హైకోర్టు నిషేధించింది. బంద్‌కు పిలుపునిచ్చే రాజకీయపార్టీలు, సంస్థలు ఏవైనా వారం రోజుల ముందే అందుకు సంబంధించిన నోటీసును ఇవ్వడాన్ని న్యాయస్థానం తప్పనిసరి చేసింది. అలాగే బంద్‌లపై పౌరుడెవరైనా వారం రోజుల్లోగా సవాలు చేయొచ్చని ప్రధాన న్యాయమూర్తి హృషికేశ్ రాయ్, న్యాయమూర్తి ఎకె జయశంకరన్ నంబియార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఆందోళనల సమయంలో జరిగే ఆస్థినష్టానికి పిలుపునిచ్చిన సంస్థలు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న హర్తాళ్లకు వ్యతిరేకంగా కేరళ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) విచారించిన హైకోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

అలాగే నేటి అర్ధరాత్రి నుంచి మొదలయ్యే 48 గంటల బంద్ నేపథ్యంలో ప్రజలకు రక్షణ కల్పించాలని పాలక యంత్రాంగానికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. బంద్ సమయంలో హింస జరిగితే అది రాజ్యాంగ విరద్ధమని అది పౌరుల ప్రాథమిక హక్కులపై ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయపడింది. నిరసన తెలిపే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని, కానీ అందులో పాల్గొనాలంటూ ఎవరూ ఒత్తిడి చేయకూడదని వివరించింది. శబరిమలలో మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ ఆరెస్సెస్ అనుబంధ సంస్థ శబరిమల కర్మ సమితి ఈనెల 3న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన కొన్ని రోజుల అనంతరం కోర్టు ఈ తీర్పును వెలవర్చడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకోగా, ఆస్థినష్టం కూడా జరిగింది.

బెదిరింపులకు భయపడేది లేదు: కేరళ సీఎం



శబరిమల అంశంపై రాష్ట్రంలో హింస, అల్లర్లకు ఆజ్యం పోస్తున్న బీజేపీ, ఆరెస్సెస్‌లపై కేరళ సీఎం పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి బెదిరింపులకు తమ ప్రభుత్వం భయపడబోదని విజయన్ స్పష్టంచేశారు. కేరళలో వామపక్ష ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ విధంగా స్పందించారు. రాష్ట్రంలో హింస, అల్లర్లను అదుపులో పెట్టడానికి కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఆరెస్సెస్ చేసే అకృత్యాలకు ఎలాంటి చర్యలుండవు, కానీ కేరళలో అలాంటి వారికి మాత్రం రక్షణ ఉండదని తెలిపారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలకు భంగం కలిగించడానికి సంఘ్‌పరివార్ ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. గతకొన్ని రోజులుగా ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలు రాష్ట్రంలో వామపక్ష పార్టీల కార్యాలయాలు, మీడియా కార్యాలయాలను, ప్రభుత్వ ఆస్థులను ధ్వంసం చేస్తూ హింసను పెంచి పోషిస్తున్నాయన్నారు. హర్తాళ్లలో ప్రయివేటు ఆస్థుల ధ్వంసానికి వ్యతిరేకంగా ఆర్డినెన్సు తీసుకురావడానికి క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని విజయన్ తెలిపారు. కాగా, రాష్ట్రంలో అల్లర్లకు సంబంధించి ఇప్పటి వరకు 2,182 కేసులు నమోదయ్యాయని, 6,711 మంది అరెస్టయ్యారని పోలీసులు వెల్లడించారు.

అశ్లీల పాటలకు డాన్సులు..

ఆ పై లైంగికదాడి

ముజఫర్‌పూర్ షెల్టర్ హోం హారర్‌ను బయటపెట్టిన సీబీఐ

పాట్నా/లక్నో: : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ముజఫర్‌పూర్ షెల్టర్ హోం ఘటనకు సంబంధించి భయానక వాస్తవాలను సీబీఐ బహిర్గతం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు బ్రిజేశ్ ఠాకూర్ 'అతిథులు' హోంలో చిన్నపిల్లలకు పొట్టి దుస్తులువేయించి.. అశ్లీల పాటలకు డ్యాన్సులు వేయించేవారనీ, అనంతరం లైంగికదాడికి పాల్పడేవారనీ సీబీఐ పేర్కొంది. అలా డ్యాన్సులు వేయడానికి నిరాకరించిన పిల్లలకు ఆ రోజు రాత్రి కేవలం ఒక రొట్టి, ఉప్పు ఇచ్చేవారనీ, డాన్సులు చేసిన పిల్లలకు మాత్రం మంచి భోజనం పెట్టేవారనీ తెలిపింది. షెల్టర్ హోంలో చోటుచేసుకున్న భయానక ఘటనలకు సంబంధించి దర్యాప్తు చేసిన సీబీఐ 73 పేజీల చార్జిషీటును పోస్కో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తికి ఇటీవల సమర్పించింది. పిల్లల సంరక్షణ అధికారులు సైతం పలు సందర్భాల్లో వారిపై లైంగికదాడికి పాల్పడినట్టు తెలిపింది. హెల్త్ చెకప్ పేరుతో వైద్యుడిని రప్పించి వారికి అబార్షన్ మాత్రలు ఇచ్చేవారిని చార్జిషీట్‌లో పేర్కొంది. కీలక నిందితుడు బ్రిజేశ్ ఠాగూర్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నడుపుతున్న ఈ షెల్టర్ హోం దారుణాలు 2017 ఏప్రిల్‌లో వెలుగులోకి రావడంతో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు చేపట్టిన విషయం తెలిసిందే.



లైంగికదాడి కేసు ఉపసంహరించుకోలేదని... మహిళకు నిప్పంటించిన దుండగులు.. యూపీలో ఘటన

మహిళపై సామూహిక లైంగికదాడికి పాల్పడటమే గాక ఆ కేసును ఉపసంహరించుకోలేదనే ఆరోపణతో ఆమె ఒంటికి నిప్పంటించిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే... షమ్లి జిల్లా కైరానాకు చెందిన మహిళపై నెలన్నర క్రితం ముగ్గురు దుండగులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, నాలుగు రోజుల క్రితం ఆ మహిళ ఉంటున్న ఇంట్లోకి అక్రమంగా చొరబడిన దుండగులు.. కేసును ఉపసంహరించుకోవాలని ఆమెపై ఒత్తిడి తెచ్చారు. రాజీకి రాకుంటే చంపేస్తామని హెచ్చరించారు. కానీ, దీనికి ఆమె తిరస్కరించడంతో కుటుంబసభ్యులు చూస్తుండగానే నిందితులు తన ఒంటికి నిప్పంటించారు. ఈ ఘటనలో ఆమె చాతి, కాలి భాగాలు తీవ్రంగా కాలిపోయాయి. దీంతో ఆమెను హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే, బాధితురాలి ఫిర్యాదుని కాకుండా.. వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఆమె ఒంటికి నిప్పంటుకుందని పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దీనిపై బాధితురాలు స్పందిస్తూ.. నిందితులతో పోలీసులు కుమ్మక్కయ్యారని ఆరోపించింది. తనపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలిపింది.

యూపీ బాలికపై కాలేజీ బహిష్కరణ ఉత్తర్వులు రద్దు

లక్నో: తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న దుండగులకు తగిన బుద్ధి చెప్పినందుకు గానూ కాలేజీ నుంచి బహిష్కరణకు గురైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ బాలికపై.. కళాశాల యాజమాన్యం ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. వివరాల్లోకెళ్తే... ఖుషీనగర్‌కు చెందిన బాలిక స్థానిక ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 3న కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా రోడ్డుపై ఇద్దరు దుండగులు ఆమెపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ లైంగిక వేధింపులకు దిగారు. నిందితులకు ఆ బాలిక తగిన బుద్ధి చెప్పింది. చుట్టు పక్కల సహాయం కోసం చూడకుండా వారిని తన చెప్పుతో కొట్టింది. కాగా, ఈ విషయం తెలిసిన కాలేజీ యాజమాన్యం.. ఆ బాలికను కళాశాల నుంచి బహిష్కరించింది. కానీ, ఓ మీడియా చానల్ ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసింది. కళాశాల యాజమాన్యంతో మాట్లాడిన సదరు అధికారులు వారిపై మండిపడ్డారు. ఆమెను తిరిగి కళాశాలలో చేర్చుకోవాలని వారికి సూచించారు. దీంతో, ఆ బాలికను మళ్లీ కాలేజీలోకి చేర్చుకుంటున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇందిరాగాంధీ సాధికారతకు ప్రతిరూపం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నాగ్‌పూర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి ప్రతిపక్ష పార్టీ నాయకురాలిని ప్రశంసించి దుమారం రేపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళా సాధికారతకు ప్రతిరూపమని ఆయన నాగ్‌పూర్‌లో మహిళ స్వయం సహాయక సంఘాలు నిర్వహించిన ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. రిజర్వేషన్, కుల రాజకీయాల్లో తనకు నమ్మకం లేదని అన్నారు. 'ఈ దేశంలో ఇందిరా గాంధీ లాంటి నాయకులున్నారు. ఆమె సమకాలీనులైన ఎందరో దిగ్గజ పురుష నేతలను ఎదుర్కొన్నారు. ఆమెకు ఏమైన రిజర్వేషన్ లభించిందా?' అని అన్నారు. 'మహిళలు రిజర్వేషన్ పొందాలి. దాన్ని నేను వ్యతిరేకించడం లేదు. కానీ ఒకరి పురోగతి వారి కులం, లింగం, భాష, మతం ఆధారంగా ఉండద'ని వివరించారు. గడ్కరీ పార్టీ(బీజేపీ) ఇందిరా గాంధీని ఎమర్జెన్సీ విషయంలో తరుచుగా విమర్శిస్తుంటుంది. కానీ ఆయన ఇందిరాను ప్రశంసించడం దుమారం రేపింది. అయితే ఇందిరాతోపాటు బీజేపీ నేతలు సుష్మా స్వరాజ్, వసుందరా రాజే, సుమిత్రా మహాజన్‌ల పేర్లనూ తర్వాత ప్రస్తావించారు.

15 నిమిషాలివ్వండి చాలు!

- రాఫెల్‌పై ప్రధాని చర్చకు రావాలి : రాహుల్ గాంధీ డిమాండ్
- హెచ్‌ఏఎల్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని ఆవేదన

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం కావాలని ప్రధాని నరేంద్ర మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. పార్లమెంట్ వెలుపల విలేకర్లతో సోమవారం మాట్లాడుతూ ప్రధానితో మాట్లాడేందుకు ఒక్క 15నిముషాలు సమయం ఇస్తే చాలనీ, అన్ని విషయాలు రుజువు చేస్తాననీ, ఈ దేశం వాస్తవాలను తెలుసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)ను ప్రభుత్వం బలహీన పరచడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ సంస్థను దెబ్బ తీస్తూ ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని అన్నారు. హెచ్‌ఏఎల్‌ను బలహీనపరచాలన్నది ప్రభుత్వ వ్యూహంగా వుందన్నారు. ఆ సంస్థకు నిధులివ్వకుండా, దేశ వ్యూహాత్మక సామర్థ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానితో ముఖాముఖి చర్చ జరపాలన్న తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 'ప్రధాని మోడీ లోక్‌సభ అంటే భయపడుతున్నారు. ప్రశ్నిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే సభకు రావడం లేదు' అని వ్యాఖ్యానించారు. హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల విలువ చేసే కాంట్రాక్టులు ఇచ్చామంటూ రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో అబద్దాలు చెబుతున్నారని రాహుల్ విమర్శించారు. సభలో చాలాసేపు చాలా విషయాలు మాట్లాడారు కానీ తాను అడిగిన వాటిని సమాధానాలు చెప్పలేదన్నారు. రాఫెల్ ఒప్పందంలో ప్రధాని జోక్యం చేసుకున్నారా లేదా అన్న తన ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పలేదన్నారు.

30వేల మంది 'బెస్ట్' వర్కర్ల నిరవధిక సమ్మె

- ముంబయిలో అర్ధరాత్రి నుంచి మొదలైన నిరసన

ముంబయి: బృహన్‌ముంబయి ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు(బీఈఎస్‌టీ–బెస్ట్) కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగారు. తమ డిమాండ్లను నెరవేర్చడంలో అడ్మినిస్ట్రేషన్ అలసత్వం వహిస్తోందని దాదాపు 30 వేల మంది బెస్ట్ వర్కర్లు.. బస్సు డ్రైవర్లు, కండక్టర్లు సహా నిరసనకు దిగారు. 2007 తర్వాత నియామకమైన కార్మికులకు మాస్టర్ గ్రేడ్‌కింద వేతనాలు, బెస్ట్ బడ్జెట్‌ను బృమన్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కి చెందిన ఎ విభాగపు బడ్జెట్‌లో విలీనం, 2016 మేలో అందజేసిన డిమాండ్లపై చర్చించాలని బెస్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శశాంక్ రావు డిమాండ్ చేశారు. హామీలనివ్వడం కాదు, తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆయన అన్నారు. కాగా, బెస్ట్ హెడ్‌క్వార్టర్‌లో సోమవారం జరిగిన ఓ సమావేశం తర్వాత బెస్ట్ సంయుక్త కామ్‌గర్ కృతి సమితి సోమవారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె కారణంగా 3,300 బస్సులు డిపోలోనే నిలిచిపోయాయి.

దేవునికి అందరూ సమానమే

శబరిమలలో హింసను ప్రేరేపిస్తున్న బీజేపీ

సమానత్వ హక్కును కాలరాస్తున్న మతోన్మాదులు

- మనుధర్మం అమలైతే రాజ్యాంగం, కోర్టులెందుకు
- కేరళలో సాంస్కృతిక పునరుజ్జీవ పోరాటం
- సంఘసంస్కర్తగా మారిన పినరయి విజయన్
- సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి: టీమాస్ చైర్మెన్ కంచ ఐలయ్య


మాట్లాడుతున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేవునికి అందరూ సమానమేనని తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక (టీమాస్) చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. మహిళలను శబరిమలలోకి ఆహ్వానించాలని చెప్పిన సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తున్న కేరళ ప్రభుత్వానికి అభినందనలు చెప్పారు. కానీ మహిళల ప్రవేశాన్ని అడ్డుకుంటూ కేరళలో దాడులు, బాంబులతో భయభ్రాంతులకు గురిచేస్తూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు హింసను ప్రేరేపిస్తున్నారని అన్నారు. స్త్రీ, పురుషుల సమానత్వపు హక్కును సంఘ్‌పరివార్, మతోన్మాద శక్తులు కాలరాస్తున్నాయని విమర్శించారు. కేరళలో సాంస్కృతిక పునరుజ్జీవన పోరాటం జరుగుతోందనీ, అందరూ అండగా నిలబడాలనీ చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచ ఐలయ్య మాట్లాడుతూ కనకదుర్గ, బిందు ఇద్దరు మహిళలు శబరిమల ఆలయంలోకి వెళ్లడాన్ని స్వాగతించారు. శబరిమల పరిరక్షణ సమితి పేరుతో బీజేపీ అనుబంధ సంఘం అలజడి సృష్టిస్తోందని విమర్శించారు. త్రిపుల్‌తలాక్ విషయంలో మహిళల మనోభావాలను గౌరవించే బీజేపీ శబరిమల విషయంలో సుప్రీం కోర్టు తీర్పును ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. ఆధ్యాత్మిక రంగంలోనూ స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. జోతిబాపూలే, కందుకూరి వీరేశలింగం వంటి వారు స్త్రీ సమానత్వం కోసం ఎన్నో పోరాటాలు చేశారని చెప్పారు. నెలసరి స్త్రీల జీవితంలో ఓ భాగమని అన్నారు. దాన్ని అపవిత్రం అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మొన్నటి వరకు ఆవులు పవిత్రమని, ఇప్పుడు ఆడవారు అపవిత్రమని అవమానపరుస్తున్నారని విమర్శించారు. మనుధర్మం ప్రకారం నడుచుకుంటే రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సుప్రీం కోర్టు ఎందుకని ప్రశ్నించారు. శబరిమల అంశాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందనీ, కాంగ్రెస్ మద్దతు పలకడం శోకనీయమని అన్నారు. ఆడవారిని అపవిత్రం అనడం అమానవీయమని చెప్పారు. మహారాష్ట్రలో శనిసింగాపూర్ దేవాలయంలో కోర్టు ఆదేశాలతో మహిళలను బీజేపీ ప్రభుత్వం అనుమతి ఇస్తోందని అన్నారు. శబరిమలలో మాత్రం వ్యతిరేకించడం బీజేపీ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. ఆడమగ పుట్టుక, జీవించడం సమానమని అన్నారు. మూఢనమ్మకంతో ఆలయంలోకి ప్రవేశం లేదనడం సరైంది కాదన్నారు. కేరళలో సాంస్కృతిక పునరుజ్జీవన పోరా టానికి అందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కేరళ సీఎం పినరయి విజయన్ సంఘసంస్కర్తగా మారారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సమానత్వపు హక్కుల కోసం నిలబడ్డ మొదటి ముఖ్యమంత్రి అని అభినర్ణించారు. అమెరికాలో నల్లజాతీయుల హక్కుల కోసం అబ్రహాం లింకన్ పోరాడారని గుర్తు చేశారు. ఈనెల 8,9 తేదీల్లో కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నాలుగున్నరేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఏ రంగంలోనూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలివ్వలేదనీ, యువ తకు ఉద్యోగాలివ్వలేదనీ విమర్శించారు. దేశంలో ఆర్థిక సంక్షోభం ఉందన్నారు. బీజేపీ పాలిత కొన్ని రాష్ట్రాల్లో పశువుల అమ్మకాలపై నిషేధం విధించడం వల్ల సంక్షోభం వచ్చిందని చెప్పారు. పశువులకు మేతలేక, వాటిని పోషించలేక రైతులు పట్టణాల్లో వదిలేస్తున్నారని అన్నారు. అవి చనిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. దేశాన్ని కాపాడాలంటేబీజేపీ ఆలోచనా విధానం మారాలని అన్నారు.

బీజేపీని గద్దెదించాలి : టీమాస్ నేతలు

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గద్దెదించాలని టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ, నేతలు పి ఆశయ్య, కిల్లెగోపాల్ పిలుపునిచ్చారు. సార్వత్రిక సమ్మెలో లేవనెత్తిన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేందుకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడం వల్ల రిజర్వేషన్లు నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. ప్రయివేటురంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలు, భూమిలేని వారికి భూపంపిణీ చేయాలని అన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం లేదన్నారు. కేరళ సీఎం కమ్యూనిస్టు, నాస్తికుడు కాబట్టే శబరిమలలోకి మహిళలను ఆహ్వానిస్తున్నారని చెప్పడం సరైంది కాదనీ, మతవిశ్వాసాలను కాపాడేందుకే సుప్రీం తీర్పును అమలు చేస్తున్నారని అన్నారు. వీడీసీల పేరుతో దళితులను సాంఘిక బహిష్కరణ చేస్తున్న పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్, హోంమంత్రి మహమూద్ అలీ దీనిపై స్పందించాలని కోరారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశభక్తి ముసుగులో ప్రయివేటురంగాన్ని ప్రోత్సహిస్తోందనీ, ప్రభుత్వరంగ సంస్థల్లోకి ఎఫ్‌డీఐలను ఆహ్వానిస్తోందనీ అన్నారు. ఈ కార్యక్రమలో టీమాస్ నేత ఆర్ శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలకపార్టీల మద్దతుతోనే వీడీసీల ఆగడాలు



ధర్నా చేస్తున్న నాయకులు

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి: స్కైలాబ్‌బాబు
- కలెక్టరేట్ ఎదుట వామపక్ష, ప్రజా సంఘాల ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

పాలక పార్టీల మద్దతుతోనే గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ)ల ఆగడాలు మితిమీరుతున్నాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం మారంపల్లి వీడీసీ సభ్యులు 80 దళిత కుటుంబాలను బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ కోసం వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములును అడ్డుకున్న వీడీసీల తీరును నిరసిస్తూ.. వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. ఆర్మూర్, జగిత్యాల, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో వీడీసీలు పెచ్చుమీరుతూ రాజ్యాంగేతర శక్తిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, బహుజనులకు ఎటువంటి హక్కులూ లేకుండా అణచివేస్తున్నాయన్నారు. తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు మధ్యయుగపు నాటి ఆచార వ్యవహారాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. ఇందుకు పాలక పార్టీలూ వంతపాడటంతో వీడీసీలు తమ ఆగడాలను కొనసాగిస్తున్నాయని చెప్పారు. అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోకపోవడంతో బలహీనవర్గాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను అడ్డగించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా నాయకులు పెద్దివెంకట్రాములు, టి.వెంకటేశ్, గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.ప్రభాకర్, గంగాధర్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గైని గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తెడ్డు గంగారం, బీఎస్పీ నాయకులు ఎడ్ల రాము, ప్రభాకర్ పాల్గొన్నారు.

బలమైన ఉద్యమాలతోనే హక్కుల సాధన

- సమ్మెను జయప్రదం చేయండి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి



నవతెలంగాణ- మిర్యాలగూడ

కార్మికులు, ఉద్యోగులు బలమైన ఉద్యమాలు చేస్తే హక్కులు సాధించుకోవచ్చని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రంగారెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ వారి జీవితాలకు మనుగడ లేకుండా చేస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక సామాన్యులు జీవించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి గద్దెనెక్కాక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న పరిశ్రమలు మూతపడేలా చేసి నిరుద్యోగ సమస్యను పెంచిందన్నారు. నిత్యావసరాల ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్నాయన్నారు. కార్మికులకు ఉపయోగపడే చట్టాలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు సూచించినా అమలు చేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం అందే పరిస్థితి లేదన్నారు. ప్రజల డబ్బుతో కార్పొరేట్ శక్తులు విదేశాల్లో జల్సా చేస్తున్నాయన్నారు. కార్మిక, ఉద్యోగ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి ప్రభుత్వాలకు లేదన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు భయపడుతూ పని చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ఉండి బలమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 8,9తేదీల్లో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేశ్, సహాయ కార్యదర్శి మహ్మద్‌బీన్‌సయీద్, పట్టణ కార్యదర్శి తిరుపతి రామ్మూర్తి పాల్గొన్నారు.

ఈనెల 17న అసెంబ్లీ.. 19న కౌన్సిల్ సమావేశం

- నోటిఫికేషన్లు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ శాసనసభ, శాసనమండలి సమావేశాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 17 నుంచి 20 వరకు నాలుగు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఉదయం 11.30 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. అలాగే ఈనెల 19న ఉదయం 11.30 గంటలకు మండలి సమావేశం ప్రారంభమవుతుంది. ఈనెల 19న ఉభయసభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది. ఈ మేరకు కౌన్సిల్ కోసం జీవో నెంబరు 2, శాసనసభ కసం జీవో నెంబరు 3ను అసెంబ్లీ కార్యదర్శి వి. నర్సింహ్మాచార్యులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీ నామినేషన్లు ప్రారంభం

- సర్పంచ్ స్థానాలకు 3030, వార్డులకు 3827 నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలి విడతలో 4,479 సర్పంచ్ స్థానాలకు, 39822 వార్డులకు ఈ నెల 21 ఎన్నికలు జరుగ నున్నాయి. తొలి విడత ఎన్నికలకు సంబంధించి సోమవారం 4,337 సర్పంచ్ స్థానా లకు రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 3030 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వార్డులకు సంబంధించి 39,822 వార్డులకు గాను 39100 వార్డులకు నోటిఫికేషన్ జారీ చేయగా 3827 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

సంపాదకీయం


శబరిమల ఘోష

ఈ దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికిన నేల మీద.. ఆ మహోన్నత స్ఫూర్తినీ, ఆ నేల సహజీవన స్రవంతినీ సంక్షోభంలోకి నెట్టే కుట్రలు పెట్రేగిపోతున్నాయి. శరణుఘోష వినిపించాల్సిన సమయం రణఘోషతో రక్తసిక్తమవుతున్నది. అయ్యప్ప ఆలయ ప్రవేశానికి అన్ని వయసుల మహిళలను అనుమతిస్తూ అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది మొదలు... కేరళ విద్వేష రాజకీయాలతో అట్టుడుకుతూనే ఉన్నది. ఇటీవలి ప్రకృతి విలయం మిగిల్చిన విషాదం నుండి తేరుకోకముందే.. భక్తి ముసుగులో రాజకీయాలు సృష్టిస్తున్న పెను మంటలకు రావణకాష్టమై రగులుతూనే ఉన్నది.

కనుక బీజేపీ చెపుతున్నట్టు ఇది భక్తుల ఆగ్రహంగానీ, స్వాముల స్పందనగానీ కానేకాదు. అధికారమే పరమావధిగా కాషాయ, కాంగ్రెస్ మూకలు కలిసి చేస్తున్న కుట్ర.

సుప్రీం తీర్పును శిరసావహిస్తూ కేరళ వామపక్ష ప్రభుత్వం రాజ్యాంగ ధర్మాన్ని పాటిస్తుండగా, కేంద్రప్రభుత్వానికి నాయకత్వం వహిస్తోన్న బీజేపీ దానిని రాజకీయం చేస్తున్నది! దానికి ప్రతిపక్ష కాంగ్రెస్ తన అవకాశవాద వైఖరితో వంతపాడుతున్నది!! విశ్వాసాల మాటున సాగుతున్న ఈ విషరాజకీయాలు వాటి అధికార దాహాన్ని ప్రతిబింబిస్తుండగా, అయ్యప్ప దీక్షలు ప్రతిబింబించే కులమతాలకతీతమైన ఆధ్యాత్మిక సహజీవనం ఆత్మరక్షణలో పడింది.

అధికారంకోసం ఇంతటి అనైతికానికి దిగజారాలా? ఇంతటి విద్వేశాలకు ఒడిగట్టాలా? ఇన్ని అవకాశవాదాలకు , కుట్రలకు పూనుకోవాలా? నిజానికి దైవారాధనకు స్త్రీ పురుషులిద్దరూ అర్హులే అయినప్పుడు కేవలం కొన్ని శారీరక అవస్థల కారణంగా, స్త్రీ సహజమైన లక్షణాల కారణంగా వారి దేవాలయ ప్రవేశాన్ని నిరోధించలేం అంటూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించినపుడు దానిని మొట్టమొదట ఆహ్వానించింది బీజేపీయే! సాక్షాత్తూ కేరళ బీజేపీ అధ్యక్షుడు పిళ్లై తీర్పు వచ్చిన మరుక్షణమే దానిని స్వాగతించడమే కాదు, ఇది బీజేపీ ఆలోచనలకు అనుగుణమైన తీర్పని అభినందించారు. ఆయనే కాదు భారతీయ సమాజమంతా తీర్పును హర్షించింది. కేరళలోని కొద్దిమంది సాంప్రదాయ వాదులు ఈ తీర్పు పట్ల అసంతృప్తిని ప్రకటించిన మాట కూడా వాస్తవం. కానీ దీనిని అవకాశంగా తీసుకుని తెల్లవారే సరికల్లా బీజేపీ మాట మార్చడం, ఆందోళనలకు పురికొల్పడం, విద్వేషాలను రెచ్చగొట్టడం, తీర్పు అమలుకు పాటుపడుతున్న కేరళ ప్రభుత్వంపై దాడికి పూనుకోవడం, దీనికి కేరళలో కాంగ్రెస్ పార్టీ వంతపాడడం దేనిని సూచిస్తోంది..?



తీర్పు అమలుకు పూనుకుంటే కేరళలో వామపక్షం ప్రభుత్వాన్ని నడుపజాలదు అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా హెచ్చరిస్తే.. ప్రధాన మంత్రి మోడీ ఇది సాంప్రదాయాలకు విరుద్ధం అంటూ కోర్టు తీర్పునే సవాలు చేయడం రాజ్యాంగ ధర్మమా లేక రాజకీయమా? ' సాంప్రదాయం పేరిట దీనిని అంగీకరిస్తే మరి సతిని కూడా అంగీకరిద్దామా?' అని బీజేపీ పార్లమెంటు సభ్యుడైన ఉదిత్ రాజ్ ప్రశ్నిస్తున్నారు! అంతే కాదు మహిళలు గర్భగుడిలోకి వెళ్ళడం అపవిత్రమైనపుడు.. మహిళ గర్భం నుండి వచ్చిన పురుషుడు వెళ్లడం మాత్రం పవిత్రమెలా అవుతుంది? అని అడుగుతున్నారాయన. మరో బీజేపీ ఎంపీ సుబ్రమణ్య స్వామి... 21వ శతాబ్దంలో కూడా ఈ చాదస్తమేమిటి, అవసరమయితే మిలటరీ రక్షణ కల్పించి మహిళల ఆలయ ప్రవేశం జరిపించాలన్నారు.స్వయానా మోడీ మంత్రివర్గ సభ్యుడైన రాంవిలాస్ పాశ్వాన్ కూడా "మహిళలు రోదసీలోకి ప్రవేశిస్తున్న కాలంలో ఆలయ ప్రవేశాన్ని అడ్డుకోవడం అర్థం లేని చర్య" అని వ్యాఖ్యానించారు. ఇవన్నీ ప్రత్యర్థులో, ప్రతిపక్షాలో చేస్తున్న విమర్శలు కావు. సన్నిహితులు, స్వపక్షీయులే సంధిస్తున్న ప్రశ్నలు..! వీటికి ప్రధాని, పాలక పార్టీ ఏమని సమాధానమిస్తారు?

వీటికి ఏ సమాధానమూ ఇవ్వలేని కాషాయ పరివారం తాజాగా ఇదంతా భక్తుల ఆగ్రహం అని శెలవిస్తోంది! అదే నిజమైతే.. శాంతి సామరస్యాలనే కాదు, సాటి మనిషిలో కూడా భగవంతుడిని దర్శించుమని చెప్పే భక్తి మనుషులను భయాందోళనలకు గురిచేస్తుందా? అణువణువునా ఆధ్యాత్మికత నిండిన హృదయం ఆర్టీసీ బస్సులను తగులబెడుతుందా? భౌతిక దాడులకు ప్రేరేపిస్తుందా? బాంబు దాడులకు తెగబడుతుందా? రాజకీయ పార్టీల కార్యాలయాలపైకి దండెత్తు తుందా? అధికుడు, అల్పుడు అన్న తేడాలకతీతంగా... ఆడ, మగ అన్న బేదభావాలకతీతంగా అందరినీ స్వామీ అని సంబోధిం చమనే సన్నిధానం ఇన్ని కుట్రలు పన్నుతుందంటే నమ్మగలమా!? కోపతాపాలను, రాగద్వేషాలను జయించి, నిర్మలమైన- నిష్కల్మషమైన జీవిత సాధనను ప్రబోధించే శబరిమలేశుని కఠోర దీక్ష.. ఇంతటి కాఠిన్యానికి పాల్పడుతుందంటే అంగీకరించ గలమా? ఒకరిని చంపి అనేక మందిని క్షతగాత్రులను చేసిన ఈ హింసోన్మాదాన్ని శబరిమల క్షేత్రం సహిస్తుందా?

కనుక బీజేపీ చెపుతున్నట్టు ఇది భక్తుల ఆగ్రహంగానీ, స్వాముల స్పందనగానీ కానేకాదు. అధికారమే పరమావధిగా కాషాయ, కాంగ్రెస్ మూకలు కలిసి చేస్తున్న కుట్ర. వీరికి ప్రజల మద్దతూ లేదు. మహిళల ఆలయ ప్రవేశం జరిగితీరిన నేపథ్యంలో గత ఆరు రోజులుగా కొన్ని మూకలు సాగిస్తోన్న ఈ హింసాత్మక ర్యాలీలు, ఆందోళనలే ప్రజల మద్దతుగా భావిస్తే.. అంతకు ముందే ఇందుకు వ్యతిరేకంగా ఏ చిన్న హింసకూ తావులేకుండా, శాంతి యుతంగా, స్వచ్ఛందంగా దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో 50 లక్షలకు పైగా పాల్గొని అశేష మహిలాలోకం నిర్మించిన మానవ దుర్గం మాటేమిటి? లేని మద్దతును ప్రకటించుకుని ప్రజల మనోభావాల మాటున ఈ మనువాదులు సాగిస్తున్న దుర్మార్గాలకు నేడు శబరిమల ఘోషిస్తోంది.

మోడీ సర్కార్‌కు గోరీ కడదాం !



కె. హేమలత

'నా ఉద్యోగం ఎక్కడని' నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నది. 2014 ఎన్నికలకు ముందు మోడీ, బీజేపీ ప్రజలకు చేసిన అనేక వాగ్దానాలలో ఉద్యోగాలు కల్పిస్తామన్నది కూడ ఒక హామీ. ఈ ప్రశ్నకు యువజనులు సరైన సమాధానం కోరుకుంటున్నారు. కానీ మోడీ ప్రభుత్వం వినపడనట్టు నటిస్తోంది.

బీజేపీ ప్రభుత్వ పాలన చివరి దశలోకి వచ్చిన ఈ సమయంలో దేశంలో ఉద్యోగ నియామకాల పరిస్థితి ఏమిటి?

తమకు ఓటేస్తే ప్రతి సం॥ 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014 పార్లమెంట్ ఎన్నికల సమయంలో బిజెపి వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మభ్యపెట్టే విధంగా - 'మేకిన్ ఇండియా', 'స్కిల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'ప్రధానమంత్రి రోజ్‌గార్ ప్రోత్సాహక యోజనా' (పీఎంఆర్‌పీవై) మొ॥ పేర్లతో అట్టహాసంగా వివిధ కార్యక్రమాలను ప్రకటించింది. వీటన్నిటి ద్వారా ఉద్యోగాలు కల్పిస్తానని ఊరించింది.

పెద్ద సంఖ్యలో ఉన్న యువతకు సేవా, ఉత్పాదక రంగాలలో ఉద్యోగాలు కల్పించి వారి అపారమైన నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను దేశం సరైన రీతిలో ఉపయోగించుకోవచ్చు. దాని ద్వారా అన్ని రంగాలలోను విస్తరించి దేశం అద్భుతమైన అభివృద్ధిని సాధించగలుగు తుంది. అయితే మోడీ నాయకత్వంలో నేడు నయా ఉదార విధానం తీవ్ర రూపం దాల్చుతున్నందున ఇది జరగటానికి అవకాశం లేదు.

ఈ కార్యక్రమాల ద్వారా వాస్తవంగా ఎన్ని ఉద్యోగాలు కల్పించబడ్డాయి? పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుసుకునేందుకు వార్తాపత్రికలలో వచ్చిన కొన్ని నివేదికలను పరిశీలిద్దాం.

- రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన 62,907 పోస్టులకు ఒక కోటి 90 లక్షల మంది హాజరయ్యారు. వీటిలో అత్యధికం ఎలక్ట్రికల్ మరియు మెకానికల్ డిపార్ట్‌మెంట్లలో గ్యాంగ్ మెన్, ఫోర్‌మెన్, హెల్పర్ పోస్టులు కాగా, దీనికి అప్లయి చేసిన వారిలో అత్యధికులు పోస్టుగ్రాడ్యుయేట్లు.
- ఉత్తర్‌ప్రదేశ్‌లో 400 నాల్గవ తరగతి ఉద్యోగాలకు 23 లక్షల మంది అప్లయి చేశారు. వీరిలో 50వేలమంది గ్రాడ్యుయేట్లు.
- పశ్చిమబెంగాల్‌లో 6వేల క్లాస్ 4 ఉద్యోగాలకు గాను 25 లక్షల మంది హాజరయ్యారు. వీరిలో అత్యధికులు గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు.
- ముంబాయిలో 1137 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు 2 లక్షలకు పైగా హాజరయ్యారు. ఈ ఉద్యోగానికి కనీస అర్హత 12వ తరగతి (ఇంటర్మీడియట్) కాగా దరఖాస్తు చేసుకున్నవారిలో 543 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు. 425 మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉన్నారు.

ఇటువంటివే ఇంకా అనేక ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. ఆటోలు నడుపుతున్న ఇంజనీర్లు, షాప్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎంబీఏ పట్టభద్రులు, రెస్టారెంట్లలో సర్వర్లుగా చేస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేట్లందరూ మొ॥ సరదా కోసం ఈ పనులు చేయట్లేదు. ఉన్నత చదువులు చదివినప్పటికీ తమ అర్హతకు తగిన ఉద్యోగాలు దొరకకపోవడంతో అతి తక్కువ ఆదాయం వచ్చే ఈ ఉద్యోగాలు చేయటం తప్ప వారికి వేరే దారిలేదు.

నేడు, రేపు సార్వత్రిక సమ్మె

మన ప్రధాన మంత్రి గారు సెలవిచ్చినట్టు లక్షలాది యువకులు 'పకోడీలు' అమ్ముకుంటూ బ్రతుకుతున్నారు. లేదా త్రిపుర బీజేపీ ముఖ్యమంత్రి చెప్పినట్టు 'పాన్ షాపులు' పెట్టుకునీ, ఆవులు మేపుతూ, జీవనోపాధి చూసుకుంటున్నారు.

ఇవన్నీ మనకు కన్పిస్తున్న కొన్ని అనుభవాలు. అయితే అనేక ప్రతిష్టాత్మక సంస్థలు నిరుద్యోగం గురించి చేసిన అధ్యయనాల నివేదికలు పరిశీలిస్తే పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందన్నది మనకు అర్థమవుతుంది.

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ విడుదల చేసిన '2018 వర్కింగ్ ఇండియా పరిస్థితి' రిపోర్టును అనుసరించి 2013-2015 మధ్య కాలంలో 70 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఇతర ప్రముఖ సంస్థల నివేదికలు కూడ ఇదే సూచిస్తున్నాయి. 2015 అనంతరం కూడా ఉద్యోగాలు తీవ్రమైన స్థాయిలో పడిపోయాయి. 30 సెప్టెంబర్ 2018 నాటికి టెలికాం రంగంలో సుమారు 15వేల నుండి 20వేల మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. టీమ్ లీజ్ సర్వీసెస్ అనే ఉద్యోగ నియామకాల సంస్థ అంచనా ప్రకారం 2019 మార్చి 31 నాటికి మరో 65వేల మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోతారు.

ఇండియా ఫ్రెండ్ సంస్థ నివేదిక ప్రకారం గత ఏడు సంవత్సరా లలో సంఘటిత రంగంలోని ముఖ్యమైన ఎనిమిది పరిశ్రమల్లో చాలా కొద్ది సంఖ్యలో మాత్రమే ఉద్యోగాలు కల్పించబడ్డాయి. మన దేశంలోని మొత్తం కార్మికవర్గంలో 60% మందికి ఏడాది పొడగునా ఉద్యోగం / ఉపాధి ఉండట్లేదు. అంటే నిరుద్యోగం, తాత్కాలిక ఉపాధి లేమి ఎంత తీవ్ర రూపంలో ఉందో తెలుస్తోంది. 1991 తర్వాత భారతదేశం అద్భుత పెరుగుదల సాధించిందని చెపుతున్నప్పటికీ దేశ జనాభాలో సగం కంటే తక్కువ మందే పూర్తిస్థాయి ఉపాధి, ఉద్యోగావకాశాలు కలిగి ఉన్నారని నివేదిక చాటుతున్నది.

ఇక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాన్ని చూస్తే ఆయా కంపెనీల రెవిన్యూలో మంచి అభివృద్ధి ఉన్నప్పటికీ 2017-18 సం॥కి ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో పడిపోయాయి. ఈ రంగంలో యాంత్రీకరణ, అత్యున్నత స్థాయి టెక్నాలజీని ఉపయోగంలోకి తీసుకురావడం కూడా ఒక కారణం. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఐటి రంగంలో నియామకాలు నెమ్మదించటం, ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవటం అనేది ఊహించినదానికన్నా వేగంగా జరుగుతోంది.

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమి (సీఎంఐఈ) లెక్క ప్రకారం దేశంలో నిరుద్యోగం 6.9% పెరిగింది. గత రెండేళ్ళలో ఇదే అత్యధికం. అక్టోబర్ 2018 నాటికి ఉద్యోగాలు చేస్తున్న వారు 39.7 కోట్లు. అక్టోబర్ 2017లో ఇది 40.7 కోట్లు. సెప్టెంబర్ 2018 నాటికి అంటే 11నెలల్లో 90 లక్షల ఉద్యోగాలు పోయాయి. శ్రామిక వర్గం క్రమంగా తగ్గిపోతున్నది. 30 జులై 2017 నాటికి 3% ఉన్న ఈ తగ్గుదల రేటు, 2018 సెప్టెంబర్ 23 నాటికి 8% పెరిగింది. అలాగే మొత్తం నిరుద్యోగులలో 16% మంది యువత ఉన్నత విద్యావంతులే కావటం దీని తీవ్రతను కళ్ళముందుంచుతోంది.

2014 తర్వాత ఉద్యోగాల కల్పన జరగకపోగా తగ్గుదల బాగా ఊపందుకుం టున్నది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) లో పెరుగుదల ఉంది కానీ, ఉపాధి అవకాశాలు బాగా తగ్గిపో యాయి. లేబర్ బ్యూరో ఉద్యోగ నియామకాలపై వాస్తవ విషయాలను వెల్లడిస్తున్నం దున 2016-17 తర్వాత ఎటువంటి రిపోర్టులు ప్రచురించకుండా కేంద్ర ప్రభుత్వం వారిని నియంత్రించింది. ఇదీ నిరుద్యోగ సమస్యపై బిజెపి ప్రభుత్వం యొక్క వైఖరి! ఇదే సమయంలో వివిధ పరిశ్రమలు, సర్వీసుల మూసివేతలు, లే ఆఫ్‌లు, నిలిపివేతల కారణంగా కనీసం 15 లక్షల మంది ఉద్యోగులు తమ ఉపాధి కోల్పోయారు. వీరి లో అత్యధికులు పరిశ్రమలలో పనిచేసే కాంట్రాక్ట్, క్యాజువల్, టెంపరరీ మొ॥ కార్మికులు. పరిశ్రమల మాంద్యం మొ॥ ఎటువంటి అననుకూల పరిస్థితుల వల్ల ఉత్పత్తిని తగ్గించాలని నిర్ణయించినా వెంటనే కార్మికులపై వేటుపడుతుంది. యాజ మాన్యాలు చేసే మొదటి పని వీరిని



సర్వీసుల నుండి తొలగించటంలేదా, టెర్మినేట్ చేయటం. మోడీ నాయకత్వం లోని బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉత్పాదకతను తగ్గించటం సర్వసాధారణమైపోయింది.

వాస్తవేమిటంటే ఉద్యోగ నియామకాలు తగ్గుముఖం పట్టాయి. ఇది స్పష్టమైన తర్వాత తన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు బిజెపి ప్రభుత్వం తన అసత్య ప్రచారాలను ముమ్మరం చేసింది. ఈ అబద్ధపు ప్రచారంలో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఓ) వంటి వివిధ ప్రభుత్వ సంస్థలను కూడా భాగస్వాము లను చేస్తోంది. ప్రధానమంత్రి సారథ్యంలో బిజెపి ప్రభుత్వంలోని మంత్రులందరూ, ఉద్యోగాల కల్పన గురించిన తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయటంలో ఒకరితో ఒకరు పోటీపడుతూ ప్రజల్ని మోసగిస్తున్నారు.

2017-18 సం॥లో 46 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని ప్రధాన మోడీ చెపుతున్నారు. ఇదే పీరియడ్‌లో 70 లక్షల ఉద్యోగాలు కల్పించామని ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. కార్మికశాఖ ఆధీనంలోని ఇపిఎఫ్ఓ కూడ తానేమీ తక్కువ కాదంటూ ఒక్క జులై 2018 మాసంలోనే 10 లక్షల ఉద్యోగాలు కొత్తగా కల్పించబడ్డాయని చెప్పింది. ఇక పిఎంఆర్‌పివై పథకం క్రింద 85 లక్షల ప్రజలకు ఉద్యోగాలు / ఉపాధి దొరికాయనేది తాజా ప్రకటన.

ఇంతకీ వాస్తవమేమిటి? నిజానికి ఆగస్టు 2016లో ప్రధాన మంత్రిచే ప్రకటించబడ్డ పి.ఎం.ఆర్.పి.వై ఒక మోసకారి ప్రాజెక్ట్. ఆయా సంస్థల్లోని కొత్త ఉద్యోగులకు ఎంప్లాయర్ (యాజమాన్యాలు) చెల్లించాల్సిన ప్రావిడెంట్ ఫండ్‌ను వారికి బదులు ప్రభుత్వమే 3 సం॥ పాటు కార్మికులకు చెల్లిస్తుంది. అంటే ఈ కార్యక్రమం ద్వారా యాజమాన్యాలకు కొత్త రకం సబ్సిడీ ఇవ్వటానికి మోడీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్మికులకు పి.ఎఫ్ కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిన బాధ్యతను యాజమాన్యాలకు బదులుగా తన భూజాల మీదకెత్తుకుని దేశ సంపద నుండి దానిని చెల్లిస్తోంది. దీని ఫలితంగా పెరిగిన ఇ.పి.ఎఫ్ ఖాతాదారుల సంఖ్యను కొత్తగా పెరిగిన ఉద్యోగాల క్రింద చూపిస్తోంది. నిజానికి అనేక సం॥లుగా పనిచేస్తూ ఇ.పి.ఎఫ్ చెల్లింపుకు అర్హులైన లక్షలాది మంది కార్మికులు కార్మికశాఖ అమలులో వైఫల్యం కారణంగా ఈపీఎఫ్ పరిధిలోకి రావట్లేదు. ఎంతోమంది యజమానులు బుద్ధిపూర్వకంగా చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. ఈ తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకు పి.ఎం.ఆర్.పి.వై పథకం ద్వారా పెద్ద మొత్తాల్లో ప్రజల సొమ్మును యాజమాన్యాల ఖాతాలోకి బదిలీ చేసి ఉద్యోగాలు పెరిగినట్టు పోజులు కొడుతోంది. ఈ విధంగా బిజెపి ప్రభుత్వం ఒకవైపు కార్పొరేట్ యజమానులకు ఊడిగం చేస్తూ, మరోవైపు ఉద్యోగాల పెరుగుదల పేరుతో ప్రజలను మోసం చేస్తోంది. ఈ ప్రయత్నంలో సామాన్య ప్రజల, యువజనుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతోంది.

దేశజనాభాలో 50% మంది 25 సం॥ల కన్నా తక్కువ వయసు వారు కాగా 65% మంది 35 సం॥లు కన్నా తక్కువ వయస్సు ఉన్నవారు. రాబోయే 4 సం॥లలో సుమారు 87 కోట్ల ఉద్యోగులు, కార్మికులతో ప్రపంచంలోనే అతిపెద్ద కార్మికవర్గం కలిగిన దేశంగా అంచనా వేయబడుతోంది. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న యువతకు సేవా, ఉత్పాదక రంగాలలో ఉద్యోగాలు కల్పించి వారి అపారమైన నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను దేశం సరైన రీతిలో ఉపయోగించుకోవచ్చు. దాని ద్వారా అన్ని రంగాలలోను విస్తరించి దేశం అద్భుతమైన అభివృద్ధిని సాధించగలుగు తుంది. అయితే మోడీ నాయకత్వంలో నేడు నయా ఉదార విధానం తీవ్ర రూపం దాల్చుతున్నందున ఇది జరగటానికి అవకాశం లేదు.

నయా ఉదారవాద ప్రభావం వల్లపర్మినెంట్ ఉద్యోగాలు తగ్గిపోయాయి. కాంట్రాక్ట్, క్యాజువల్, టెంపరరీ, ఫిక్స్‌డ్ టర్మ్, పార్ట్‌టైమ్, అప్రెంటిస్, ట్రెయినీస్ మొ॥ ఉద్యోగాలు పెరిగాయి. 2008 తర్వాత పరిస్థితి మరింతగా దిగజారి నేటికీ అదే కొనసాగు తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో యజమానులు తమ లాభాలను రక్షించుకునే క్రమంలో భారాలను కార్మికులపై వేయటానికి చేసే ప్రయత్న ఫలితమే ఇటువంటి సంక్షోభాలకు దారితీస్తుంది. నిరద్యోగం పెరుగుదల కూడా దీని ఫలితమే.

నేడు, రేపు ఐక్య కార్మికోద్యమం ఇచ్చిన జాతీయ సమ్మె పిలుపులోని 12 ప్రధానమైన డిమాండ్లలో ఉద్యోగాల కల్పన కూడా ఒకటి. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, జాతి (దేశ) వ్యతిరేక చర్యలకు నిరసనగా జాతీయ ఐక్య కార్మికోద్యమం చేస్తున్న పోరాటాలకు కొనసాగింపే ఈ జాతీయ సమ్మె

అందుకే యావత్ కార్మికవర్గం తమ కార్మికవర్గ, రాజకీయ అనుబంధాలకు అతీతంగా ఈ రెండు రోజుల సమ్మెలో భాగస్వాములు కావాలని సిఐటియు పిలుపునిస్తున్నది. అలాగే ఈ సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలియజేయ వలసిందిగా సమాజంలోని అన్ని తరగతులు, పీడిత వర్గాల ప్రజలను సీఐటీయూ కోరుతున్నది.

మెయిల్ @ నవతెలంగాణ

మా ప్యాట (పేట) ఇప్పుడు జిల్లా!

ముఖ్యమంత్రి వాగ్దానం అమలు జరిగితే నారాయణపేట, ములుగు కొత్త జిల్లాలుగా తెలంగాణ చిత్రపటంలో కనిపించనున్నాయి. మిగతా ప్రాంతాలతో పోలిస్తే బాగా వెనుకబడిన ప్రాంతాలుగా ఇవి గుర్తింపు పొందాయి. వలసలకు నెలవైన నారాయణపేట- జిల్లాగా మారితే అభివద్ధిలోకి వస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఇది కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉండడంతో స్థానికంగా ఇక్కడ కన్నడిగులు, మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన చేనేత కుటుంబాల వారు ఎక్కువ. అంతేకాదు.. రాజస్థానీలు, గుజరాతీలు, తమిళులు ఇలా అన్ని ప్రాంతాల వారు ఈ చిన్న ప్యాటలో (నారాయణపేటను ప్యాట అని స్థానికులు పిలుచుకుంటూ ఉంటారు.) కనిపిస్తారు.

ఒకనాడు లోకపల్లె సంస్థానం పరిధిలో ఉన్న నారాయణపేట ఇంతింతై వటుడింతై అన్నట్లు అనేక ఘనతల్ని సాధించుకున్న పట్టణం. 1947లో జిల్లాలోనే తొలి మున్సిపాలిటీగా ఏర్పడింది. అంతేకాదు.. జిల్లాలో విద్యుత్ సౌకర్యం కలిగిన తొలి పట్టణం నారాయణపేటనే. దీనికి విద్యుదుత్పత్తి కోసం ప్రత్యేక కేంద్రాన్ని కూడా నడిపారంటే ఆశ్చర్యం కలగకమానదు. అలాంటి ప్యాటలో చివరకు విద్య, ఉపాధి సౌకర్యాలు కరవై ప్రజలు వలసబాట పట్టిన స్థితికి చేరింది. చేనేత కార్మికులు ఉపాధి లేక ఇతర వ త్తులకు మళ్లారు. పనులు లేక వ్యవసాయ కూలీలు నగరాల్లో భవన నిర్మాణ కార్మికులుగా పనులకు చేరారు. దీనికి కారణం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ఈప్రాంతాన్ని పట్టించుకోక పోవడమే. ఇవన్నీ గతం.. ఇప్పుడు జిల్లాగా ఏర్పడితే పరిస్థితులలో గణనీయమైన మార్పు రావచ్చని ప్రజలు ఆశిస్తున్నారు. జిల్లా సాధన సమితిగా ఏర్పడి పండుగలు కూడా చేసుకోకుండా ఆందోళనలు, బంద్‌లు చేసి తమ చిరకాల వాంఛను వ్యక్తం చేశారు. చివరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల మనోభావాలను గౌరవించి జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలపడం హర్షణీయం. ఆదిశగా ఇప్పటికే జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలిక భవనాల పరిశీలన కూడా జరిగిపోవడం శుభపరిణామం. ప్యాటలో ఒకప్పుడు నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరిగేది. ఇప్పుడు మిషన్ భగీరథ వల్ల రోజు విడిచి రోజు నీటిసరఫరా జరుగుతున్నది. భవిష్యత్తులో రోజూ నీటి సరఫరాకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కూడా జిల్లా ఏర్పాటుకు అనుకూల పరిణామం.

వలసలకు ఈప్రాంతం పెట్టింది పేరు. చుట్టుపక్కల పల్లెల నుంచి 70,80వ దశకంలోనే ఎంతోమంది భివాండి, షోలాపూర్,ముంబై ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. దీనివల్ల ఒకనాడు నారాయణపేట పట్టణ జనాభా (1971 నుంచి 1981) బాగా తగ్గిపోవడం ఒక విచిత్రం . 25వేల జనభా 21 వేలకు, ఆ తరువాత 18 వేలకు పడిపోయింది. అయితే కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు.. 1985లో నుంచి పరిస్థితులు కొంత మారాయి. డిగ్రీ కాలేజి, బస్‌డిపో ఏర్పాటయ్యాయి. దీనివల్ల పల్లెల నుంచి ప్రజలు చదువులకు, వ్యాపారాల కోసం నారాయణపేటకు రాసాగారు. ప్రస్తుతం పట్టణ జనాభానే 55వేలకు చేరుకుందని ఇటీవలి సర్వేలు తెలుపుతున్నాయి.

నారాయణపేటలో పరిశ్రమలపరంగా, విద్యాపరంగా కానీ ఎలాంటి వసతులు నేటికీ విస్తరించలేదు. ప్రైవేటు రంగంలో రెండు విద్యా కళాశాలలు, ఒక ఐటీఐ ఏర్పాటయ్యాయి, ఇక్కడ నెలకొల్పిన ఇంజినీరింగ్ కాలేజి హైదరాబాద్ శివారుకు వెళ్లిపోయింది. బాలికల కోసం జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. నారాయణపేటలో బాలుర, బాలికల పాలిటెక్నిక్‌లు ఏర్పాటైతే తమ ప్రాంతం యువతీయువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడ వ్యవసాయ రంగానికి ఊతమిచ్చే చర్యలు అవసరం. చేనేత కుంటుంబాలు తమ వ త్తిని నమ్ముకుని ఉన్నాయి. వీరికోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా టెక్స్‌టైల్స్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉన్న పాలిటెక్నిక్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నది. ఇంజినీరింగ్,ఫార్మసీ, మెడికల్ కాలేజీలు నెలకొల్పాల్సిన ఆశ్యకత ఉందని ఈ ప్రాంత మేధావులు కోరుతున్నారు. ఇవన్నీ కూడా నారాయణపేట జిల్లాగా మారిన తరువాత- కాలక్రమంలో ఏర్పాటవుతాయని ఆశించవచ్చు. జిల్లా పాలనా విభాగాలన్నీ ఇక్కడ ఏర్పాటైతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపు జరుగుతుంది. అదేవిధంగా విద్యాపరంగా నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని గురుకులాలను నారాయణపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసింది. మరిన్ని కూడా వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా వ్యవసాయాభివ ద్ధికి, పశుసంవర్ధక విభాగానికి నిధులు పెరుగుతాయనీ వెనుకబడిన జిల్లాల పథకం కింద ప్రత్యేక నిధులను పొందే వీలు కలుగుతుందనీ. ప్రధానంగా ఒక జిల్లాకేంద్రంలో కావాల్సిన సౌకర్యాలు, విద్యావసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ లభిస్తుందనీ ప్రజలు ఆశిస్తున్నారు. భవిష్యత్తులో నారాయణపేట అభివద్ధి బాట పడుతుందనీ, ఇది ప్యాట దశ, దిశను మార్చివేస్తుందనీ ఎదురుచూస్తున్నారు.

- కె.బాలకిషన్ రావు
సెల్ : 9966554945

కార్మికులను సంఘటితపర్చడం రాజకీయం కాదా?

ఒక రాజకీయేతర కార్మిక సంఘం యిబ్బందులలో వున్న కార్మికవర్గం కొరకు ఏమీ చేయలేదు.

నేడు భారతదేశంలో కార్మిక సంఘాలు ప్రస్తుతం చెడు చేసే రెండు సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. ఉద్యోగ కల్పన లేకపోవడం, ఉద్యోగం చేసే పరిస్థితులు హానికరంగా మారడంతోపాటు, వారు ప్రభుత్వ "కార్మిక సంస్కరణలను" కూడ ఎదుర్కోవలసిన పరిస్థితి వున్నది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనుబంధ కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్ (దీమీ), కాంగ్రెస్ పార్టీకి అనుబంధ కార్మిక సంఘంగా ఉన్న "ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్" నుండి విడిపోయిన "నేషనల్ ఫ్రంట్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్"తో జతకట్టి 'కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్' (జఉచీజజుచీ) ను రూపొందించింది.

ఆసక్తికరంగా 'జఉచీజజుచీ' 'ఒక రాజకీయేతర కార్మిక సంఘ' ఫ్రంట్‌గా దీమీ మీడియాకు చెప్పింది. కానీ ఈ క్రొత్తగా ఏర్పడిన ఫ్రంట్ కొన్ని ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నది. మొదట, ఈ కూటమి యిప్పుడున్న పరిస్థితిలో అవసరమా? రెండవది దేశంలో నెలకొన్న విచారకరమైన రాజకీయ పరిస్థితులలో కార్మికులు, కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యలకు, అయోమయ పరిస్థితులను ఆలోచించే పరిష్కార మార్గాలున్నాయా? జఉచీజజుచీ, ఫ్రంట్‌లో భాగస్వామ్యం కాని 10 యితర కార్మిక సంఘాలు 'ట్రేడ్ యూనియన్ చట్టం, 1926' ను సవరించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను తీవ్రంగా నిరసించినాయి. కార్మిక సంఘం గుర్తింపులో ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి అనుమతించే రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆ ప్రతిపాదనలున్నాయని ఆ సంఘాలు అభిప్రాయపడినాయి. కానీ, ఈ సవరణను వ్యతిరేకించే ఈ కార్మిక సంఘాలతో దీమీ చేరలేదు. జఉచీజజుచీ, కార్మిక చట్టాలను మార్చే ఈ కేంద్ర ప్రతిపాదనల వెనుక వున్న భయంకరమైన వాస్తవాలేమిటి?

దేశంలో వున్న కార్మిక శక్తిలో 8% సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులున్నారు. 92% అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు, పనిచేసే, జీవించే పరిస్థితుల గురించి కార్మిక సంఘాలు, ప్రభుత్వం పట్టించుకోవాలని మొరపెట్టుకుంటున్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులను సమీకరించడం గందరగోళం, అడ్డంకులతో కూడుకున్న పెద్ద పని. దీమీ ఏర్పాటు చేసిన జఉచీజజుచీ ఏ విధంగా సహాయపడుతుంది? కార్మిక రంగం కూర్పు అత్యంత వేగవంతమైన మార్పులకు లోనైంది. విస్తరిస్తున్న అసంఘటిత రంగంలో యువతీ, యువకులు ఎక్కువగా పనిచేస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఒకే విధమైన ఉద్యోగ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాత్రికి రాత్రే ప్రైవేట్ టాక్సీ (ముఖ్యంగా ఓలా, వూబర్) డ్రైవర్లతో నిండిపోయిన రవాణా రంగం గతంలో భారతదేశంలో ఎదుర్కొనని సమస్యలతో పోరాడుతున్నది. ప్రభుత్వ ఆధీనంలో వున్న అనేక ప్రభుత్వరంగ సంస్థలు అంతకు ముందున్న ప్రభుత్వాల రాజకీయ జోక్యంతో పోరాడినాయి. పునరుద్ధరణ ప్యాకేజీలలాంటి విషయాలలో కార్మికులు, కార్మిక సంఘాలతో దాదాపు ఏ విధమైన సంప్రదింపులు జరుపలేదు. దుస్తుల తయారీ రంగంలో 2016లో అనుమతించబడిన "ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్" ఒప్పందం యిప్పుడు అన్ని రంగాలలోకి విస్తరించింది. ఈ ఒప్పందం తేలికగా వ్యాపారం చేసుకునే విధంగా ఉద్యోగం కల్పించే యాజమాన్యానికి "సౌకర్యవంతమైన"ది అనేది సుస్పష్టం. 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్' ఒప్పందం నిబంధనల



ప్రకారం, కార్మికుడు ఎంతకాలం పనికి ఒప్పందం కుదుర్చుకున్నాడు (వారం నుండి ఆ పని పూర్తయ్యేవరకు) అనే దానితో సంబంధం లేకుండా ఉద్యోగం తీసివేసే నోటీస్ ముందుగా యివ్వాల్సిన అవసరం లేదు. బహుళజాతి కంపెనీలతో సహా అన్ని కంపెనీలు అన్ని శాఖలలో కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలు ప్రారంభించిన 1970ల నుండి కార్మిక సంఘాలు శాపం లాంటి ఈ కాంట్రాక్ట్ పద్ధతితో పోరాడుతున్నాయి.

ప్రస్తుత కార్మిక సంఘాలకు ముప్పు వాటిల్లినపుడు, క్రొత్త సంక్షోభాన్ని అధిగమించే వాటి సామర్థ్యం ఒత్తిడికి లోనవుతున్నది. ప్రస్తుతం దేశంలో వున్న రాజకీయ పరిస్థితులలో ఈ సమస్యలను ఏ విధంగా అధిగమించాలి? వాస్తవానికి, కార్మిక చట్టాలనన్నింటిని కలిపి వేతనాల బిల్లు, 2017గా ప్రభుత్వం ఏర్పాటు చేయడం, 'ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ఒప్పందం' లను దీమీ వ్యతిరేకించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిపై ఆధారపడిన ప్రభుత్వం యిప్పటికి వాస్తవంగా ఎన్ని ఉద్యోగాలను సృష్టించిందో ఒక శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసినట్లు దీమీ పేర్కొన్నది.

యింతకు ముందు దీమీ నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను విమర్శించింది. కానీ సెప్టెంబర్ 2015లో దేశవ్యాప్తంగా యితర కార్మిక సంఘాలు చేపట్టిన నిరసనల కార్యక్రమంలో ఆ సంఘాలతో కలవడానికి తిరస్కరించింది. "రాజకీయాలు చేయడంలో విశ్వాసం" లేదు, కానీ కార్మికుల కొరకు జరిగే పోరాటంలో మాత్రమే పాల్గొంటుందని ఆ సంఘం (దీమీ) పేర్కొన్నది.

సంఘటిత కార్మికవర్గ ఉద్యమం ముందున్న సవాళ్ళు ఏమంటే, ఉమ్మడి కార్మిక వేదిక (త్రైపాక్షిక రాయబారం రూపంలో) కొరకు, అర్థవంతమైన చర్చల నిర్వహణ కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొనిరావడం. చీణూ ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చలు జరపడాన్ని తిరస్కరిస్తుందని అనేక మంది కార్మికసంఘాల నాయకులు పేర్కొన్నారు.

పరిశ్రమల మూసివేత, ఉద్యోగాల నుండి తీసివేయడంతోపాటు ప్రజాస్వామిక హక్కులపై జరిగే దాడికి కారణభూతమైన కార్మిక సంస్కరణలను ప్రజలకు తెలియజేయడం ద్వారా కార్మికవర్గ సమస్యలు ప్రజా సమస్యలుగా చూపించడంలో కార్మిక సంఘాలు సంక్లిష్టమైన యిబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రగతిశీల, రాజకీయ, సామాజిక ఉద్యమాలకు సహకారమందించడమే వాటి ముందున్న ఏకైక మార్గం. భారతదేశంలోని కార్మిక సంఘాలు పెరుగుతున్న నిరుద్యోగులకిచ్చే సభ్యత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పార్లమెంట్‌లో, పార్లమెంట్ బయట కార్మిక విధానాలను చర్చించడానికి తిరస్కరించిన ప్రభుత్వ కఠిన వైఖరితో, ప్రజల వద్దకు సమస్యలను తీసుకొనివెళ్ళి, అందరికీ ఆమోదయోగ్యమైన చర్చల ప్రాధాన్యతను పునరుద్ఘాటించడమే కార్మిక సంఘాల ముందున్న కర్తవ్యం. దీని కొరకు వారు ప్రభుత్వంతో, రాజకీయంగా పోరాడవలసిన అవసరం వున్నది. అప్పుడు జఉచీజజుచీ ఎక్కడ సహాయపడుతుంది?

('ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకీయం)
అనువాదం: బోడపట్ల రవీందర్
సెల్‌నెం: 9848412451






డ్రెస్ ఏదయినా... ఎంబ్రాయిడరీ సర్వ సాధారణం అయిపోయింది. థ్రెడ్ వర్క్, స్టోన్ డిజైన్... కాస్త ఎంబోజింగ్ తోడయితే వచ్చే లుక్కే వేరు. అలాంటి నాలుగు డ్రెస్సులే ఇవి. నెట్, వెల్వెట్, రా సిల్క్ బట్ట ఏదైనా కొత్తదనం తెచ్చింది మాత్రం ఎంబోజ్డ్ ఎంబ్రాయిడరీనే!

ఎవర్‌గ్రీన్ ఎంబ్రాయిడరీ

విశ్రాంతి అంటే..!

ఏనాడూ విశ్రాంతి తీసుకున్న భావన కలగడం లేదా.. వీక్-ఆఫ్ రోజున ఏ ఒక్క పనీ చేయకుండా ఖాళీగా గడిపేయాలని ఉందా.. ఏదో ఒక కారణంగా విశ్రాంతి తీసుకోవడం సాధ్యం కావడం లేదా.. ఇవన్నీ మనసు మీద తీవ్రమైన ఒత్తిడి కలిగిస్తాయని చెబుతున్నారు మానసిక వైద్యులు. ఈ ఆలోచన నుండి బయటపడి మనసు పూర్తిస్థాయిలో సేద తీరే మార్గాలు అనేకం ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం...

అసలు విశ్రాంతి అంటే ఏమిటో తెలిస్తే గానీ, విశ్రాంతిని ఎలా పొందాలో తెలియదు. ఏ పనీ చేయకుండా ఖాళీగా కూర్చోవడం ఎప్పుడూ విశ్రాంతి కాదు. అలా కూర్చోవడం వల్ల రోజూ చేసే రొటీన్ పనులే ఆ సెలవు రోజున కూడా గుర్తుకొస్తాయి. అందులో భాగంగా ఆయా రోటీన్ విషయాల తాలూకు సమస్యలు సంఘర్షణలు గుర్తుకొస్తాయి. దాంతో అసహనం, చికాకు పెరిగిపోతాయి. శారీరకంగా ఆఫీసు పనులేవీ చేయకపోయినా, మానసికంగా సెలవు రోజున కూడా ఆ విషయాలతో అలసిపోతాం. వాస్తవానికి విశ్రాంతి అంటే ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండడం కాదు. రోజువారీ రొటీన్ పనులకు ఏ మాత్రం సంబంధం లేని, పూర్తిగా భిన్నమైన విషయాల్లో దృష్టిని కేంద్రికరించడం.



అలా వేరే విషయాల తాలూకు పనులు రోజంతా చేసినా, శరీరం బాగా అలసిపోయినా, విశ్రాంతి భావనే కలుగుతుంది. నిజానికి, విశ్రాంతి భావనైనా, ఆనందమైనా, కొత్త విషయాల్లోంచి వస్తాయి. అందుకే నూతనత్వానికీ, సృజనాత్మకతకూ సమాజంలో అంతటి సమున్నత స్థానం ఉంది. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక హాబీ ఉండాలని చెప్పడంలోని ఉద్దేశం కూడా ఇదే. అందువల్ల సెలవు రోజున పూర్తిగా ఖాళీగా కూర్చోవాలనే తలంపును మనసులోంచి తీసివేసి ఏదైనా కొత్త విషయాల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేయండి. మీకు బోలెడు విశ్రాంతి లభిస్తుంది. ❄



తక్కువ సమయంలో

ఎక్కువ ఖర్చుతో కూడిన ఫేస్ క్రీమ్స్ కంటే.. ఖర్చులేని సహజసిద్ధమైన చిట్కాలే ముఖానికి అన్నివిధాలా మంచిదంటున్నారు నిపుణులు. అందుకే మరి మీ ముఖ సౌందర్యానికి కాసింత సమయాన్ని వెచ్చించండి. ముందుగా క్లీనప్, స్క్రబ్ వంటివి చేసుకుని ఆవిరి పట్టించుకుని ఫేస్‌ప్యాక్ వేసుకుంటే ముఖం మరింత కాంతివంతం అవుతుంది. మచ్చలు, మొటిమలు లేని మృదువైన అందం మీ సొంతమవుతుంది.

క్లీనప్ : రోజ్‌వాటర్ ఒక చెంచా, గ్లిజరిన్ మూడు లేదా నాలుగు చుక్కలు.

స్క్రబ్ : కొబ్బరి పాలు ఒకటిన్నర చెంచా, బియ్యపిండి సగం చెంచా, పెసర పిండి సగం చెంచా.

మాస్క్ : చిక్కటి పాలు రెండు చెంచాలు, కీరదోస గుజ్జు రెండు చెంచాలు, శనగ పిండి సగం చెంచా.

తయారీ : ముందుగా రోజ్‌వాటర్, గ్లిజరిన్ చిన్న బౌల్‌లో పోసుకుని బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు నిమిషాల తర్వాత మెత్తని క్లాత్‌తో క్లీన్ చేసుకోవాలి. ఇప్పుడు కొబ్బరిపాలు, బియ్యప్పిండి, పెసర పిండి ఒక బౌల్‌లోకి తీసుకుని బాగా కలుపుకుని ఇంచుమించు ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసుకోవాలి. తర్వాత చల్లని నీళ్లతో ముఖాన్ని శుభ్రం చేసుకుని ఆవిరి పట్టించుకోవాలి. ఇప్పుడు చిక్కటిపాలు, కీరదోస గుజ్జు, శనగపిండి ఒక బౌల్‌లోకి తీసుకుని బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకుని, ఇరవై నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లతో ముఖం కడగాలి. ఇలా వారానికి రెండు లేదా మూడు సార్లు చెయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ❄

దళిత నటి విషాదగాథ

మహానటుల 'భయోపిక్'ల ప్రభంజనాల వేళ.. నేను పరిచయం చేయబోతున్నది తొలి దక్షిణాది దళిత నటి రాజమ్మ.. అలియాస్ రోసమ్మ.. అలియాస్ రోజీ. ట్రావెన్‌కోర్ సంస్థానంలోని తైకాడ్ మారుమూల గ్రామం. అక్కడ నిరుపేద పులయ కులంలో పౌలో సే, కుంజమ్మ దంపతులకు పుట్టిన బిడ్డ. అష్టకష్టాలు పడి తండ్రి మిషనరీ స్కూల్లో చేర్పించాడు. వాళ్ళు కామందుల ఇళ్లల్లో పశువులకు గడ్డికోసి తెచ్చే పని చేసేవారు.రాజమ్మ చదువుతో పాటు ఆటపాటల్లో చాలా చురుకుగా ఉండేది. నాట్యం.. నాటకాలంటే విపరీతమైన ఇష్టం ఉండేది. 'కలరి' నాట్యం నేర్చుకుంది. నాటకమైనా, నాట్యమైనా చక్కటి ఈజ్ తో శ్రద్ధగా చేసేది.

డానియెల్ దృష్టిలో పడి..

తన ఈడువాళ్ళల్లో అందంగా..కులం తాలూకు బెదురు ఏమాత్రం లేకుండా డామినేటింగ్‌గా ఉండేది. తల్లిదండ్రులు ఆ అమ్మాయిని చూసి మురిసిపోయేవారు. తల్లి లోలోన భయపడేది. దళితులు 'కాకర్షి' పేరుతో ఒక చిన్నపాటి నాటక సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. స్త్రీల పాత్రలు కూడా పురుషులే వేసుకునే కాలం.అమ్మాయిలు, స్త్రీలు నాటకాల్లో పాల్గొంటే చిన్నచూపు చూసేవారు. సూటిపోటి మాటలు అనేవారు.రోసమ్మ అయినా ఎవరినీ లెక్కచేసేది కాదు. నాటకాల్లో పాల్గొనేది. స్వయంగా నాటకాలు రాసేది. 1928 లో జరిగిన కాకర్షి నాటకపోటీల్లో ఈ చలాకీ రోసమ్మపై 'జె.సి. డానియెల్ నాడర్' (మలయాళ చిత్ర పరిశ్రమ పితామహుడు) దృష్టి పడింది. తను తీయబోయే తదుపరి అతిపెద్ద చిత్రానికి లీడ్ రోల్ ఈ అమ్మాయే అని డిసైడ్ అయిపోయాడు. ముందు బొంబాయి నుండి మిస్ లారా అనే నటీమణిని అనుకున్నాడు. ఆ బొంబాయి నటి డిమాండ్లు తీర్చడం తనవల్ల కాదు అనుకునే సమయంలో రోసమ్మను చూసాడు. పెద్దవాళ్లను పిలిచి మాట్లాడాడు.

నాయర్ స్త్రీగా...

4 లక్షల బడ్జెట్ తో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీస్తున్న "విగాత కుమరన్"(తప్పిపోయిన కుమారుడు) అనే సినిమాలో రోసమ్మది సరోజిని అనే అగ్రవర్ణ 'నాయర్' స్త్రీ పాత్ర. రోసమ్మ పేరును "రోజీ" చేసాడు డానియల్. రోజుకు ఐదు రూపాయల కూలీతో 10 రోజులు తనతో షూటింగ్ చేసాడు. పత్రికలూ జనమూ అందరికీ సినిమా గురించి తెలిసిపోయింది. విపరీతమైన కులవివక్ష ఉన్న ఆ కాలంలో ఒక దళిత పులయా స్త్రీ నాయర్ వేషం వేయడం ప్రజలను కల్లోల పరిచింది. చిత్రాన్ని విడుదల చేయనివ్వమని గొడవలు చేస్తున్నారు. ఒకవైపు డానియెల్ అట్టహాసంగా చిత్ర విడుదలకు ఏర్పాట్లు చేసుకున్నాడు.



మొదటి ఆటలోనే విధ్వంసం..

తిరువనంతపురంలోని 'క్యాపిటల్' సినీ థియేటర్ లో మొదటి ఆట ప్రారంభించడానికి 'మల్లూర్ గోవింద పిళ్ళై' అనే ప్రముఖ లాయర్‌ని ఆహ్వానించాడు. అల్లర్లకు భయపడి రోజీని ఆహ్వానించలేదు. అయినా రోజీ క్యాపిటల్ సినిమాకు వచ్చింది. దాంతో 'సినిమాకు అంటరాని పిల్లే కావలసివచ్చిందా?' అని కోప్పడ్డాడు. ఆమె అక్కడ ఉంటే ఆ షో ప్రారంభం చేయనని ఆమెను వెనక్కి తిప్పి పంపాలని గోవింద పిళ్ళై భీష్మించాడు. డానియెల్ రోజీని పంపించేశాడు. రెండో ఆట చూద్దువు గానీలే అని చెప్పాడు. అంటరాని దళిత అమ్మాయి.. మొట్టమొదటి సారి అగ్రవర్ణ 'నాయర్ స్త్రీ ' వేషధారణలో ప్రఖ్యాత సినిమా 'విగాత కుమరన్' మొదటి షో మొదలైంది. సినిమాలో ఒక సన్నివేశంలో ఆ సినీహీరో, హీరోయిన్ తలలోని పువ్వును ముద్దు పెట్టుకుంటాడు. ఆ సీన్ చూసిన మూఢ ప్రేక్షకులు అసహనానికి గురయ్యారు. ఒక పులయా జాతి పిల్లని (నాయర్ వేషం వేసినా) ఒక ఎక్కువ కులానికి చెందిన హీరో ఎట్లా తాకుతాడని, సినిమాకోసమైనా ఎట్లా ముద్దు పెట్టుకుంటాడని ఆగ్రహంతో బెంచీలు ఎత్తేశారు. థియేటర్ అంతా విధ్వంసం సృష్టించారు.


రోజీపైనా దాడి...

అప్పుడే రెండో ఆట చూడడానికి.. తనను తాను తెర పై చూసు కోడానికి వచ్చిన రోజీపై దాడి చేశారు. భయంతో పరుగులు తీసి రోజీ ఒక పూరి గుడిసెలో ఆశ్రయం పొందింది. ఆమె ధైర్యం తమ కులాధిపత్యానికి చేటు కలిగిస్తుందనే మూర్ఖులు... ఆమెని వెంబడించి ఆ ఇంటిని దహనం చేశారు. ఇంటివాళ్ళు ప్రాణభయంతో పారిపోయారు. ఒక స్నేహితురాలి సహాయంతో రోజీ ఆ ఊరి పొలిమేరలు దాటి 'కరమన బ్రిడ్జి' కింద దాక్కుంది. అటుగా సరుకులు తీసుకువెళ్తున్న లారీ డ్రైవర్ 'కేశవ పిళ్ళై' ఆమెను కాపాడి తనతో పాటు తీసుకెళ్లాడు. రోజీని పెళ్లిచేసుకున్నాడు. తరువాత రోజీ ఎప్పుడూ సినిమాల వైపు తిరిగి రాలేదు. కులవివక్ష కారణంగా రోజీ సినీజీవితం ముగిసిపోయింది.

తరువాతి కాలంలో కేరళ ప్రభుత్వం ఆమె నటనను గుర్తించి ఆమె పేరిట అవార్డు నెలకొల్పింది. రోజీ జీవితంపై 'విను అబ్రహాం' అనే రచయిత 'నష్ట నాయికా' పేరుతో నవల రాసాడు. 2013లో రోజీ జీవితకథ ఆధారంగా తీసిన 'సెల్యులాయిడ్' సినిమా 7 రాష్ట్ర అవార్డులు గెలుచుకుంది. పృథ్వీరాజ్ డానియెల్‌గా, మమతా మోహన్ దాస్ ఆయన భార్యగా, రోజీగా చాందిని అనే యువనటి చేసిన ఈ సినిమా కులవివక్షకు బలైపోయిన రోజీ జీవితాన్ని కళ్ళకు కట్టింది. ఇదీ సినిమా కలల్ని కని.. అత్యంత కష్టంగా ఆ కలల్ని నిజం చేసుకుని కులం కారణంగా నిలదొక్కుకోలేకపోయిన అందమైన రోజీ విషాద గాథ.

-రజిత కొమ్ము

రంగ వల్లులు



ఎస్.శైలజ,
అంబారీపేట్,
జగిత్యాల





డి.కల్యాణి పోచన్నపేట్,
జనగాం

మా చిరునామా
మానవి, నవతెలంగాణదినపత్రిక, ఎం.హెచ్. భవన్, 21/1, అజామాబాద్, హైదరాబాద్-20.ఇ-మెయిల్: manavi@navatelangana.com

నవతెలంగాణ

సమ్మెకు ఎస్టీయూ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 8,9 తేదీల్లో చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎస్టీయూటీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు బి భుజంగరావు, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనేక సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న, పోరాడి సాధించుకున్న హక్కులను సైతం కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు సమ్మె చేస్తున్నాయని తెలిపారు. రెండురోజులపాటు జరిగే ఈ సమ్మెలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేయాలని కోరారు.

అయ్యప్ప భక్తుల మరణం దిగ్భ్రాంతికరం

- బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమిళనాడులో జరి గిన రోడ్డు ప్రమాదంలో మన రాష్ట్రానికి చెందిన 10 మంది అయ్యప్ప భక్తులు చనిపోవడం దిగ్భ్రాంతికరమని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని, గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరుస రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం, ట్రాన్స్‌పోర్ట్ రెగ్యులేట్ అథారిటీ నిబంధనలు పాటించకపోవటం, జాతీయ రహదారుల నిర్వహణ తీరు సరిగా లేకపోవటం వల్లే ఈ ఘటన జరిగిందని తెలిపారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు వారి పిల్లల చదువులు, తదితర బాధ్యతలు ప్రభుత్వమే తీసుకోవాలని, గాయపడిన వారికి సరైన వైద్యం అందించాలని కోరారు.

సంక్షోభంలో విద్యారంగం

- ఫిబ్రవరి 18న పార్లమెంట్ ముట్టడి:

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ రంగరాజ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలో మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలతో విద్యారంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి దినేష్ సి రంగరాజన్ విమర్శించారు. విద్యారంగం పట్ల కేంద్రం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 18న పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని అమృతాఎస్టేట్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన సోమవారం మాట్లాడారు. విద్యను కాషాయీకరించేందుకు మోడీ సర్కారు పనిచేస్తోందని విమర్శించారు. దేశంలోని 40 వేల పాఠశాలల మూసివేయించేందుకు కుట్ర పన్నుతుందన్నారు. యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తూ యూజీసీని రద్దు చేసి భారత ఉన్నత విద్య కమిషన్‌ను తెస్తోందన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడాలని, కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 18న పార్లమెంట్ ముట్టడికి పిలుపునిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు అశోక్ స్టాలిన్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.యన్.శంకర్, బోనగిరి మహేందర్, పుట్ట లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌తో ఉత్తమ్ కుమ్మక్కు

సర్వే సత్యనారాయణ విమర్శ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ టీపీసీసీ అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రామచంద్ర కుంతియా తమ పదవుల నుంచి తప్పుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారంటూ విమర్శించారు. అందుకే టికెట్ల పంపకంలో ఆలస్యం చేశారని ఆరోపించారు. ఆదివారం జరిగిన పార్టీ సమీక్ష సమావేశంలో పార్టీ ముఖ్యనేతలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారన్న కారణంతో సర్వేపై సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను కావాలనే ఓడించారని, అధిష్ఠానం డబ్బులు పంపినా టికెట్లు అమ్ముకున్నారని సర్వే ఆరోపించారు. భట్టి విక్రమార్కనూ ఓడించడానికి ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ 24 గంటలు పనిచేస్తుంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉత్తమ్ పెంచి పోషించిన వాళ్లే తనపై దాడికి యత్నించారని, సంబంధం లేని వాళ్లను సమీక్షలో ఎందుకు కూర్చోబెట్టారని అడిగారు. ఉత్తమ్, కుంతియా పార్టీ నుంచి తప్పుకునే వరకు ఆందోళన చేస్తానని స్పష్టంచేశారు. వీళ్ల మొహం చూసే ప్రజలు ఓట్లు వేయలేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో రాహుల్ ప్రధాని కావాలని, ఇక్కడ కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటే పార్టీని ముంచేశారని ఆరోపించారు. ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్ అయితే దేశం కోసం పనిచేస్తారు గానీ, ఈ పైలట్ మాత్రం తుపాకీకి భయపడి కౌగిలించుకునే రకమంటూ ఉత్తమ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఉత్తమ్, కుంతిపై తిట్లదండకం అందుకున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య



మౌనిక. (ఫైల్)

నవతెలంగాణ- మలక్‌పేట

హైదరాబాద్‌లోని మలక్‌పేటలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వివరాల ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట డివిజన్ అఫ్జల్‌నగర్‌కు చెందిన మౌనిక(33) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. అదే ప్రాంతంలోని లాండ్‌మార్క్ రెసిడెన్సీలో తల్లి సిల్వర్‌మని, కుమారుడు ఆర్యన్‌తో కలిసి నివాసముంటోంది. ఆదివారం రాత్రి రెసిడెన్సీలోని ఓ ఫ్లాట్‌లో జరిగిన గృహ ప్రవేశానికి హాజరై ఇంటికి వచ్చిన మౌనిక బెడ్‌రూంలోకి వెళ్లింది. ఆ తర్వాత చీరతో ఉరేసుకుంది. ఆ సమయంలో తల్లి, కుమారుడు ఇంట్లోనే ఉన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. 2007లో మౌనికకు అభిషేక్‌తో వివాహం జరిగింది. 18 నెలలుగా భర్తతో దూరంగా ఉందనీ, ప్రస్తుతం తన వద్దే ఉంటోందనీ ఆమె తల్లి పోలీసులకు వివరించింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏకగ్రీవం లభించలేదని ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-మల్లాపూర్

సర్పంచ్ పదవి ఏకగ్రీవానికి తాను రూ.5లక్షలు ఇచ్చేందుకు ముందుకొచ్చినా వార్డు సభ్యులు అడ్డుకుంటున్నారని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఒగులాపూర్ తండాలో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితుని వివరాల ప్రకారం.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో తండాలో రిజర్వేషన్ ఎస్టీ మహిళకు కేటాయించారు. ఈ సందర్భంగా సోమవారం తండాలో పెద్దమనుషుల సమక్షంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవ తీర్మానానికి అభ్యర్థి రూ.5లక్షలు గ్రామాభివృద్ధి కోసం ఇవ్వాలని తీర్మానించారు. ఆ తండాకు చెందిన టీఆర్ఎస్ నాయకుడు భూక్య దేవదాసు రూ.5లక్షలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఏకగ్రీవ తీర్మానంతరం గ్రామపెద్దలు ఒకేసారి రూ.5లక్షలు కట్టాలని కోరడంతో తమ వద్ద రూ.2 లక్షలు ఉన్నాయనీ, మిగతా రూ.3లక్షలు వాయిదా ప్రకారం చెల్లిస్తాననీ విన్నవించాడు. ఇందుకు వారు ఒప్పుకోలేదు. అంతేగాక ఇతర వార్డు సభ్యులూ 'రూ.5లక్షలు మేము చెల్లిస్తాం.. నువ్వు తప్పుకో' అంటూ బలవంతం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన దేవదాసు ఇంట్లోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించిన వెంటనే మెట్‌పల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ విద్యుత్తు ఉద్యోగుల మహాసభలో ఆర్ కృష్ణయ్య



- ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం : జెన్‌కో సీఎండి ప్రభాకర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో బీసీ విద్యుత్తు ఉద్యోగుల 13వ రాష్ట్ర మహాసభ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీ విద్యుత్తు ఉద్యోగుల డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతున్నది ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 56 శాతం బీసీలున్నా ఉద్యోగ రంగాల్లో 14 శాతం దాటడం లేదన్నారు. రిజర్వేషన్లతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. విద్యుత్తు రంగంలోని ఉద్యోగుల సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని జెన్‌కో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి ప్రభాకర్‌రావు చెప్పారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు అందిస్తున్న ఘనత తెలంగాణకే దక్కుతుందన్నారు. విద్యుత్తు రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఉందన్నారు. డిమాండ్‌కు తగ్గ విద్యుత్తు సరఫరా చేస్తున్నామని తెలిపారు. సంస్థలో ఉద్యోగుల భర్తీ, వేతనాల పెంపు కోసం అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. బీసీ ఉద్యోగుల సంఘం సూచించిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీడీసీఎల్ చైర్మెన్ రఘుమారెడ్డి మాట్లాడుతూ కొన్ని సమస్యలు కోర్టులో పెండింగ్‌లో ఉన్నందు వల్ల పరిష్కరించ లేకపోయామన్నారు. ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి సంస్థను నష్టాల భారీన పడకుండా చూడాలని కోరారు. ఎన్పీడీసీ డైరెక్టర్ గోపాల్‌రావు మాట్లాడుతూ అవసరమైన సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యుత్తు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు ఎందుకు.?

ఆర్థిక సహాయం.. అందించండి చాలు : ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓబీసీలకు రిజర్వేషన్లకు బదులుగా వారికి ఆర్థిక సహాయం, సబ్సిడీ పథకాలను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య సూచించారు. ప్రధాని నరేంద్రమోడి తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇది ఒక ఎన్నికల స్టంట్‌గా ఆయన అభివర్ణించారు. అగ్రకులాలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు సామాజిక వివక్షకు గురవుతున్నారని, దాన్ని రూపుమాపాలంటే వారంతా అత్యున్నత ఉద్యోగాలు చేయాల్సిన అవసరం ఉందని, ఆయా కులాల వారీగా రిజర్వేషన్లు పెంచితేనే అదిసాధ్యమవుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల భర్తీ చేపట్టకుండా రిజర్వేషన్లు పెంచినంత మాత్రానా నిరుద్యోగ సమస్య తీరదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అయినప్పటికీ బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. బీసీలకు సంబంధించి విద్యా, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని దేశంలోని బీసీ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక వివక్ష నానాటికి పెరిగిపోతున్నదని, దాన్ని నిర్మూలించకుండా ఓబీసీ రిజర్వేషన్లను పెంచడం సరికాదన్నారు.

ఆర్థిక, అభివృద్ధి కోసం రిజర్వేషన్లా - జాజుల శ్రీనివాస్ గౌడ్

ఓబీసీల ఆర్థిక, అభివృద్ధి కోసం విద్యా, ఉద్యోగ రంగాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం సమంజసం కాదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అగ్రకులాల్లోని పేదలకు తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ ఆర్థికాభివృద్ధి కోసం రిజర్వేషన్లను కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అగ్రవర్ణ పేదల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలే కాని రిజర్వేషన్లు కల్పించడం అన్యాయమన్నారు. అన్ని కులాల్లో పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేయండి

స్నేహపూర్వక సమాఖ్య విధానం కావాలి

- లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన టీఆర్ఎస్ ఎంపీలు
- నలుగురు సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- ఏపీ సీఎం తీరును ఎండగట్టిన కేంద్రమంత్రి పీయూష్ గోయల్

నవ తెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

గత 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని టీఆర్ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ కోరారు. వర్గీకరణ డిమాండ్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇదివరకే అసెంబ్లీ తీర్మానం చేసిందని... అయితే, కేంద్రం స్పందించకుండా ఉంటుందని చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో ప్రసంగించారు. 2014 ఎన్నికల ముందుకు బీజేపీ... ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన అంశాన్ని ఈ సందర్భంగా ఆయన సభలో ప్రస్తావించారు.



రాజ్యాంగపరంగా ఉన్నటువంటి హక్కునే తెలంగాణలోని మాల, మాదిగలు అడుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. కాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్నేహపూర్వక సమాఖ్య విధానం ఉండాలని మహబూబ్‌నగర్ ఎంపీ, టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన అధికారాల వివరాలున్నాయని... దాని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ చట్టం, కేంద్ర ప్రభుత్వాల చట్టాలతో సంఘర్షణ ఏర్పడినప్పుడు కేంద్ర చట్టమే చెల్లుబాటు అవుతుందని అన్నారు. అయితే, ఇది ప్రధాని మోడీ విజన్ ఫెడరలిజానికి విరుద్ధమని ఆయన ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకువచ్చారు. అందుచేత, దానిని మార్చాలని కేంద్రాన్ని కోరారు. ఇదే విషయంపై తమ ప్రభుత్వాధినేత ఎన్నోసార్లు పలు వేదికలపై చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బహుళ రాష్ట్రాలు గల ఈ దేశంలో ఆ విధానం సరైంది కాదని వెల్లడించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు.

ప్యాకేజీపై టీడీపీయే డ్రామాలు : పియూష్ గోయల్

టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీలు సరికొత్త డ్రామాలు ఆడుతున్నారని రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి ప్యాకేజీని స్వాగతించిన చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని అభినందించారని గుర్తు చేశారు. సోమవారం పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ ఎంపీలను నిలదీస్తూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి ప్రత్యేక ప్యాకేజి ఇచ్చినప్పుడు అభినందించి, ఇప్పుడు నిరసన పేరుతో డ్రామాలు ఆడుతున్నారా? అంటూ ప్రశ్నించారు. ఏపీలో భారీ అవినీతి కుంభకోణాలకు పాల్పడిన టీడీపీ నేతలు, వాటిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా కంటే అధికంగా నిధులు సమకూరేలా ప్యాకేజీ ప్రకటించామన్నారు. ఏపీకి అన్యాయం చేసిన కాంగ్రెస్‌తోనే చంద్రబాబు జట్టుకట్టి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

లోక్‌సభ నుంచి టీడీపీ ఎంపీ శివప్రసాద్, అన్నాడీఎంకే సభ్యుల సస్పెన్షన్

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలంటూ పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద టీడీపీ, వైసీపీ ఎంపీలు వేర్వేరుగా సోమవారం ఆందోళన చేశారు. తమిళనాడు మాజీ సీఎం ఎంజీ రామచంద్రన్ వేషధారణలో చిత్తూరు ఎంపీ శివప్రసాద్ నిరసన తెలిపారు. సభ ప్రారంభం కాగానే... లోక్‌సభ వెల్‌లో ఆందోళన చేస్తున్న ఎంపీ శివప్రసాద్‌ను స్పీకర్ సుమిత్రా మహాజన్ రెండు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఆయనతో పాటు అన్నాడీఎంకెకి చెందిన ముగ్గురు సభ్యులను కూడా సస్పెండ్ చేసినట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటించింది.

13 నుంచి పతంగుల పండుగ

తెలంగాణలో ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్

- 19 దేశాల నుంచి ఔత్సాహికులు : పర్యాటక శాఖ కార్యదర్శి బి. వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పతంగుల పండుగకు హైదరాబాద్ నగరం సిద్ధమవుతున్నది. రాష్ట్రంలో ఈనెల 13వ తేదీ నుంచి పతంగుల పండుగ ప్రారంభం కానుంది. ఈనెల 15వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో 4వ తెలంగాణ అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌ను కేంద్ర పర్యాటక శాఖతో కలిసి తెలంగాణ పర్యాటక శాఖ నిర్వహించనుంది. 19 దేశాల నుంచి ఔత్సాహికులు హాజరవుతున్నారని పర్యాటక శాఖ కార్యదర్శి బి.వెంకటేశం చెప్పారు. సోమవారం సచివాలయంలో కైట్ ఫెస్టివల్ బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ చదువు ఆవశ్యకత, బాలికా సాధికారిత నినాదంతో ఈ ఏడాది కైట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని అన్నారు. కైట్ ఫెస్టివల్‌కు గతేడాది 8 లక్షల మంది వచ్చారనీ, ఈసారి 9 లక్షల మంది సందర్శకులు వస్తారనీ అంచనా వేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో స్వీట్ ఫెస్టివల్‌నూ నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వివిధ ప్రాంతాల ప్రజలు వెయ్యి రకాల స్వీట్లను అక్కడికక్కడే తయారుచేసి కావల్సిన వారికి విక్రయిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, టీఎస్‌టీడీసీ ఇంచార్జి దినకర్ బాబు, ఎండి మనోహర్, ఇండియన్ టూరిజం రెసిడెన్స్ డైరెక్టర్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఖమ్మం ఎంపీ పొంగులేటికి ఎసరు..?

అభ్యర్థుల ఓటమికి కారకుడని నిందలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- పొంగులేటి లక్ష్యంగా కదులుతున్న పావులు..
- ఈసారి పార్లమెంట్ టికెట్ అనుమానమే !





ఫైల్

నవతెలంగాణ- ఖమ్మం ప్రతినిధి

ఖమ్మం పార్లమెంటు సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెక్ పెట్టేందుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎంపీ సహకరించకపోవడం వల్లే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ అభ్యర్థుల పరాజయం పొందినట్టు ఆ పార్టీ భావిస్తోంది. అతనిపై చర్యలు తీసుకోకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని వివిధ నియోజకవర్గాల్లో కార్యకర్తలు నిరసనలకు దిగుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాలకుగానూ ఖమ్మం స్థానం మినహా అన్నింటా టీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమిపాలైన విషయం తెలిసిందే. సీఎం కేసీఆర్ స్వయంగా ఎనిమిది నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. అయినప్పటికీ మూడున్నర దశాబ్దాల పాటు రాజకీయాలను శాసించిన సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం ఓటమి చెందడం ఆ పార్టీని కుంగదీసింది. తమ ఓటమికి ఎంపీయే కారణమని సీఎం కేసీఆర్‌కు అభ్యర్థులు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై వేటుకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ దఫా ఎంపీ టికెట్ దక్కడం అనుమానమే అనే చర్చ జరుగుతోంది.

పెల్లుబుకుతున్న నిరసనలు..

ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం, పాలేరు నియోజకవర్గాల్లో ఎంపీ అనుచరులుగా చెప్పుకునే వారు పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపణలు చేస్తున్నారు. ఈ అన్నింటిలోనూ ఎంపీ అనుచరులు టీఆర్ఎస్ వ్యతిరేకులతో కలిసి అంటకాగారన్న అపవాదును మూటగట్టుకున్నారు. అందుకే తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఏ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి వెళ్లినా పార్టీ ఓటమికి కారణమైన ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోరని కార్యకర్తలు నిరసనలు తెలుపుతున్నారు. మొదటి నుంచీ వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేటల్లో అభ్యర్థులను మార్చాలనీ లేకపోతే ఓడించి తీరుతామని ఏకంగా ఎంపీ వర్గీయులు హెచ్చరికలు జారీ చేయడం.. అన్నట్టుగానే వారంతా ఓడిపోవడంతో ప్రస్తుతం ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఉమ్మడి ఏపీలోనే మాదిగ సామాజిక తరగతికి పట్టున్న నియోజకవర్గంగా గుర్తింపు ఉన్న మధిరలో ఎంపీ పట్టుబట్టి మాల సామాజిక తరగతికి చెందిన తన అనుచరుడికి సీటు ఇప్పించడంతో ఆ సీటును కోల్పోవాల్సి వచ్చిందని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

ఎంపీకి సీటు కష్టమేనా..?

ఎన్నికల ఫలితాలు వెలువడిన డిసెంబర్ 11వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు సీఎం కేసీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 'ఖమ్మం జిల్లాలో మా వాళ్లే ఒకరినొకరు చంపుకున్నారు. అందుకే అక్కడ గెలవలేకపోయాం' అని ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమికి కారకులెవరనే దానిపై నివేదిక తెప్పించుకున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎంపీపై పెల్లుబుకుతున్న నిరసన నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో పొంగులేటికి సీటు రావడం కష్టమేనన్న సంకేతాలు అందుతున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ టికెట్ వచ్చినా తమను ఓడించినందుకు బహుమానంగా 'రిటర్న్ గిఫ్ట్' ఇస్తామని ఆ పార్టీ నాయకులే అంటున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎంపీని మార్చకపోతే వ్యతిరేక ఫలితాలు వస్తాయన్న సంకేతాలు ఉన్నాయి. ఎంపీ టికెట్ రేసులో ఇద్దరి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు చర్చ జరుగుతోంది. అందులో ఒకరు రాష్ట్రస్థాయిలో కార్యదర్శి పదవిలో ఉన్న వ్యక్తికాగా, మరొకరు వేరే పార్టీ నుంచి టీఆర్ఎస్‌లో చేరి ఎంపీగా పోటీలో ఉంటారని కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకుల నిరసనలు, మరోవైపు అతనిపై ఎందుకు చర్యలు తీసుకోరని జిల్లా నాయకుల నిలదీతల నేపథ్యంలో ఇక పొంగులేటి రాజకీయ భవిష్యత్ మసక బారినట్టేనని చర్చ జరుగుతోంది.

జూనియర్ కాలేజీల గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం (2019-20)లో అనుబంధ గుర్తింపు పొందేందుకు జూనియర్ కాలేజీ యాజమాన్యాల నుంచి ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేయొచ్చని తెలిపారు. దరఖాస్తుతోపాటు అవసరమైన సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. అపరాధ రుసుం రూ.1000తో వచ్చేనెల 12 వరకు, అపరాధ రుసుం రూ.3 వేలతో వచ్చేనెల 25 వరకు, అపరాధ రుసుం రూ.5 వేలతో మార్చి 8 వరకు, అపరాధ రుసుం రూ.10 వేలతో మార్చి 20వ తేదీ వరకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. అనుబంధ గుర్తింపుతోపాటు అదనపు సెక్షన్ల కోసం దరఖాస్తు చేయాలని సూచించారు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- ఎన్‌సీసీఓఈఈఈ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రం ముందుకు తీసుకొచ్చిన విద్యుత్ సవరణ బిల్లు-2018ని వ్యతిరేకిస్తూ విద్యుత్‌మ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులందరూ సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని ఎస్‌సీసీఓఈఈఈ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మంగళవారం నాడు విద్యుత్ సర్కిళ్ల కార్యాలయాలు, విద్యుత్ కేంద్రాల వద్ద మధ్యాహ్న సమయంలో నిరసనలు చేపట్టనున్నట్టు, బుధవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెకు ఐద్వా మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంగళ, బుధవారాల్లో జరిగే జాతీయ సమ్మెకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు రక్షణ లేకుండాపోయిందని అన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మికులను శ్రమదోపిడీ చేయిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గాంధీలో మూలనపడ్డ సంతాన సాఫల్య కేంద్రం

గాంధీ ఆస్పత్రిలో నెలకొల్పిన సంతాన సాఫల్య కేంద్రం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ ఒక ప్రకటనలో విమర్శించారు. గతేడాది జనవరి 25న కోట్లాది రూపాయలతో ప్రారంభించిన ఈ కేంద్రం నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది గడిచినా నేటికి ఒక్కరికి కూడా ఐవీఎఫ్ సదుపాయాన్ని కల్పించకపోవడమే ఇందుకు నిదర్శనమని వాపోయారు. కోట్లాది రూపాయలు వెచ్చించి కొన్న పరికరాలు అలంకార ప్రాయంగా మారాయన్నారు. గైనిక్ విభాగంలో 16 మంది వైద్యులకుగాను 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సరిపడ టెక్నీషియన్లు కూడా లేరని విమర్శించారు. అంతేకాకుండా ఆస్పత్రిలో 2 వేల మందికి కేసీఆర్ కిట్లు అందలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంతానలేమి పేదలకు వైద్యసేవలు అందే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

అడ్‌హక్ పదోన్నతులు చేపట్టాలి : పీఆర్టీయూ తెలంగాణ


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యారంగంలో కొన్నేండ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను అడ్‌హక్ పద్ధతిలో పదోన్నతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి పీఆర్టీయూ తెలంగాణ సూచించింది. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాను పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, ఎం చెన్నయ్య కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్వీసు రూల్స్ పేరుతో ఉపాధ్యాయుల పదోన్నతులను భర్తీ చేయకపోవడం వల్ల పాఠశాల విద్యలో ప్రమాణాలు దిగజారుతున్నాయని తెలిపారు. ఒక్కో ప్రధానోపాధ్యాయునికి ఎంఈవోగా నాలుగైదు మండలాల ఇంచార్జీ బాధ్యతలు ఇవ్వడం ద్వారా పర్యవేక్షణ పూర్తిగా లేకుండా పోయిందని పేర్కొన్నారు.

జర్దారీ ఆస్తులను జప్తు చేయాలి

పాక్ సుప్రీంకు జేఐటీ సిఫారసు

ఇస్లామాబాద్: నకిలీ ఖాతాల ద్వారా సుమారు రూ.22 వేల కోట్ల మేర అవినీతికి పాల్పడిన కేసులో పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆస్తులను జప్తు చేయాల్సిందిగా జాయింట్ ఇన్వెస్టిగేషన్ టీం (జేఐటీ) సుప్రీంకోర్టుకు సిఫారసు చేసింది. ఈమేరకు జేఐటీ కరాచీ, లాహోర్‌లలోని ప్రఖ్యాత బిలావల్ హౌజ్, ఇస్లామాబాద్‌లోని జర్దారీ ఇంటిని జప్తుచేయాలని కోరుతూ శనివారం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. కరాచీలోని 5 ప్లాట్లతో పాటు న్యూయార్క్, దుబాయిల్లో ఉన్న జర్దారీ ఆస్తులను కూడా జప్తు చేయాలంది. దర్యాప్తు బృందం జర్దారీ పట్టణ, వ్యవసాయ భూములు, జర్దారీ గ్రూప్, అతని సోదరి ఫరీల్ తాల్పూర్ ఆస్తులపై విచారణ జరపాల్సిందిగా నివేదికలో కోరింది. జర్దారీ, ఓమ్ని గ్రూప్స్ ప్రభుత్వ నిధుల్లో అక్రమాలకు పాల్పడినట్లు, నగదును 'హుండి', 'హవాలా' ద్వారా దేశం నుంచి బదిలీ చేసినట్లు ఆరోపించింది. ఆయన ఆస్తులను దేశం నుంచి బదిలీ చేసే అవకాశం ఉన్నందున ఈ కేసులో తీర్పు వెలువడే వరకు ఆస్తులను జప్తు చేయాల్సిందిగా కోరింది. కాగా, జర్దారీ, తాల్పూర్‌లు ఈ నివేదికను ఊహాగానాలుగా, రాజకీయ వేధింపులను లక్ష్యంగా చేసుకుని రూపొందించారని ఆరోపించారు. జర్దారీ, ఇక్బాల్ మెమాన్ పేరుతో ఓ బినామీ కంపెనీని స్థాపించగా, దాన్ని 1998లో జప్తు చేశారు. ఈ కేసులో జర్దారీ అత్యంత సన్నిహితుడైన హుస్సేన్ లవాయి గతేడాది జూలైలో అరెస్టు కాగా, మరో సన్నిహితుడు ఓమ్ని గ్రూప్ చైర్మన్ అన్వర్ మాజీద్, అతని కుమారుడు అబ్దుల్ ఘనీ మజీద్‌ను గతేడాది ఆగస్టులో అరెస్టు చేశారు.


(ఫైల్)

సౌదీకి వెళ్తే చంపేస్తారు : సోషల్ మీడియాలో యువతి వీడియో వైరల్



బ్యాంకాక్: సౌదీ అరేబియాకు చెందిన 18 ఏండ్ల రాహఫ్ అల్ కునన్ అనే యువతి ప్రస్తుతం బ్యాంకాక్‌లో చిక్కుకున్నది. కువైట్‌లో ఉన్న తల్లిదండ్రుల నుంచి తప్పించుకున్న ప్రయత్నంలో ఆమె థాయిలాండ్ చేరుకున్నది. అయితే బ్యాంకాక్‌లోని ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆమెను ఓ హోటల్‌లో బంధించారు. తిరిగి ఆ టీనేజర్‌ను కువైట్‌లో ఉన్న ఆమె పేరెంట్స్‌కు అప్పచెప్పాలని ప్రయత్నిస్తున్నారు. కుటుంబసభ్యులతో తనకు ప్రాణ హాని ఉందని, తాను ఇస్లామ్‌ను వదిలివేశానని, అందుకే ఆస్ట్రేలియా పారిపోతున్నట్టు ఆమె ఓ వీడియో సందేశంలో చెప్పింది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా థాయ్‌కు వెళ్లిన ఆ యువతిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. ఆ తర్వాత సౌదీ ఎంబీసీ అధికారులు ఆమెను ఆధీనంలోకి తీసుకున్నారు. ఏ దేశమైనా తనకు ఆశ్రయం కల్పిస్తే అక్కడకి వెళ్తానని ఆమె తన వీడియో సందేశంలో కోరింది. ఇస్లామ్‌ను వదిలివేసి ఇంటికి వెళ్లిన వారిని దారుణంగా శిక్షిస్తారని, అందుకే తనకు కువైట్‌కు వెళ్లలేదని ఆమె చెబుతోంది. ఐక్యరాజ్యసమితి తనకు ఆశ్రయం కల్పించాలని కోరుతోంది. గత ఏడాది ఆరంభంలో కూడా ఓ మహిళ ఇలాగే కెనడాకు పారిపోయేందుకు ప్రయత్నించింది. ఆమెను ఫిలిప్పీన్స్ నుంచి కువైట్‌కు పంపించారు. కానీ ఇప్పటి వరకు ఆ మహిళ ఆచూకీ తెలియలేదు. అందుకే రాహఫ్ భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.ఐరాస సాయం కోసం అభ్యర్థన : ఇతర దేశాల్లో ఆశ్రయం పొందేందుకు వీలుగా ఐరాస అధికారులు తనకు సాయం అందించాలని సోషల్ మీడియా ద్వారా అల్ కునన్ వేడుకుంది. హక్కుల సంఘం అధికారులు వచ్చేంత వరకు తాను థాయ్‌లో నిర్బంధానికి గురైన గది నుంచి బయటకు రాలేనని పేర్కొంది. ఇమ్మిగ్రేషన్ అధికారులు కూడా అల్ కునన్ ట్విట్టర్ పోస్ట్‌పై స్పందించారు. ఆమెను బలవంతంగా దేశ బహిష్కరణ చేయలేమని స్పష్టం చేశారు. మానవతా ధృక్పథంతో తామీ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

తాలిబన్ల దాడుల్లో 27 మంది మృతి

కాబూల్ : అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరంపై తాలిబన్లు మెరుపుదాడులకు పాల్పడ్డారు. రెండు వేర్వేరు చోట్ల జరిగిన దాడుల్లో 27 మంది మృతి చెందారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నారు. మరో ఆరుగురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. పాక్టికా ప్రావిన్స్ అధికారి బక్తియర్ గుల్ హెమత్ తెలిపిన వివరాల ప్రకారం...జానిఖెల్ జిల్లాలో రోడ్డు పక్కన పాతివున్న బాంబు పేలింది. ఈ ఘటనలో ఆరుగురు పౌరులు మృతి చెందారు. బాగిస్ ప్రావిన్స్‌లో తాలిబన్ల మెరుపుదాడిలో 21 మంది సైనికులు మృతిచెందారు. కాగా, తాలిబన్ల ఏరివేత కోసం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నామని బాద్గీస్ ప్రావిన్స్ గవర్నర్ జమ్షీద్ షాహబీ తెలిపారు. అఫ్ఘాన్ సైన్యం దాడుల్లో 15 మంది తాలిబన్లు మృతి చెందగా, 10 మంది గాయపడ్డారని అన్నారు. ఖాదిస్ జిల్లాలో ఆదివారం జరిగిన పేలుడులో 14 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు పోలీసులు, 12 మంది సైనికులు ఉన్నారని ఖాదిస్ ప్రావిన్స్ చీఫ్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఇదిలా ఉండగా, అఫ్ఘాన్‌లో మోహరించిన విదేశీ బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తాలిబన్లు డిమాండ్ చేస్తున్నారు. అఫ్ఘాన్ ప్రభుత్వంతో ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు నిరాకరిస్తున్నారు. తాలిబన్లతో చర్చలకు అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తున్నది.

వెనక్కి తగ్గిన ట్రంప్

అమెరికా - మెక్సికో గోడ నిర్మాణానికి బదులుగా స్టీల్ కంచె

వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గారు. గోడ నిర్మాణానికి బదులుగా స్టీల్‌తో ధృడమైన కంచె ఏర్పాటు చేయాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. ఈ విషయాన్ని ట్రంప్ వెల్లడించారు. అమెరికా పాక్షిక షట్‌డౌన్ ముగిసేంత వరకు తన యంత్రాంగం, డెమోక్రటిక్ పార్టీ నేతలతో చర్చలు జరుపుతుందని అన్నారు. అతి త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించినట్టయితే ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదిస్తానని ట్రంప్ పట్టుబట్టడం.. అందుకు డెమోక్రటిక్ నేతలు అంగకరించకపోవడంతో



అమెరికాలో పాలన స్తంభించిన సంగతి తెలిసిందే.ఈ విషయంలో డెమోక్రటిక్ నేతలు కూడా పట్టుదలతో ఉండడంతో షట్‌డౌన్ ముగించేందుకు ట్రంప్ కాస్త తన పట్టు వీడారు. 'మేము ప్రస్తుతం సరిహద్దులో కాంక్రీటు గోడకు బదులుగా స్టీలు కంచె ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేస్తున్నాం.

ఇది దృఢంగా ఉండటమే కాకుండా వలసలను అడ్డుకుంటుంది. ఇదే మంచి పరిష్కారం' అని ట్రంప్ అన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, పలువురు కీలక డెమోక్రటిక్ నేతలతో చర్చలు జరిపిన అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డెమోక్రట్లకు, పెన్స్‌కు జరిగిన సమావేశం ఫలవంతంగా జరిగిందని ట్రంప్ తెలిపారు. సరిహద్దు రక్షణ అంశంపై అనేక అంశాలు చర్చకు వచ్చాయని అన్నారు. స్టీలు కంచె విషయంపై కూడా చాలా మంది అభిప్రాయాలు తీసుకున్నామని అన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

గాజా : ఇజ్రాయిల్ వాయుసేన గాజా నగరంపై బాంబుల వర్షం కురిపిం చింది. గాజా ఉత్తర ప్రాం తంలోని బీట్ లహియా నగరంపై ఆది వారం అర్ధ రాత్రి రెండు క్షిపణులు ప్రయోగించింది. అదృష్టవ శాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. హమాస్‌లో సైనిక శిబిరాల లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్టు గాజా అధికారులు పేర్కొన్నారు. ఖాన్ యూనిస్ సైనిక శిబిరానికి సమీపంలో ఓ క్షిపణి, గాజా నగరంపై మరో క్షిపణి ప్రయోగం జరిగిందన్నారు. ఇజ్రాయిల్ దాడులను సమర్థవంతంగా తిప్పిగొడతామని గాజా ప్రకటించింది.

పిడికిలెత్తనున్న కార్మికలోకం

నేడు, రేపు సమ్మెలోకి కార్మికులు, ఉద్యోగులు

- 25 లక్షల మంది పాల్గొనే అవకాశం
- నేడు ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా
- జనగామ, జగిత్యాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- రేపు అన్ని కలెక్టరేట్ల ఎదుట ఆందోళనలు
- మండల, డివిజన్ కేంద్రాల్లో కార్మికుల ర్యాలీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా రెండు రోజుల సమ్మెకు కార్మికలోకం సన్నద్ధమైంది. కార్మిక చట్టాల నిర్వీర్యాన్ని వ్యతిరేకిస్తూ పిడికిలెత్తనున్నది. కోర్టుల ఆదేశానుసారం కనీస, సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని గొంతెత్తి నినదించనున్నది. ఉద్యోగభద్రత కోసం రోడ్లెక్కి ఆందోళన బాట పట్టనున్నది. దీనికి ఉద్యోగ రంగం కూడా తోడు కానున్నది. దీంతో మంగళ, బుధవారాల్లో జరిగే సార్వత్రిక సమ్మెలో 25 లక్షల మందికిపైగా కార్మికులు, ఉద్యోగులు పాలుపంచుకునే అవకాశమున్నది. 10 కేంద్ర కార్మిక సంఘాలతోపాటు స్వతంత్ర ఫెడరేషన్లు, వివిధ రంగాలవాళ్లు, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు సమ్మెలో పాలుపంచుకోనున్నారు.

కేంద్రంలోని మోడీ సర్కారు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2018 సెప్టెంబర్ 28 పది కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు కలిసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విదితమే. అందులో భాగంగా మంగళ, బుధ వారాల్లో సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఎఐటీయూసీ, హెచ్‌ఎమ్ఎస్, టీయూసీసీ, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూ , ఎల్‌పీఎఫ్, యూటీయూసీ, ఎస్ఇడబ్ల్యుఎ, టీఆర్ఎస్‌కేవీ, ఇఫ్టూ కార్మిక సంఘాలతోపాటు కార్మిక ఫెడరేషన్లు సమ్మెలో పాల్గొనబోతున్నాయి. రాష్ట్రంలో సింగరేణి, ఆర్టీసీ, స్కీమ్ వర్కర్ల కార్మిక సంఘాల వాళ్లు, పారిశ్రామిక వాడల్లో కార్మికులు, పెన్షనర్లు, టీచర్లు, బ్యాకింగ్ రంగ ఉద్యోగులు, తదితర రంగాల వాళ్లు ఈ సమ్మెలో పాల్గొనబోతున్నారు.



సమ్మెలో భాగంగా తొలిరోజైన మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గల ధర్నాచౌక్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నారు. జనగామ, జగిత్యాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టనున్నారు. చర్లపల్లి, నాచారం, బోడుప్పల్, పటాన్‌చెర్వు తదితర పారిశ్రామిక వాడల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టనున్నారు. బుధవారం మిగతా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నారు.

సార్వత్రిక సమ్మె 12 డిమాండ్లు ఇవే..

- ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ధరల పెరుగుదల అరికట్టడానికి సత్వర చర్యలు చేపట్టాలి. సరుకుల మార్కెట్‌లో చట్టా వ్యాపారాన్ని నిషేధించాలి.
- ఉపాధి కల్పనకు నిర్దిష్ట చర్యలు చేపట్టడం ద్వారా నిరుద్యోగాన్ని అరికట్టాలి.
- ఎటువంటి మినహాయింపులు, రాయితీలు లేకుండా మౌలిక కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. కార్మిక చట్టాల ఉల్లంఘనకు కఠిన శిక్షలు విధించాలి.
- కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పించాలి.
- ధరల సూచికతో కూడిన కనీస వేతనం నెలకు రూ.18000 వేలు ఇవ్వాలి.
- రూ.6000లకు తగ్గకుండా కార్మికులందరికీ పెన్షన్ ఇవ్వాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లోని పెట్టుబడి ఉపసంహరణను, వ్యూహాత్మక అమ్మకాలను నిలిపేయాలి.
- కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి. ఆ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి.
- బోనస్, ప్రావిడెంట్ ఫండ్‌ల చెల్లింపులకున్న అన్ని సీలింగులు ఎత్తివేయాలి.
- దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచి 45 రోజుల లోపల తప్పనిసరిగా కార్మిక సంఘాలను రిజిస్టరు చేయాలి. ఐఎల్ఓ కన్వెన్షన్ సి87, సి98లను తప్పక వెంటనే ధ్రువీకరించాలి.
- ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలి.
- రైల్వేలు, బీమా, రక్షణ రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వ్యతిరేకించాలి.

అసాంఘిక శక్తుల బారిన పిల్లలు పడకుండా జాగ్రత్త పడాలి

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో తప్పిపోయిన పిల్లలు మొదలుకుని వీధి బాలలు, వెట్టి చాకిరి చేస్తున్న బాలకార్మికులను రక్షించి వారి తల్లి దండ్రులకు చేర్చే ఆపరేషన్ స్మైల్‌ను రాష్ట్ర సీఐడీ అదనపు డీజీ గోవింద్‌సింగ్ సోమవారం ప్రారంభించారు. అలాగే డీజీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఒక రోజు పాటు పోలీసు అధికారులు, ఇతర శాఖలకు చెందిన అధికారులకు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్‌లపై జరిగిన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవింద్‌సింగ్ మాట్లాడుతూ.. తప్పిపోయిన పిల్లలతో పాటు వీధిబాలలు అసాంఘిక శక్తుల బారిన పడే ప్రమాదం ఉందని దానిని నివారించడానికి ఆపరేషన్ స్మైల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే అనేక కార్ఖానాలు, చిన్న చిన్న పరిశ్రమలలో బాలలను చేర్చుకుని వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పిల్లలను ఆ విధంగానే వదిలేసిన పక్షంలో భవిష్యత్తులో అనేక దుష్పరిణామాలను సమాజం ఎదుర్కొంటుందని ఆయన అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి గాను ఈ రెండు ఆపరేషన్‌లను చేపట్టడం జరిగిందని తెలిపారు.

మేఘాలయాలో మరో బొగ్గుగని ప్రమాదం

- ఇద్దరు కార్మికులు మృతి

షిల్లాంగ్: మేఘాలయలో మరో అక్రమ బొగ్గుగనిలో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తన మేనల్లుడు శుక్రవారం నుంచి కనిపించడంలేదని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మేఘాలయాలోని ముకునోర్ ప్రాంతంలో ఆదివారం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం....మైన్‌లో పనిచేసే తన మేనల్లుడు ఎలద్‌బరే శుక్రవారం నుంచి కనిపించడం లేదని పోలీసులకు అతని మేనమామ పిలిప్‌బరే ఫిర్యాదుచేశాడు. దీంతో పోలీసులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా ర్యాట్‌హోల్ అనే కోల్‌మైన్ ముందు ఎలద్‌బరే మృతదేహం లభించింది. దీంతో మైన్‌లో ఇంకెవరైనా ఉన్నారేమో అన్న సందేహంతో లోపలికి వెళ్లారు.

ఇంతలో వారికి మరో మృతదేహం లభించింది. మృతున్ని మనోజ్‌బాసుమత్రిగా గుర్తించారు. బొగ్గు తీయడానికి ప్రయత్నించినప్పుడు బండరాళ్లు వారిపై పడి చనిపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ అక్రమ బొగ్గుగని యజమానిని పట్టుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా 2014లో ర్యాట్ హోల్ మైనింగ్‌కంపెనీపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తాత్కాలిక నిషేదం విధించిన సంగతి తెలిసిందే.

గతేడాది డిసెంబర్‌లో మైన్‌లో చిక్కుకున్న 15మందిని వెలికితీసే చర్యలు కొనసాగుతున్నాయి. మైన్‌లో ఉన్న నీటిని బయటకు తోడటానికి వాడుతున్న రెండు హైపవర్ మోటార్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వీటికి మరమ్మతులు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కాగా రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌ను ఆపడంలో విఫలమైనందుకు మేఘాలయాల ప్రభుత్వంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ శుక్రవారం వందకోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే.

అగ్రవర్ణ కులాలకు రిజర్వేషన్లు

- మోడీ ఎన్నికల జిమ్మిక్కు : మాజీ ఎంపీ వీహెచ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ముందు వాగ్ధానాలు చేయడం ప్రతి రాజకీయనాయకుడికి అలవాటైపోయిందని కాంగ్రెస్ సీనియర్ నేత , మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. అగ్రకులాల్లోని పేదలకు ఈబీసీ 10 శాతం రిజర్వేషన్ కోటా కేంద్రం ప్రకటించించిన నేపథ్యంలో హైదరాబాద్‌లో వీహెచ్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఈ కోటా వర్తిస్తుందని ప్రధాని మోడీ ప్రకటించారని ఆయన అన్నారు. ఇది మోడీ ఎన్నికల జిమ్మిక్కు అని విమర్శించారు.

తెలంగాణ సీఎం కేసీఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి కేంద్రానికి పంపిస్తే, అక్కడ బిల్లు పాస్ కాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రధాని కొత్త అస్త్రం తెరపైకి తెచ్చారన్నారు. ఎన్నికలు దగ్గరపడడంతో అగ్రకులాల ఓటర్లను ఆకట్టుకునేందుకు మోడీ 10 శాతం రిజర్వేషన్ అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని విమర్శించారు. 25 ఏండ్ల క్రితం అమలైన మండల కమిషన్ 27 శాతం రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని వీహెచ్ ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు తగ్గించారని, మరి 10 శాతం రిజర్వేషన్ ఎలా సాధ్యమవుతుందో తనకు అర్థం కావడంలేదని అభిప్రాయపడ్డారు.

10 శాతం రిజర్వేషన్లు హర్షనీయం : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో అందరికీ సమాన అవకాశాలు దొరుకుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈబీసీల కోసం తీసుకున్న నిర్ణయంతోనైనా కేసీఆర్‌కు కనువిప్పు కలుగుతుందని ఆశించారు.

చావు బతుకు ఒక్కటైన వేళ

మృత్యుకుహరంలో 15మంది బాలలు.. 25రోజులైనా లభించని ఆచూకీ

ఆ సమయంలో కావాల్సిన సామాగ్రి మేఘాలయ సర్కార్ వద్ద లేవు : ఎస్.కె. శాస్త్రి

- హై పవర్ కలిగిన 13 సబ్ మెర్సిబుల్ పంపుల్లో కేవలం మూడింటినే వినియోగిస్తున్న సిబ్బంది
- 1312 అడుగుల థాయ్ గుహను తవ్వేసిన సాంకేతికత.. 370 అడుగుల గనిని ఛేదించలేకపోయిందా?
- ప్రమాదం జరిగిన నాలుగు రోజులైనా మోస్తరు శక్తి గల పంపులనే వాడారు: సోలిబర్ రెహమాన్
- హఠాత్తుగా లైతిన్ నది వరదనీరు చొచ్చుకురావడంతో.. : ప్రత్యక్ష సాక్షి 'సాహిబ్ అలీ'


నిబంధనలను అమలు చేయడంలో సర్కారు విఫలమైన వేళ, మైనింగ్ మాఫియా ధన దాహానికి పేదవాడి ప్రాణం మూల్యం చెల్లించుకునే పరిస్థితులు దాపురించిన చోట.. చావు, బతుకు ఒక్కటైన వేళలో ప్రాణం విలువ సహాయక చర్యల పురోగతిలో స్తబ్దుగా మారిన క్షణాన.. కాపాడే ఆసక్తి అలసత్వం వహించిన తరుణాన.. ముక్కుపచ్చలారని 15 మంది బాల కార్మికులు మృత్యు కుహరంలాంటి బొగ్గుగనిలో చిక్కుకొని పాతిక దినాలు గడిచినా.. వాళ్ళను ఇంకా బయటకు తీసుకురాలేని స్థితికి కారకులు ఎవరు? ప్రపంచంలోనే మోస్ట్ డేంజరస్ డెడ్లీ కేవ్ రెస్క్యూ ఆపరేషన్ (తామ్ లువాంగ్ కేవ్)ను ఆరు నెలల క్రితం విజయవంతంగా పూర్తిచేసిన సాంకేతికత ఇప్పుడు పనిచేయను అంటుందా?


జై

భారతదేశానికి ఈశాన్యంగా ఉన్న మేఘాలయ రాష్ట్రంలోని తూర్పు జయంతియా జిల్లాలో లుంథరీ గ్రామానికి చెందిన క్సాన్ కొండ ప్రాంతంలో లైతిన్ నది ఒడ్డున గల 370 అడుగుల లోతైన అక్రమ బొగ్గు గనిలో 15 మంది బాల కార్మికులు చిక్కుకుపోయి ఇప్పటికి ఇరవై ఐదు రోజులు గడిచిన నేపథ్యంలో.. తూర్పు జయంతియాలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న క్సాన్ ప్రదేశానికి వెళ్ళిన 'నవతెలంగాణ' బ ందం అక్కడి సహాయకచర్యలపై ఆరా తీసే ప్రయత్నం చేసింది.

ఆలస్యంగా మొదలు.. వేచి చూడటంతోనే సరి!

'బొగ్గుగనిలో నిండిన నీటిని పైకి తోడాలంటే అధిక శక్తి గల పంపులు కావాలి. ఐతే, ప్రమాదం జరిగిన నాలుగు రోజులైనా మోస్తరు శక్తి గల పంపులను సైతం అధికారులు ఉపయోగించలేద'ని చెబుతూ అసోం రాష్ట్రం చిరాగ్ జిల్లాలోని భనగ్నమరి గ్రామానికి చెందిన సోలిబర్ రెహమాన్ నవతెలంగాణ ప్రతినిధుల ముందు కన్నీరు మున్నీరయ్యారు. 19ఏండ్ల వయసున్న తన కొడుకు మోనిరుల్ ఇస్లాం కచ్చితంగా గనిలో నుంచి వస్తాడన్న ఆశతో గత ఇరవై ఐదు రోజులుగా రెహమాన్ లుంథరీ గ్రామశివారుల్లోనే వేచి చూస్తున్నాడు.





ఎందుకంత కష్టం?

లుంథరీ గ్రామంలో బొగ్గు నిల్వలు బాగా లోతున నిక్షిప్తమై ఉండటంతో.. వాటిని వెలికి తీయడానికి అక్కడి వారు ఎలుక కలుగు(ర్యాట్‌హోల్స్)ను పోలిన గుంతలను నిలువుగా తవ్వుతారు. బొగ్గు కనిపిస్తే, అక్కడి నుంచి సొరంగాలు ఏర్పాటు చేసి బొగ్గు తీస్తారు. ఈ కలుగులన్నీ నదీ తీరానికి సమీపంలోనే ఉండటం వల్ల నదులు పొంగినప్పుడల్లా వీటిలోకి నీరు ప్రవేశిస్తోంది. ఈ క్రమంలోనే ఈ ప్రమాదం జరిగింది. ఐతే, ఘటనా స్థలానికి ముందుగా చేరుకున్న సిబ్బంది వద్ద సరైన సామాగ్రి లేకపోవడం, నది నుంచి, తవ్వకాలు ఆపేసిన గని నుంచి వరదనీరు క్రమంగా పెరగడం, చీకటి కారణంగా సహాయక చర్యలు రోజూ సాయంత్రం 5గంటలకే నిలిపివేయడం తదితర కారణాల మూలంగా సహాయక చర్యలు అనుకున్న స్థాయిలో వేగంగా జరుగలేదు. ఐతే, ఆరు నెలల క్రితం.. వరల్డ్ మోస్ట్ డెడ్లీయెస్ట్, డేంజరస్ ఆపరేషన్ గా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిన తామ్ లువాంగ్ రెస్క్యూ ఆపరేషన్ లో భాగంగా ఓ కోచ్.. 12 మంది ఫుట్ బాల్ ప్లేయర్లను రక్షించడమే ధ్యేయంగా.. అక్కడి సిబ్బంది యుద్ధప్రాదిపదికన ఏకంగా గుహపైనే వందచోట్ల రంధ్రాలు చేశారు. 400 మీటర్ల(1312 అడుగులు) గుహను ఏకబిగిన తవ్వేశారు. 90 మంది స్కూబా డైవర్స్ ను ఉపయోగించి, వెయ్యి మందితో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి చివరికి ఆ ఆపరేషన్ ను సక్సెస్ బాట పట్టించారు. థాయ్ లాగే మనం ఆలోచించగలిగితే, మన బాలలు తిరిగి రాలేరా?!

ప్రత్యక్ష సాక్షి చెప్పిందేంటంటే?

'డిసెంబర్ 13న ఉదయం ఐదు గంటలకే స్నేహితులమందరం గనిలోకి దిగాము. తవ్వకాలు ప్రారంభించే సమయంలో హఠాత్తుగా లైతిన్ నది వరదనీరు చొచ్చుకు రావడంతో ఐదారు అడుగుల లోతు వరకే దిగిన నేను, నాతో పాటు ఉన్న మరో నలుగురం ఎలాగోలా బయటకు వచ్చాం. ఉదయం ఏడు గంటలలోపే గనిలోకి నీటి వరద ఎక్కువైంది. లోపల ఉన్న మిగతా వారికి బయటపడే అవకాశం లభించలేదు, నాకు తెలిసి వాళ్ళు బతికి ఉండటం కష్టమే'నని గని ప్రమాదం నుంచి బయటపడిన సాహిబ్ అలీ 'నవతెలంగాణ'కు వెల్లడించారు.

ఓ వైపు పక్కనే ప్రవహిస్తున్న నది నుంచి వచ్చి పడు తున్న వరదనీరు, మరోవైపు తవ్వకాలు ఆపేసిన గని నుంచి చొచ్చుకువస్తున్న వరదనీరు కారణంగా సహాయచర్యలు మొదట్లో మందకొడిగా సాగినట్టు తెలుస్తోంది. '100 హార్స్ పవర్ ఉన్న 10 పంపులు అవసరమని సహాయ సిబ్బంది ప్రభుత్వానికి ప్రమాదం జరిగిన మొదట్లోనే సమాచారం ఇచ్చినప్పటికీ, ఆ పంపులు మేఘాలయ ప్రభుత్వం దగ్గర లేవని అధికారులు చెప్పిన'ట్టు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ కి చెందిన ఉన్నతాధికారి ఎస్.కె. శాస్త్రి పేర్కొనడాన్ని చూస్తే, అధికారుల ప్రణాళికా లోపం, అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కాగా, కోల్ ఇండియా మరియు కిర్లోస్కర్ బ్రదర్స్ అందించిన హై పవర్ కలిగిన 13 సబ్ మెర్సిబుల్ పంపుల్లో కేవలం, మూడు మాత్రమే నీటిని తోడు తున్నాయి. ఇదే విషయాన్ని అక్కడి సహాయక చర్యల్ని పర్య వేక్షిస్తున్న అధికారి ఆర్. సుస్నిని ప్రశ్నించగా.. "త్వరలోనే మరో మూడు పంపులను ఉపయోగిస్తాము"ని పేర్కొనడం గమనార్హం. కాగా, ఘటనా స్థలంలో ప్రస్తుతం(జనవరి 5వ తేదీ) భారత నౌకాదళం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), ఒడిషా అగ్నిమాపక సిబ్బంది, కోల్ ఇండియా (సీఐఎల్), కిర్లోస్కర్ బ్రదర్స్ సంస్థలు, గజ ఈతగాళ్ల బృందం తదితరులు రక్షణ చర్యలకు శ్రమిస్తున్నారు.

బ్లూప్రింట్ లేదు

మేఘాలయలో బొగ్గు గనుల అక్రమ మైనింగ్‌ను బ్యాన్ చేయాలని 2014లో జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) తీర్పునిచ్చింది. అక్రమ మైనింగ్‌ను ఆపలేకపోయినందుకు గానూ ఎన్జీటీ ఆ రాష్ట్రానికి రూ.100 కోట్ల జరిమానాను తాజాగా విధించింది. కాగా, మేఘాలయ బొగ్గు గనిలో చిక్కుకుపోయిన కార్మికులను కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతుండటం తెలిసిందే. ఐతే, 370 అడుగుల లోతు ఉన్న ఆ గని బ్లూప్రింట్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం.

ది-33

2010 చిలీ దేశంలో 2,300 అడుగుల లోతున్న కాపర్ మైన్ లో చిక్కుకున్న 33 మంది మైనర్లను చిన్న రంధ్రం గుండా బయటకు తీశారు. 69రోజుల పాటు సాగిన ఈ ఉత్కంఠ పరిణామాన్ని యావత్ ప్రపంచం వీక్షించింది. ఇదే నేపథ్యంపై హాలీవుడ్ లో ది-33 పేరుతో సినిమా సైతం రూపొందింది. ఇక, ఆరు నెలల క్రితం.. థాయిలాండ్‌లోని తామ్ లువాంగ్ గుహలో చిక్కుకున్న 12 మంది చిన్నారులను, ఫుట్‌బాల్ కోచ్‌ను సురక్షితంగా సహాయక సిబ్బంది బయటకు తీసుకురావడం విదితమే!

తెలుగు రాష్ట్రాల వాటా 61

గత మూడేండ్ల కాలంలో దేశంలో బొగ్గు, ఖనిజ ఇతర గనుల్లో ప్రమాదకర పరిస్థితుల మూలంగా 377 మంది మరణించినట్టు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. మొత్తం 377 మందిలో 129 మరణాలు 2017లో సంభవించగా.. 2016లో 145, 2015లో 103 మంది గనుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇందులో తెలుగు రాష్ట్రాల వాటా 61 (తెలంగాణ -32, ఏపీ - 29)


బాలకృష్ణ

నవచిత్రం

ఇస్మార్ట్ శంకర్ కోసం..


మణిశర్మ, రాజ్ తోట

రామ్ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం రూపొందబోతున్న విషయం విదితమే. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ పతాకాలపై ఈ చిత్రం తెరకెక్కుతోంది. పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మాతలు. ఈ సినిమాకి మణిశర్మ సంగీతం సమకూర్చబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'పూరీ జగన్నాథ్‌తో మణిశర్మ ఆరోసారి కలిసి పని చేయబోతున్నారు. గతంలో చేసిన ఐదు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చివరి చిత్రం 'టెంపర్'. మణిశర్మ నేపథ్య సంగీతం అందించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అయితే రామ్ సినిమాకి మణిశర్మ సంగీతం అందించడం ఇదే తొలిసారి కావడం విశేషం. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కి అద్భుతమైన స్పందన లభిస్తుంది. చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ నెల చివర్లో ప్రారంభం కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని తెలిపింది.

థియేటర్ల మాఫియాతో నిర్మాతలకు కష్టాలు


మేఘా ఆకాష్, బాబీ సింహా, కార్తీక్ సుబ్బరాజ్, అనిరుధ్, భాస్కరభట్ల, శ్రీకాంత్, వల్లభనేని అశోక్ తదితరులు

రజనీకాంత్, సిమ్రాన్, త్రిష హీరోహీరోయిన్లుగా మేఘా ఆకాష్, విజయ్ సేతుపతి, బాబీసింహా, నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రధాన పాత్రధారులుగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పేట'. తెలుగులో ఈ సినిమాని అశోక్ వల్లభనేని విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, 'రజనీకాంత్, చిరంజీవిలే నాకు స్ఫూర్తి. వాళ్లని చూస్తూ పెరిగాం. ఈ సినిమా బాగా ఆడాలి. నిర్మాత వల్లభనేని నాకు మంచి స్నేహితుడు. 'నవాబ్', 'సర్కార్'లతో విజయాలను అందుకున్నాడు. ఈ సంక్రాంతికి పెద్ద సినిమాలు విడుదలవుతున్నాయి. వాటి మధ్య 'పేట' రిలీజ్ కావడం పెద్ద సాహసం' అని అన్నారు. 'సినిమా కళకి కులం, మతం, జాతి, ప్రాంతం ఉండవని నిరూపించారు రజనీకాంత్. స్వయంకృషితో వరల్డ్ సూపర్‌స్టార్‌గా ఎదిగారంటే అది రజనీకాంత్ ఒక్కరే. సినిమా బాగుంటే ఎవ్వరూ ఆపలేరు. మాఫియా డాన్స్ కంటే ఈ రోజు థియేటర్ల మాఫియా దారుణంగా ఉంది. కేవలం ముగ్గురు, నలుగురు చేస్తున్న సినిమాలకి మొత్తం థియేటర్స్ ఇస్తున్నారు. సాంకేతిక నిపుణులని బతకనిచ్చే పరిస్థితి లేదు. కొత్తవాళ్ళు వచ్చే పరిస్థితి లేకుండా చాలా నీచంగా చేస్తున్నారు. సంక్రాంతికి ఆరేడు సినిమాలు రిలీజ్ అయినా చూసేంత ప్రేక్షకులున్నారు. కానీ ఒకటి రెండు సినిమాలకి తప్ప మరిన్ని సినిమాలను చూసే అవకాశం థియేటర్ల మాఫియా కల్పించడం లేదు. ఈ మాఫియా అంతమయ్యే రోజులు వస్తున్నాయి. రెండు రాష్ట్రాల సీఎంలకు ఈ విషయాన్ని తెలియజేస్తాం. వాళ్ళ సినిమాలే ఆడాలని మిగతా సినిమాలను తొక్కేస్తున్నారు. ఇది మంచిది కాదు. దయజేసి ఇది మీకు విజ్ఞప్తి అనుకోండి, లేక వార్నింగ్ అనుకోండి. అయిపోతారు.. చాలా మందిని చూశాం. విర్రవీగినోళ్ళంతా ఆకాశంలోకి వెళ్ళిపోయారు. మీరు కూడా పోతారు' అని ప్రసన్న కుమార్ అన్నారు.


'యాత్ర' చిత్రంలో వై.ఎస్.విజయమ్మగా అర్చిత వేముగంటి

దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు చెబుతూ, 'నా మొదటి సినిమా 'పిజ్జా' కోసం హైదరాబాద్ వచ్చాను. మళ్ళీ రజనీకాంత్ సినిమాకు రావడం ఆనందంగా ఉంది. సినిమాని రిలీజ్ చేస్తున్న అశోక్‌కి కంగ్రాట్స్. సినిమా చాలా బాగుంటుంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్ చిత్రమిది. యాక్షన్ ఫిల్మ్ కాదు. అందరూ చూసి ఎంజాయ్ చేస్తారు. మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం ఉంది' అని చెప్పారు. 'రజనీకాంత్ స్ఫూర్తితోనే ఆయన సినిమా చేసే స్థాయికి చేరుకున్నా. సినిమాకి థియేటర్ల విషయంలో కొంత మంది ఇబ్బంది పెడుతున్నారు. వాళ్లకి ఈ సినిమా హిట్‌తో బుద్ధి చెప్పాలనుకుంటున్నా. దయజేసి ఈ సమస్యను పరిష్కరించాలని కేసీఆర్‌ని కోరుతున్నాను' అని నిర్మాత అశోక్ వల్లభనేని మండిపడ్డారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ చెబుతూ, 'ఈ సినిమా రజనీ ఫ్యాన్స్ కోసం. ఆయన ఇందులో ఇరగదీశారు. ఈ ఛాన్స్ ఇచ్చిన దర్శకుడికి ధన్యవాదాలు. పాటలను ఆదరిస్తున్న తెలుగు ఆడియెన్స్‌కి థ్యాంక్స్. సినిమాని చూసి ఎంజాయ్ చేయండి' అని చెప్పారు. 'రజనీకాంత్ సినిమాలో నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. సినిమాలో మంచి పాత్ర పోషించాను' అని మేఘా ఆకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటల రచయితలు రామజోగయ్య శాస్త్రి, భాస్కరభట్ల, దర్శకుడు వైవీఎస్ చౌదరి, నటుడు బాబీ సింహా, మాళవిక, అంబికా కృష్ణ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.


దీపికా పదుకొనె

వంద థియేటర్లు..వంద విగ్రహాలు

లెజెండరీ నటుడు నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా 'ఎన్టీఆర్' బయోపిక్ రూపొందింది. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఎన్టీఆర్‌గా బాలకృష్ణ నటిస్తున్నారు. ఇది రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటగా ఈ నెల 9న 'ఎన్టీఆర్ కథానాయకుడు' రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వంద థియేటర్లలో వంద ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. చిత్ర బృందం తెలియజేస్తూ, 'సినిమా విడుదల సందర్భంగా సరికొత్త ఐడియాతో ప్రేక్షకుల ముందుకి చిత్ర యూనిట్ వస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన 100 థియేటర్లలో వంద ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. తొలి విగ్రహాన్ని నందమూరి బాలకృష్ణ, విద్యాబాలన్, నందమూరి కళ్యాణ్‌రామ్ కలిసి తిరుపతిలోని పీజేఆర్ థియేటర్‌లో నేడు(మంగళవారం) ఆవిష్కరిస్తారు. సోమవారం బాలకృష్ణ, విద్యాబాలన్, కళ్యాణ్‌రామ్, దర్శకుడు క్రిష్ నిమ్మకూరు, బెంగళూరులో చిత్ర ప్రమోషన్‌లో పాల్గొన్నారు. నేడు తిరుపతిలో పాల్గొంటారు' అని అన్నారు. విద్యాబాలన్, కళ్యాణ్ రామ్, రానా, సుమంత్, ప్రకాష్‌రాజ్, నరేష్, మురళీ శర్మ, జిష్షు సేన్ గుప్తా, నిత్యా మీనన్, రకుల్ ప్రీత్ సింగ్, దగ్గుబాటి రాజా, కైకాల సత్యనారాయణ ఇతర పాత్రలు పోషిస్తున్నారు.


తనయుడు హీరోగా రాజ్ కందుకూరి సినిమా


వర్ష, శివ కందుకూరి

'పెళ్ళి చూపులు' వంటి జాతీయ అవార్డు చిత్రాన్ని, 'మెంటల్ మదిలో' వంటి ఫిల్మ్ ఫేర్ అవార్డు సినిమాని నిర్మించిన రాజ్ కందుకూరి ఇప్పుడు తన తనయుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేస్తూ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మహిళా దర్శకురాలు శేష సింధురావ్ దర్శకత్వంలో ధర్మపథ క్రియేషన్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ సోమవారం ప్రారంభమైంది.

ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'శివ కందుకూరి అమెరికాలో చదువు పూర్తి చేసుకుని ఈ మధ్యే ఇండియాకు వచ్చారు. ఇక దర్శకురాలు శేష సింధురావ్ గతంలో దర్శకులు సుకుమార్, క్రిష్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ చిత్రానికి గోపీసుందర్ సంగీతం అందిస్తున్నారు. తమిళంలో విడుదలై ఘన విజయం సాధించిన '96' ఫేమ్ వర్ష ఈ చిత్రం ద్వారా తెలుగులో కథానాయికగా పరిచయం అవుతుంది. 'మహానటి' చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ ఈ చిత్రానికి కూడా స్క్రీన్‌ప్లే, మాటలు సమకూరుస్తున్నారు. రవితేజ గిరిజాల ఎడిటర్‌గా, సినిమాటోగ్రాఫర్‌గా వేర రామన్ పని చేస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు సురేష్‌బాబు, మధుర శ్రీధర్ ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు' అని తెలిపింది.

రీల్ లైఫ్‌లోనూ..


రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనె

బాలీవుడ్ నాయకానాయికలు రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకొనె రియల్ లైఫ్‌లో ఇటీవల భార్యాభర్తలైన విషయం విదితమే. తాజాగా వీరిద్దరు రీల్ లైఫ్ కపుల్‌గా కనిపించబోతున్నారు. '83' సినిమా కోసం ఈ ఇద్దరు భార్యాభర్తలుగా యాక్ట్ చేయబోతున్నారు. పెళ్ళి తర్వాత ఈ జోడీ సిల్వర్ స్క్రీన్ మీద మెరవడం విశేషం. క్రికెట్ టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, 1983లో భారత్ ప్రపంచ కప్ గెలవడంలో కీలక భూమిక పోషించిన కపిల్ దేవ్ జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని '83' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కబీర్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపికా పదుకొనె కూడా నటించబోతున్నట్టు తెలుస్తుంది. కపిల్ దేవ్ భార్య రోమీ భాటియా పాత్రలో దీపికాని ఫైనల్ చేశారట. సినిమాలో ఆమె పాత్ర పరిధి చాలా తక్కువగా ఉండటంతో కేవలం పది రోజుల పాటు షూటింగ్‌లో దీపికా పాల్గొనబోతున్నట్టు సమాచారం. 1983లో టీమ్ ఇండియా వరల్డ్ కప్ గెలిచే సందర్భంలో కపిల్ దేవ్ భార్య రోమీ స్టేడియంలోనే ఉన్నారు. అయితే ప్రపంచకప్ వెస్టిండీస్ గెలుచుకుంటుందేమో అనే బాధతో ఆమె స్టేడియం నుంచి మధ్యలోనే వెళ్ళిపోయారట. ఆ తర్వాత విషయం తెలిసి మళ్ళీ స్టేడియంకు వచ్చి భావోద్వేగానికి గురైనట్టు తెలుస్తుంది. దీపికా దీంతోపాటు మేఘనా గుల్జర్ దర్శకత్వంలో యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మి అగర్వాల్ జీవితం ఆధారంగా తెరకెక్కబోయే చిత్రంలోనూ నటించనున్నారు. 'చాపక్' పేరుతో నిర్మితమయ్యే ఈ సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

మరోసారి అక్కీ సరసన..!


పూజా హెగ్డే


తెలుగులో ప్రస్తుతం పలువురు స్టార్ హీరోల సరసన నటిస్తూ క్రేజీ కథానాయికగా పూజా హెగ్డే బిజీగా ఉంది. గతంలో హృతిక్ రోషన్ నటించిన 'మొహెంజోదారో' సినిమాతో పూజా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం 'హౌస్‌ఫుల్4'లోనూ నటిస్తోంది. తాజాగా పూజా మరో బంపర్ ఆఫర్‌ని అందుకున్నట్టు తెలుస్తుంది. అక్షయ్ కుమార్ త్వరలో రోహిత్ శెట్టి దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఇది ఏప్రిల్‌లో ప్రారంభం కానుంది. కాగా ఈ సినిమాలో అక్షయ్ సరసన కథానాయిక పాత్ర కోసం పూజాని సంప్రదించారట. స్క్రిప్ట్ విన్న ఆమె సినిమా చేసేందుకు తన ఆసక్తి కనబర్చారట. ప్రస్తుతం పూజా నటిస్తున్న 'హౌస్‌ఫుల్ 4'లో అక్షయ్ కుమార్ ఓ హీరోగా నటిస్తున్న విషయం విదితమే. బ్యాక్ టు బ్యాక్ ఈ ఇద్దరూ మరోమారు మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగులో మహేష్‌బాబు 'మహర్షి' చిత్రం, రాధాకృష్ణ దర్శకత్వంలో ప్రభాస్ నటించబోయే సినిమాలోనూ పూజానే కథానాయికగా నటిస్తున్నారు.

హామీలే చంపేస్తున్నాయ్..


భూమి పడ్నేకర్, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్

'మమ్మల్ని చంపుతోంది ప్రభుత్వ బుల్లెట్లు కాదు, ప్రభుత్వం ఇచ్చే హామీలు, పోలీసులు' అని అంటున్నారు మనోజ్ బాజ్‌పాయ్. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్, మనోజ్ బాజ్‌పాయ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'సోన్ చిడియా'. అభిషేక్ చౌబే దర్శకత్వం వహించిన ఈ చిత్ర ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. 1975 మధ్యప్రదేశ్‌లోని చంబల్ ప్రాంతంలో బందిపోట్లకు, పోలీసులకు మధ్య జరిగే పోరాట నేపథ్యంలో సినిమా రూపొందుతుంది.బందిపోట్లను అరెస్ట్ చేసేందుకు అశుతోష్ రాణా నాయకత్వంలోని పోలీస్‌లు ప్రయత్నిస్తుంటారు. అందర్ని లొంగి పోవాల్సిందిగా హెచ్చరించడంతో బందిపోట్లలో ఒకరైన సుశాంత్ సింగ్ భవనాన్ని పేల్చేయడంతో ట్రైలర్ ప్రారంభమైంది. పోలీస్‌లకు, తిరుగుబాటుదారులకు మధ్య జరిగే పోరాటం ప్రధానంగా సాగే ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. సామాన్య ప్రజలను బతకనివ్వకుండా చేయడంతో వారంతా బందిపోట్లుగా మారి పోరాడటమే చిత్ర కథాంశం. భూమి పడ్నేకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 8న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

మోదీ ఫస్ట్‌లుక్


వివేక్ ఒబెరాయ్

భారత ప్రధాని నరేంద్రమోడీపై తెరకెక్కుతున్న బయోపిక్‌కి 'పిఎం నరేంద్ర మోదీ' అనే టైటిల్‌ని ఖరారు చేస్తూ సోమవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. మోడీ పాత్రలో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ నటిస్తున్నారు. ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ ఒబెరాయ్ తండ్రి సురేష్ ఒబెరాయ్, సందీప్ సింగ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 15 నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. తెలుగు, తమిళం, హిందీ భాషలతో కలిపి మొత్తంగా 23 భాషల్లో సినిమాను విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం 23 భాషలకు చెందిన డిజైన్ పోస్టర్స్‌ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విడుదల చేశారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

మెప్పించే సినిమా నిన్ను తలచి

వంశీ, స్టెఫీ పటేల్ జంటగా అనిల్ తోట దర్శకత్వంలో 'నిన్ను తలచి' చిత్రం రూపొందుతుంది. ఎస్.ఎల్.ఎం. ప్రొడక్షన్స్, నేదురుమల్లి ప్రొడక్షన్స్ పతాకాలపై నేదురుమల్లి, అజిత్‌రెడ్డి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ లాంచ్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత అజిత్ మాట్లాడుతూ, 'కొత్త బ్యానర్‌తోపాటు కొత్త హీరో హీరోయిన్లతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం. ఈ చిత్రం పెద్ద విజయం సాధించి మా యూనిట్ అందరికి మంచి పేరు తీసుకురావాలి' అని అన్నారు. 'అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో విడుదల చేస్తాం' అని దర్శకుడు అనిల్ తెలిపారు. 'మంచి పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తాం. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది' అని నాయకానాయికలు చెప్పారు.


స్టెఫీ పటేల్, వంశీ


'వనవాసం' చిత్ర పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

వాస్తవ సంఘటనల ఆధారంగా వనవాసం

నవీన్ రాజ్ శంకరావు, శశికాంత్, బండెల కరుణ శ్రావ్య, శృతి హీరోహీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం 'వనవాసం'. భరత్ కుమార్.పి, నరేంద్ర సంయుక్త దర్శకత్వంలో శ్రీ శ్రీ శ్రీ భవాని శంకర ప్రొడక్షన్స్ పతాకంపై సంజయ్ కుమార్.బి నిర్మిస్తున్న చిత్రమిది. ఇటీవల దర్శకుడు త్రివిక్రమ్ చిత్ర పోస్టర్‌ని, టైటిల్ సాంగ్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టైటిల్ బాగా నచ్చింది. టైటిల్ లాగే సినిమా కూడా బాగుంటుందని ఆశిస్తున్నా. చిత్ర బృందానికి అభినందనలు' అని అన్నారు. 'త్రివిక్రమ్ మా చిత్ర టైటిల్‌ని మెచ్చుకోవడం ఆనందంగా ఉంది. కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాలను మెచ్చే విధంగా సినిమా ఉంటుంది. నిర్మాణాంతర కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నాం' అని దర్శకులు తెలిపారు. నిర్మాత సంజయ్ చెబుతూ, 'మేం అనుకున్న దానికంటే దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉంటుంది' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కుమార్, కెమెరా: ప్రేమ్ జై విన్సెంట్, ఎడిటర్: ప్రభు.

అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

పెంచడాన్ని సమర్థించేలా శాస్త్రీయమైన డేటా వున్నట్లైతే రాష్ట్రాలు ఆ 50 శాతం పరిమితిని దాటవచ్చని అనుమతించింది.ప్రస్తుతం రిజర్వేషన్లు 49.5శాతంగా వున్నాయి. వీటిలో ఎస్సీలకు 15శాతం, ఎస్టీల కు 7.5శాతం, ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు వున్నాయి. తాజా పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరతాయి.

రాజ్యాంగ సవరణ అవసరం

మోడీ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి రాజ్యాంగంలోని 15, 16 అధికరణలకు సవరణలు చేయాల్సి వున్నది. ఇందుకోసం మంగళవారంతో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించే అవకాశం వున్నదని భావిస్తున్నారు. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాజ్యాంగ సవరణ తప్పనిసరి అయింది.

విఫలమైన పీవీ ప్రభుత్వం

మాయావతి, రాందాస్ అథవాలే వంటి రాజకీయ నేతలు గతంలో ఇలాంటి సూచనలు చేసినా తాజాగా ఈ మార్పు కోసం రాజ్యాంగ సవరణకు సమాయత్తం కావడం ఇదే మొదటిసారి. గతంలో నరసింహారావు ప్రభుత్వ హయంలో ఇటువంటి చర్య తీసుకోవడానికి విఫల యత్నం జరిగింది. మండల్ కమిషన్ సిఫారసుల అమలుకు వ్యతిరేకంగా తలెత్తిన రాజకీయ ఆగ్రహాన్ని సమసిపోయేలా చేసేందుకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అందించేందుకు ప్రయత్నించారు. అయితే దీనివల్ల 50 శాతం పరిమితి దాటిపోతోందని సుప్రీం కోర్టు పేర్కొంది. దాంతో పీవీ సర్కార్ ప్రయత్నం నిష్ఫలమైంది.

ఎవరెవరు ఏమన్నారు

కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి : నాలుగేండ్ల 8నెలలుగా గుర్తు రాలేదా, ఇప్పుడే గుర్తొచ్చిందా? ఎన్నికల ప్రవర్తనా నియమావళి మరో మూడు నెలల్లో అమల్లోకి వస్తోంది.ఇప్పుడీ ప్రకటన అంటే ఇది ఎన్నికల జిమ్మిక్కు తప్ప మరొకటి కాదు.

ఆప్ చీఫ్ కేజ్రీవాల్ : ఇది ఎన్నికల స్టంట్ తప్ప మరొకటి కాదు. ప్రభుత్వానికి ధైర్యముంటే పార్లమెంట్‌లో సవరణ బిల్లు తీసుకురావాలి.

కేంద్ర మంత్రి శివ ప్రతాప్ శక్లా : ఎన్నికలకీ ఈ ప్రకటనకీ సంబంధం లేదు

యశ్వంత్ సిన్హా : ఇదో పెద్ద నాటకం. ఇందులో ఎన్నో చట్టబద్ధమైన ఇబ్బందులు వున్నాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ సవరణలన్నీ ఆమోదం పొందే సమయం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటన్నది స్పష్టమైపోతోంది.

సీపీఐ నేత రాజా : ఇది రాజకీయ ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం

హార్దిక్ పటేల్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ అమ్ముల పొదిలోని ఆఖరి అస్త్రం.

అర్హులు ఎవరంటే..

ఏడాదికి 8లక్షల లోపు ఆదాయం కలిగినవారు
ఐదెకరాల భూమి కన్నా తక్కువ వున్నవారు
వెయ్యి చదరపు అడుగుల లోపు ఇంటిస్థలం వున్నవారు
నోటిఫైడ్ మున్సిపాలిటీలో 100 గజాల కంటే తక్కువ స్థలం
నోటిఫైడ్ కాని ఏరియాలో 200 గజాల కంటే తక్కువ స్థలం

క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతించిన కేరళ సీఎం

అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్వాగతించారు. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) చాలాకాలంగా డిమాండ్ చేస్తోందని ఆయన అన్నారు. ఎట్టకేలకు కేంద్రం ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకుందని.. ఇది స్వాగతించదగ్గ పరిణామం అని విజయన్ తెలిపారు.

10 శాతం రిజర్వేషన్లకు సీపీఐ(ఎం) ఆహ్వానం

అమలుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈబీసీలు) విద్యా, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ చేసిన నిర్ణయాన్ని సీపీఐ(ఎం) ఆహ్వానించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అగ్రవర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పించాలనీ, కర్పూరీ ఠాకూర్ ఫార్ములాను అమలు చేయాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు గడిచినప్పటికీ దాని ఊసే ఎత్తకుండా ఎన్నికల ముందే ఈ నిర్ణయాన్ని ఎన్నికల జిమ్మిక్కుగా స్పష్టమౌతోందని పేర్కొన్నారు. యువతకు కల్పిస్తామన్న ఉద్యోగాల హామీ అమలుకు నిర్దిష్ట కార్యాచరణ చేపట్టకుండా ప్రకటనలకే పరిమితమైతే ప్రయోజనం శూన్యమని తెలిపారు. ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్ల అమలుకు పూనుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్ల అమలుకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కోటి ఎకరాలకు సాగునీరు

- 950టీఎంసీల గోదావరి నీటి వినియోగం
- ప్రాజెక్టుల నిర్మాణం నిర్వహణ కోసం విధి విధానాలు
- ప్రస్తుత టెర్మ్‌లోనే ప్రాజెక్టులు పూర్తి
- లక్ష్య సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక సాగునీటి ప్రాజెక్టులపై సీఎం దిశా నిర్దేశం
- ప్రగతి భవన్‌లో సుదీర్ఘ సమీక్ష

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కోటి ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంగా వ్యూహం అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం ప్రగతి భవన్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణా, గోదావరి బేసిన్లలో రాష్ట్రానికి ఉన్న నీటి వాటాను వినియోగించుకునేందుకు వీలుగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుత టెర్మ్‌లోనే ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో రాష్ట్రానికి కేటాయించిన 950 టీఎంసీలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేసిన కరువు ప్రాంతానికి తాగు, సాగునీరందించాలని సీఎం ఆదేశించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ వస్తేనే తమకు తాగు, సాగునీరందుతుందని ప్రజలు విశ్వాసంతో ఓటు వేశారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని ఆయన సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంతో పాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికే ప్రాధాన్యత ఇవ్వాలని సిఎం ఆదేశించారు. దీనికోసం ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన విశ్రాంత ఇంజనీర్లు వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న ఈ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిపై విశ్రాంత ఇంజినీర్ల బృందం ఇచ్చిన నివేదికపై సీఎం చర్చించారు. ఇంజనీర్ల బందం పనుల్లో జాప్యం జరుగుతున్న చోట, జాప్యానికి కారణాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే వర్క్ ఏజన్సీలను మార్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. "తెలంగాణ రాష్ట్రం



వెనుకబడింది. సాగునీటి రంగంలో వివక్షకు గురైంది. అందుకోసమే ఇక్కడి ప్రజలు పోరాటం చేశారు. కాబట్టి తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించండి అని ప్రధాని మోడీకి అనేక సార్లు చెప్పాను. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 20, 30 వేల కోట్లిచ్చి సాయపడండి అని వేడుకున్నా. అయినా సరే నరేంద్రమోడి డబ్బులు ఇవ్వలేదు." కాళేశ్వరం ప్రాజెక్టు ఈ ఏడాది కాలంలోనే పూర్తి కావాలని సీఎం అదేశించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజిలు, కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపుహౌజుల నిర్మాణం పూర్తి కావాలని, ఎల్లంపల్లి, మిడ్ మానేరు దాకా నీళ్లు రావాలని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా మహబూబ్ నగర్ జిల్లా ప్రజల్లో ప్రభుత్వంపై ఎంతో నమ్మకం వచ్చిందని కేసీఆర్ అన్నారు. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి, మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలని చెప్పారు. శ్రీశైలం నుంచి 70 టిఎంసిల వరకు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ,, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి,, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఇఎన్సిలు మురళీధర్ రావు, అనిల్ కుమార్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, పలువురు విశ్రాంత ఇంజినీర్లు పాల్గొన్నారు.

కలప స్మగ్లింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

రాజకీయ నాయకులనూ వదిలిపెట్టొద్దు : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ కలప స్మగ్లింగుకు అవకాశమివ్వొద్దని సీఎం కేసీఆర్ సూచించారు. ఇందుకనుగుణంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. పోలీసుల సహకారంతో కలప స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. తరచూ స్మగ్లింగుకు పాల్పడే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకంపై ముఖ్యమంత్రి.. సోమవారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కలప స్మగ్లర్లు ఎంతటి వారైనా, ఎంత పలుకుబడి కలిగిన వ్యక్తులైనా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా వదిలిపెట్టొద్దని.. వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. ఇందుకోసం పోలీసుల సహకారం తీసుకుని కార్యాచరణ రూపొందించాలంటూ అటవీశాఖ అధికారులకు సూచించారు. సాయుధ పోలీసుల అండతో కలప స్మగ్లింగును నూటికి నూరుశాతం అరికట్టాలని ఆదేశించారు. అడవుల్లో చెట్లను ఇష్టానుసారంగా నరకటం వల్లే కలప అక్రమ రవాణా జరుగుతున్నదని చెప్పారు. ఇలాంటి వాటిని అరికట్టాలని సూచించారు. కట్టె కోత మిషన్ల (సామిల్స్) నిర్వహణను కూడా నియంత్రించాలని అన్నారు. కొత్తగా ఎలాంటి సామిల్స్‌కు అనుమతులు ఇవ్వొద్దని చెప్పారు.

ఏడాదికి వంద కోట్ల మొక్కలు..

తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద ప్రతీ ఏటా నాటే మొక్కల సంఖ్యను పెంచాలని సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు. వచ్చే వానాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల చొప్పున మొక్కలను నాటాలని.. ఇందుకనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఢిల్లీలో మాదిరిగానే హైదరాబాద్‌లో కూడా వాహనాల సంఖ్య, ఫలితంగా కాలుష్యం రోజురోజుకీ పెరుగుతున్నదని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే చెట్లను విరివిగా నాటటం ఒక్కటే మార్గమని సీఎం తెలిపారు.

రైతు రుణమాఫీ సమర్ధనీయమే

(మొదటిపేజీ తరువాయి)

రంగానికి అవసరమని సేన్ తెలిపారు. రైతుల కు తమ పంటపొలాల మీద వచ్చే ఆదాయం సరి పోక వాటిని అమ్మేసుకున్న పరిస్థితుల్ని చూశానని అమర్త్యసేన్ తెలిపారు. అనేక సమస్యల వల్ల వ్యవ సాయ రంగం సంక్షోభంలోకి నెట్టబడిందని సేన్ తెలిపారు. ఈ సమస్యలపై 1920ల నుంచి చర్చిస్తూనే ఉన్నామని ఆయన తెలిపారు. రైతుల రుణమాఫీని తప్పు పడుతున్న కొందరు ఆర్థికవేత్తల అభిప్రాయా లతో అమర్త్యసేన్ విభేదించడం గమనార్హం.

దేశ జనాభాలో అత్యధిక భాగం వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని అమర్త్యసేన్ తెలిపారు. మోడీ నేతృత్వంలోని బీజేపీ హయాంలో తయారీ రంగం క్షీణించిందని, యూపీఏ హయాం కన్నా అధ్వాన్నంగా ఉన్నదని సేన్ తెలిపారు. విద్య, ఆరోగ్యం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం వహించింది. కానీ, ప్రస్తుత మోడీ హయాంలోకన్నా ఉద్యోగాల కల్పన గత ప్రభుత్వంలో అధికంగా ఉన్నదని సేన్ అన్నారు. రైతులకు రుణమాఫీని వ్యతిరేకిస్తున్న కొందరు ఆర్థికవేత్తల పట్ల రైతు సం ఘాలు మండిపడుతున్నాయి. దివాలా చట్టం మాటు న ప్రభుత్వరంగ బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేస్తున్న బడా పారిశ్రామికవేత్తలకు ఇచ్చే రుణాల పట్ల అభ్యం తరాలు వ్యక్తం చేయని ఆర్థికవేత్తలు దేశ ప్రజలకు అన్నం పెట్టే అన్నదాతల పట్ల ఎందుకు శ్రద్ధ చూపరని రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్ షాకు మద్దతు

అసలు మనదేశంలో ఏం జరుగుతోంది? బాలీ వుడ్ నటుడు నసీరుద్దీన్ షాపై ఇలాంటి దాడిని ఎంతమాత్రమూ అంగీకరించటం లేదు అంటూ నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూకదాడుల్ని నిరసిస్తూ వ్యాఖ్యలుచేయటం, పౌర హక్కులకు మద్దతుగా ఆమ్నెస్టీ ఇండియా తీసిన వీడియోలో నసీరుద్దీన్ షా కనిపించటం పెద్ద దుమా రాన్ని రేపింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులు ఆయనపై మాటల యుద్ధానికి దిగారు. నసీరుద్దీన్ షాపై వెలువడుతున్న విమర్శల్ని, వ్యాఖ్యల్ని అమర్త్యసేన్ ఖండించారు. మనదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటిపైనా దాడులు జరుగుతున్నాయనీ, ప్రశ్నించటంగానీ, నిరసన వ్యక్తం చేయటంగానీ చేస్తే మాటల దాడికి పాల్పడుతున్నారనీ, పాలకులకు వ్యతిరేకంగా రాస్తే జర్నలిస్టులను వేధిస్తున్నారనీ, బాలీవుడ్ నటుడు నసీ రుద్దీన్ షా విషయంలోనూ అదే జరిగిందనీ అమర్త్య సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. వాక్ స్వాతంత్ర్యంపైన, మానవహక్కులపైన ఇండియాలో దాడులు పెరుగుతున్నాయని 'ఆమ్నెస్టీ ఇండియా' ప్రకటించింది. 'హ్యాష్‌ట్యాగ్ ఆబ్‌కీబార్‌మానవ్ అధికార్' పేరుతో ఆమ్నెస్టీ ఇండియా హక్కుల ఉద్యమాన్ని ప్రారంభించింది. దీనికి ఉర్దూలో నసీరుద్దీన్ షా సందేశాన్ని పంపారు. "నటులు, కళాకారులు, మేధావులు, కవులు..అందర్నీ బెదరగొడుతున్నారు. జర్నలిస్టులను బెదిరిస్తున్నారు. మతం పేరుతో విద్వేషపు గోడలు కడుతున్నారు. దీనికి అమాయకులు బలవుతున్నారు" అని నసీరుద్దీన్ షా సందేశంలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన్ని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులు మొదలయ్యాయి.

పంటల బీమా పథకం లోపాలెన్నో!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీ తన నివేదికలో గుర్తు చేసింది. దీంతో, రైతులు ఈ పథకం పట్ల ఆసక్తి చూపడంలేదని దుయ్యబట్టింది.

గత రెండేండ్లలో ఈ పథకం కింద నమోదైన కవరేజ్ ప్రాం తం బాగా తగ్గిపోయిందని తెలిపింది. 2016–17లో పీఎంఎఫ్ బీవై కింద కవరేజ్ ఏరియా 5 కోట్ల 72 హెక్టార్లు కాగా, 2017 –18లో 4కోట్ల 75లక్షల హెక్టార్లు మాత్రమేనని నివేదిక పేర్కొన్నది(హెక్టార్‌కు సుమారు రెండున్నర ఎకరాలు). కవరేజ్‌లోకి తేవాలని లక్ష్యించుకున్నది పంట భూమిలో 40 శాతం కాగా, ఈ పథకం కిందికి వచ్చింది 24 శాతానికన్నా తక్కువని కమిటీ గుర్తు చేసింది. బీమా పథకం కింద అమెరికాలో 89 శాతం పంట పొలాలుండగా, చైనాలో 69 శాతం ఉన్నట్టు కమిటీ తెలిపింది. ఈ పథకం కిందికి ఎక్కువమంది రైతులు వచ్చేలా అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని కమిటీ సిఫారసు చేసింది. వాతావరణ ఆధారిత పంట బీమా పథకం(డబ్ల్యూబీసీఐఎస్)పైనా కమిటీ తన నివేదికలో సూచనలు చేసింది. అనావృష్టి, వేడిగాలులు, ఇతర వాతావరణ వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఈ పథకం కింద పరిహారం అందిస్తారు. అయితే, వాతావరణంలో వచ్చిన మార్పుల్ని గుర్తించి రైతులకు జరిగిన నష్టాన్ని నిర్ధారించేందుకు తగినన్ని ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు(ఏడబ్ల్యూఎస్‌లు) లేకపోవడాన్ని నివేదికలో గుర్తు చేశారు. 33,000 ఏడబ్ల్యూఎస్‌లు అవసరం కాగా, 706 మాత్రమే పని చేస్తున్నాయని తెలిపింది. ఈ పథకం కింద చేరిన రైతుల సంఖ్య 2014–15లో కోటీ 12 లక్షల 50 వేలు కాగా, 2016–17లో 21 లక్షలకు తగ్గినట్టు కమిటీ తన నివేదికలో తెలిపింది. బీమా పథకాలను సమర్థవంతంగా అమలయ్యేలా చూడాలని, వీటి వల్ల కలిగే లబ్ధి గురించి రైతులకు వివరించి ఎక్కువమంది చేరేలా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది.

కూటమిలో చేరని పార్టీలను ఓడిస్తాం : అమిత్‌షా

న్యూఢిల్లీ: బీజేపీ, శివసేన మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. మహారాష్ట్రలో ఆధిపత్యం కోసం ఈ రెండు పార్టీల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్ కాస్తా హాట్‌వార్‌గా మారుతోంది. గతంలో తమతో ఉండి 2019 లోక్‌సభ ఎన్నికల్లో తమ కూటమిలో చేరని పార్టీలను ఓడిస్తామని బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా హెచ్చరించారు. మరోవైపు మహారాష్ట్రలో ఉన్న 48 లోక్‌సభ స్థానాల్లో 40 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తమ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. లాతూర్‌లో తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఈ ఇద్దరు నేతలు చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా శివసేనను ఉద్దేశించేనని అర్థమవుతోంది. దీంతో, ఈవీఎంలతో పొత్తు పెట్టుకున్నారా అంటూ బీజేపీకి శివసేన కౌంటరిచ్చింది.

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, శివసేన ఎన్డీఏలో భాగస్వామ్య పక్షాలుగా సీట్ల సర్దుబాటు చేసుకున్నాయి. అయితే, ఆ తర్వాత జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికివారే ఒంటరిగా పోటీ చేశారు. ఎవరికీ పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఎన్నికల తర్వాత సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన నేతలు సంకేతాలిస్తుండటంతో బీజేపీ నేతలు అందుకు బదులిచ్చారు. తాజాగా జరిగిన కార్యకర్తల సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ ఎవరితోనూ సీట్ల సర్దుబాటు లేకున్నా మహారాష్ట్రలోని అన్ని సీట్లలోనూ గెలవగలమని ధీమా వ్యక్తం చేశారు. 11 కోట్లమంది కార్యకర్తలున్న తమ పార్టీని ఎవరూ దెబ్బతీయలేరని అమిత్‌షా అన్నారు. ఫడ్నవీస్ ఓ అడుగు ముందుకేసి గతంలో భాగస్వామ్యపక్షాలు పోటీ చేసిన స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించగలమంటూ భరోసా ఇచ్చారు. ఒంటరి పోరుకు సిద్ధపడాలంటూ తమ పార్టీ ఎంపీలకు అమిత్‌షా సూచించారన్న వార్తల నేపథ్యంలో శివసేన అధికార ప్రతినిధి ఒకరు ఘాటుగా స్పందించారు. 40 స్థానాల్లో గెలుస్తామని అంటున్నారంటే బీజేపీ ఈవీఎంలతో కూటమి కట్టినట్టుగా ఉన్నదని శివసేన నేత ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చాటుతామని శివసేన సవాల్ చేస్తోంది.

భద్రత లేని బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

కొలువులపై నమ్మకంలేక అభద్రాభావంతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న కేంద్ర సర్కారు పథకాల్లో పనిచేసే కార్మికులు మరోమారు సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఆ కార్మికులంతా మంగళ, బుధవారాల్లో జరిగే సమ్మెలో పాల్గొనబోతున్న నేపథ్యంలో స్కీమ్ వర్కర్లపై నవతెలంగాణ కథనం.

దేశంలోని నూటికి 75 శాతం మంది కేవలం రూ.5 వేల కంటే తక్కువ ఆదాయంతో అత్యంత దుర్భర జీవితాలను గడుపుతున్నారు. దేశంలోని సగం మంది పిల్లలు తక్కువ బరువుతో, పోషకాహార లోపంతో, 79 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వాళ్లను ఆదుకునేందుకు పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం మొదలు పెట్టాయి. ఆ పథకాల నిర్వహణ కోసం దేశంలోని కోటి మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది కార్మికులున్నారు. అట్టడుగు సామాజిక తరగతుల వారికి లబ్ది చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల్లో పనిచేస్తున్నవారు ఎక్కువగా మహిళలే. వీరంతా ఆ తరగతికి చెందిన వారే. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందేలా విధులు నిర్వర్తిస్తున్నారు. వీళ్లకు సర్కారు కనీస వేతనాలను కూడా అమలు చేయడం లేదు. తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకంలో 83 వేల మంది పనిచేస్తున్నారు. ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలన్న కోర్టు తీర్పులను తుంగలో తొక్కి కేవలం రూ. 1000 గౌరవ వేతనం(కేంద్ర ప్రభుత్వం రూ.600, రాష్ట్ర సర్కారు రూ.400) ఇచ్చి పాలకులు చేతులు దులుపుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ...వారిని పెద్దాస్పత్రులకు తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించే ఆశావర్కర్లు తెలంగాణలో 24వేల మంది ఉన్నారు.

ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరా యంగా పనిచేస్తున్న వీరికి కేవలం రూ.7,500 వేతనం మాత్రమే దక్కుతున్నది. ఇటీవల కేంద్ర సర్కారు నియమిం చిన స్వచ్ఛకార్మికులు 50 వేలమందిదాకా ఉన్నారు. వీరికి నెలసరిగా ఇస్తున్న గౌరవవేతనం కేవలం 2,300 మాత్రమే. అనేక పోరాటాల ఫలితంగా అంగన్‌వాడీలకు రూ.12 వేతనం దక్కుతున్నది. వీరే గాక తదితర పథకాలను అట్టడుగు సామాజిక తరగతుల వారికి చేరేలా ఎన్‌హెచ్‌ఎం, చైల్డ్ లేబర్ ప్రాజెక్టు ఎంజీఎన్ఆర్ఇజీఏ, కస్తూర్బాగాంధీ, సర్వశిక్షా అభియాన్, ఐకేపీల్లో పనిచేసే ఏ ఒక్క కార్మికునికి కూడా కనీస వేతనాలు అమలు కావడం లేదు.. కనీస సౌకర్యాలేవీ వర్తింపజేయడం లేదు. వీరికి కార్మికచట్టాలు వర్తించకపోవడం గమనార్హం.

పథకాల నిర్వీర్యానికి పాలకుల కుట్ర

ఆయా సామాజిక భద్రతా పథకాలను క్రమంగా నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు కుట్ర చేస్తున్నది. పథకాలకు మొదట్లో కేంద్రం 90శాతం నిధులు కేటాయించగా...రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం ఇచ్చేవి. ఆ తర్వాత కేంద్ర క్రమంగా 75 శాతానికి, ఇప్పుడు 60 శాతానికి తగ్గించింది. ఇలా కేంద్రం నిధులు తగ్గిస్తుండటంతో రాష్ట్రాలు కూడా క్రమంగా ఆ పథకాల నుంచి తప్పుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో కొన్నేండ్లుగా ఆ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడుతున్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మిక పథకాల నిర్వహణను పూర్తిగా ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పి అందులో పనిచేస్తున్న కార్మికుల పొట్టగొట్టే చర్యలను మోడీ సర్కారు వేగవంతం చేసింది. ఇప్పటికే మధ్యాహ్నభోజన పథకాన్ని కొత్తగూడెం జిల్లాలో ప్రయివేటు సంస్థకు అప్పగించటంతో వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇంకోవైపు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.4:30పైసలు, ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.6.18పైసలు చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్నది. ఆ డబ్బులతోనే భోజనాన్ని పెట్టాలని వారిపై ఒత్తిడి చేస్తున్నది. కనీసవసతులు కల్పించకుండా...అరకొర నిధులు విదిల్చుతూ నిర్వహణ మీ తరం కావట్లేదంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని మధ్యాహ్నభోజన నిర్వహణను అక్షయ పాత్ర, ఇస్కాన్, నాంది, తదితర స్వచ్ఛంధ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. దీంతో అందులో 83వేల మంది కార్మికులే కాదు.. ఆ కార్మికుల కుటుంబాలన్నీ రోడ్డున పడే ప్రమాదముంది. సాక్షరభారత్‌లో పనిచేస్తున్న వారిని ఇప్పటికే తొలగించడం ప్రారంభించింది.

సార్వత్రిక సమ్మెలో స్కీమ్ వర్కర్లు పాల్గొంటారు : ఎస్.రమ, శ్రామిక మహిళా సంఘం కన్వీనర్



ప్రభుత్వ పథకాల నిర్వహణను ప్రయివేటు వ్యక్తులకు అప్పజెప్పటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దీనిని నిరసిస్తూ స్కీమ్ వర్కర్లంతా మంగళ, బుధ వారాల్లో జరిగే సమ్మెలో పాల్గొనబోతున్నారు. ఆయా పథకాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పథకాల నిర్వహణకు బడ్జెట్ కేటాయించాలి. షరతుల్లేకుండా వారికి లోన్లను ఇవ్వాలి. ప్రయివేటు సంస్థలకు పథకాల నిర్వహణను అప్పజెప్పే నిర్ణయాన్ని పాలకులు ఉపసంహరించుకుని స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

పెట్రో వడ్డన షురూ..

(మొదటిపేజీ తరువాయి)

పెట్రోల్ ధరలు రూ. 68.50, డీజిల్ రూ. 62.24గా నమోదయ్యాయి. ఇవే ధరలు ముంబయిలో రూ. 74.16, రూ. 65.12 కు చేరుకున్నాయి. హైదరాబాద్‌లో పెట్రోల్‌పై రూ. 0.23, డీజిల్‌పై రూ. 0.09 పైసలు పైకి ఎగబాకాయి. లీటరు పెట్రోల్ రూ. 72.67 కాగా, డీజిల్ రూ. 67.66గా నమోదైంది.

'అంగన్‌వాడీ'లో గర్భిణిపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

మారింది. ఈ హృదయ విదారకమైన ఘటన సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండాలో జరిగింది.

టేకులపల్లి ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల తండాకు చెందిన బానోతు పద్మ ఏడు నెలల గర్భిణి. ఆమెకు నాలుగేండ్లు, రెండ్లేండ్ల వయస్సు కుమార్తెలున్నారు. రెండు సంవత్సరాల పాప మేఘన అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా టీచర్ జ్యోతి, ఆయా మాలోత్ లీలావతి అనుమతించలేదు. ఇలా ఏడు నెలలుగా జరుగుతోంది. అయితే 'పాపను కేంద్రానికి రానీయడం లేదు. పాపకు పౌష్టికాహారం కూడా ఇవ్వడం లేదు. తనకు కూడా ఎందుకు పౌష్టికాహారం ఇవ్వడం లేదు' అని పద్మ ఆయాను ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆయా భర్త మాలోతు వీరూ జోక్యం చేసుకుని పద్మ పొట్టపై ఇష్టం వచ్చినట్టుగా కాలుతో తన్నాడు. దీంతో పద్మ కడుపులో నుంచి పిండం బయట పడింది. ఆమె పరిస్థితి విషమించడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పద్మ భర్త లక్ష్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పెండింగ్ వేతనాల కోసం..

(మొదటిపేజీ తరువాయి)

సిబ్బందిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ కార్యాలయంలోకి వెళ్లే గేట్‌కు కూడా కార్మికులు తాళం వేశారు. కార్యాలయానికి వచ్చిన కమిషనర్‌ను తమకు మూడు నెలల వేతనాలు ఇవ్వాలని నిలదీశారు. స్పందించిన కమిషనర్ పూర్ణచందర్ ఈ విషయంపై ఆర్డీఓ లింగ్యానాయక్‌తో చర్చించేందుకు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ ఆర్డీఓ లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకి సమాచారం అందించారు. దీంతో టౌన్ ఎస్ఐ సర్ధార్ సంఘటనా స్థలానికి వచ్చారు. ఎస్ఐ, కమిషనర్ కలిసి కార్మికులతో వేతనాలపై చర్చించారు. అక్టోబర్, నవంబర్ నెలల వేతనాలకు సంబంధించిన చెక్కులు బ్యాంకులో వేశామన్నారు. ఫ్రీజింగ్ ఉన్నందున్న ఆలస్యమవుతుందన్నారు. మరో రెండ్రోజుల్లో డిసెంబర్‌కు చెందిన వేతనాలు కూడా బ్యాంకులో జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కార్మికులు మాట్లాడుతూ.. అక్టోబర్ నెలకు సంబంధించిన చెక్కు పాసు కాగా నవంబర్ చెక్కులు ఎందుకు పాసుకావని నిలదీశారు. పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సంక్రాంతి పండుగ వరకు వేతనాలందకపోతే మరోసారి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటయ్య, కె.నాగరాజు, నాయకులు వీరయ్య, రవి, కొండయ్య, మారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అందరితోపాటే..

(మొదటిపేజీ తరువాయి)

నామినేటెడ్ సభ్యుడి నియామకానికి నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. మరోవైపు శాసనసభ ఎన్నికలను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించినందుకుగాను భారత ఎన్నికల సంఘాన్ని, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్‌ను, ప్రభుత్వ యంత్రాగాన్ని క్యాబినెట్ ప్రత్యేకంగా అభినందించింది.

సభ్యులకు నిబంధనల ప్రతులు..

తెలంగాణ శాసనసభకు ఎన్నికైన సభ్యులకు భారత రాజ్యాంగ ప్రతులను తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో ముద్రించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వివిధ నిబంధనల సమాచారాన్ని తెలిపే పుస్తకాలను, బుక్‌లెట్లను కూడా అందివ్వాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతులను అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు ప్రగతి భవన్‌లో సీఎంకు అందజేశారు.

కార్మికుల సత్తా చూపుతాం

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా ట్రేడ్ యూనియన్ చట్టాన్ని సవరించేందుకు కేంద్రం ప్రయత్నించడం దారుణమన్నారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్న మోడీ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని తెలిపారు. తాము తలపెట్టిన జాతీయ సమ్మెకు ఇప్పటికే అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలిపినట్టు వివరించారు. బ్యాంకింగ్ రంగం, కోల్, పెట్రోలియం, పోస్టు, టెలికం, ఇంజనీరింగ్, స్టీల్, డిఫెన్స్, విద్యా, వైద్యం తదితర రంగాలకు చెందిన శ్రామిక సంఘాలు జాతీయ సమ్మెలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల సంఘం తరపున రైతులు, రైతు కూలీలుగా గ్రామాల్లో హర్తాళ్ నిర్వహించేందుకు సన్నద్ధమైనట్టు తెలిపారు. ఇదివరకు తాము మూడు జాతీయ సమ్మెలను విజయవంతం చేసినట్టు ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అశోక్ సింగ్ మాట్లాడుతూ తాము కార్మికుల హక్కుల కోసం ఒకపక్క పోరాడుతుంటే... మోడీ సర్కారు కార్మికులపై దాడిని మరింత కఠినతరం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కార్మికులంతా ఏకమై, మోడీ సర్కారు మెడలు వంచాలని చెప్పారు. గతంలో తాము చేపట్టిన సమ్మెల కంటే ప్రస్తుతం మరింత ఎక్కువగా మద్ధతు లభిస్తుందని అన్నారు. అందుచేత జాతీయ సమ్మె జయప్రదం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐయూటీయూసీ నేత ఆర్కే శర్మ, సీఐటీయూ నాయకురాలు ఏఆర్ సింధూ, హెచ్ఎంఎస్, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తదితర సంఘాలు పాల్గొన్నాయి.

ఢిల్లీలో పార్టీ భవన్‌కు జాగా ఇవ్వండి

నవ తెలంగాణ – న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయం నిర్మించుకునేందుకు భూమి కేటాయించాలని టీఆర్ఎస్ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. సోమవారం పార్లమెంట్‌లో ఆ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్రధాని నరేంద్ర మోడీని ప్రత్యేకంగా కలిశారు. తాము పార్లమెంట్‌లో 17 మంది సభ్యులమున్నామని... ప్రత్యేకంగా ఢిల్లీలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని భావిస్తున్నట్టు మోడీ దష్టికి తీసుకువచ్చారు. అనంతరం టీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత ఏపీ జితేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తాము పార్టీ నిర్మించుకునేందుకు స్థలం కేటాయించేలా పట్టణాభివృద్ధి శాఖాధికారులకు మార్గదర్శకాలు ఇవ్వాలని మోడీని కోరినట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం 1000 చదరపు గజాల స్థలం ఇవ్వాలని కోరినట్టు ఆయన వివరించారు. కేంద్రీయ ఢిల్లీలో పార్లమెంటుకు సమీపంలో ఉన్నటువంటి రాజేంద్రప్రసాద్ రోడ్డులో ఖాళీగా ఉన్న స్థలాన్ని టీఆర్ఎస్ పార్టీకి ఇవ్వాలన్నారు. కాగా, తమ విజ్ఞప్తికి ప్రధాని మోడీ సానుకూలంగా స్పందించినట్టు జితేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు భారీ మెజార్టీతో గెలిచాక..మంత్రులు,ఇతరులకు మిఠాయిలు ఇచ్చారని..తనకు మాత్రం ఒక్క స్వీటు కూడా తినిపించలేదని మోడీ ఎంపీలతో అన్నట్టు జితేందర్ రెడ్డి తెలిపారు. మీకు ప్రత్యేకంగా హైదరాబాద్‌నుంచి స్వీటు తెస్తామని మోడీతో అన్నట్టు ఎంపీలు చెప్పారు.

ఫిబ్రరి 28న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్

- పత్రాల సమర్పణకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 28న రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ బి శేషుకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'పాఠశాల సైన్స్ కర్రికులమ్– అవసరాలు, సవాళ్లు' అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ ప్రాంగణంలోని గోదావరి ఆడిటోరియంలో ఈ సెమినార్ జరుగుతుందని తెలిపారు. కొత్త ఆవిష్కరణలను పెంపొందించే దిశగా సైన్స్ బోధన, సృజనాత్మక మేధస్సును తయారు చేయడం, సైన్స్ బోధన ద్వారా విలువలను పెంపొందించడం, సైన్స్ బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వంటి అంశాలు ప్రధానమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సైన్స్ సంఘాల నుంచి ఈ సెమినార్‌లో పత్రాల సమర్పణకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. పత్రాల సమర్పణకు ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు.

సెన్సెక్స్ ▲ 105	నిఫ్టీ ▲ 44	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
35,850	10,771	69.73	రూ. 31,638	రూ. 39,223







కోడిగుడ్లు (వందకి)

హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



ఈ ఏడాది వృద్ధి 7.2 శాతం: సీఎస్‌వో

- వ్యవసాయం, తయారీ రంగం నుంచి దన్ను



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత్ 7.2 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్‌వో) సోమవారం వెల్లడించింది. ఈ ఏడాది వ్యవసాయ రంగం, తయారీ రంగం నుంచి మంచి దన్ను లభించనున్న నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థ గతేడాది కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేయగలదని సీఎస్‌వో తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో దేశం 6.7 శాతం వృద్ధిని నమోదు చేసిన విషయం తెలిసిందే. 2015-16 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 8.2 శాతంగాను, 2016-17లో 7.1 శాతంగాను నమోదు అయింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి ముందస్తు అంచనాలను వెల్లడిస్తూ దేశ వృద్ధి రేటు పెరుగుదలపై కొత్త అంచనాలను వెలువరించింది. వాస్తవ జీవీఏ గత ఏడాదితో పోలిస్తే 6.5 శాతం నుంచి 7 శాతానికి పెరిగే అవకాశం ఉందని సీఎస్‌వో తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అడవులు, చేపల పంపకపు కార్యకలాపాల్లో వృద్ధి 3.4 శాతం నుంచి 3.8 శాతానికి పెరిగే అవకాశం ఉన్నట్టుగా సీఎస్‌వో అంచనా కట్టింది. ఇదే మాదిరిగా తయారీ రంగం కూడా గత ఏడాదితో పోలిస్తే 5.7 శాతం నుంచి 8.3 శాతానికి ఎగిసే అవకాశం ఉన్నట్టుగా తెలిపింది.

లాభాల్లో కదలాడిన స్టాక్ మార్కెట్లు..

ముంబయి : అమెరికా-చైనా మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయనే అంచనాలకు తోడు ప్రపంచ మార్కెట్లు రాణించడంతో దేశీయ ఈక్విటీలకు మద్దతు లభించింది. ఈ నేపథ్యంలో సోమవారం బీఎస్ఇ సెన్సెక్స్ 155 పాయింట్లు లాభపడి 35,850 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 44 పాయింట్లు రాణించి 10,772కు చేరింది. నిఫ్టీలో ఐటి సూచీ 1.1 శాతం పెరిగింది. రియాల్టీ సూచీ 1.2 శాతం లాభపడింది. సెన్సెక్స్-30లో యాక్సిస్ బ్యాంకు, టాటా మోటార్స్, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్, ఎన్‌టిపిసి సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఆటో, యస్ బ్యాంకు, హీరో మోటో కార్ప్, బజాజ్ ఫినాన్స్, కోల్ ఇండియా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

బంధన్ బ్యాంక్‌లోకి గృహ్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: బంధన్ బ్యాంక్ ప్రముఖ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ గృహ్ ఫైనాన్స్‌ను కొనుగోలు చేయనుంది. షేర్ స్వాప్ డీల్ ద్వారా గృహ ఫైనాన్స్‌ను విలీనం చేసుకోనున్నట్టుగా బంధన్ బ్యాంక్ తెలిపింది. ఈ విలీన ప్రతిపాదనకు రెండు సంస్థల డైరెక్టర్ల బోర్డు అంగీకారం తెలిపింది. గృహ్ ఫైనాన్స్ సంస్థకు చెందిన వాటాదారుల వద్ద ఉన్న ప్రతి వెయ్యి షేర్లకు ప్రతిగా 568 బంధన్ బ్యాంక్ షేర్లు లభించనున్నాయి. గృహ్ సంస్థ విజయవంతమైన బిజినెస్ మోడల్‌తో మార్కెట్లో దూసుకుపోతున్న నేపథ్యంలో బంధన్ బ్యాంక్ ఈ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థపై ఆసక్తి పెంచుకున్నట్టుగా మార్కెట్ వర్గాలు చెబుతున్నారు.

అన్నదమ్ములూ.. చర్చించుకోండి

- స్పెక్ట్రమ్ చెల్లింపులపై ఒక నిర్ణయానికి రండి..
- అనిల్.. మీపై చర్యలు ఎందుకు తీసుకోవద్దు..

సమాధానమివ్వండి: సూటిగా ప్రశ్నించిన సుప్రీం





న్యూఢిల్లీ: ఎరిక్‌సన్‌కు బకాయిల చెల్లింపుల విఫలంపై రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు మరోమారు నోటీసులు ఇచ్చింది. గతంలో చేసిన వాగ్దానం మేరకు ఎరిక్‌సన్ సంస్థకు బకాయిలు చెల్లించని నేపథ్యంలో ఆయనపై ధిక్కరణ అభియోగం కింద ఎందుకు చర్యలు తీసుకోవద్దో వెల్లడించాలని కోర్టు అనిల్‌ను కోరింది. కోర్టు ధిక్కార పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానమివ్వాలని న్యాయమూర్తి ఆర్‌ఎఫ్ నారిమన్ నేతత్వంలోని ధర్మాసనం సోమవారం అంబానికి ఆదేశాలు జారీ చేసింది. దాదాపు రూ.550 కోట్ల బకాయిలను చెల్లించడంలో పలుమార్లు విఫలమైన ఆర్‌కామ్ అధినేత అనిల్ అంబానీపై స్వీడన్ టెలికాం పరికరాల తయారీ దిగ్గజం ఎరిక్సన్ గత వారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమ బాకీలు చెల్లించడంలో డిఫాల్ట్ అవుతున్న అనిల్‌ను, ఆయనతో పాటు మరో ఇద్దరు కంపెనీ ఉన్నతాధికారులను కోర్టు ధిక్కరణ నేరం కింద జైలుకు పంపాలని, బాకీలు చెల్లించేదాకా దేశం విడిచి వెళ్లకుండా ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. దీనిపై తాజాగా నారిమన్ బెంచ్ విచారణ చేపట్టింది. కాగా బకాయి కింద రూ.118కోట్లను చెల్లించడానికి ఆర్‌కామ్ సిద్ధంగా ఉందని, ఈ మొత్తాన్ని ఎరిక్‌సన్ అంగీకరించాలని ఆర్‌కామ్ తరపు సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, ముకుల్ రోహతగి కోర్టును కోరారు. కాగా ఎరిక్‌సన్ దీన్ని తిరస్కరించింది. దీంతో ఆ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్టు రూపంలో కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాల్సింగా ఆర్‌కామ్‌ను కోర్టు ఆదేశించింది. ఆర్‌కామ్ ఆస్తులు విక్రయించగా రూ.3,000 కోట్లు పొందిందని అయినా తమకు చెల్లింపులు చేయలేదని ఎరిక్‌సన్ ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. బకాయిల చెల్లింపునకు వ్యక్తిగతంగా హామీ ఇచ్చిన అనిల్ అంబానీ గడువు తీరినా స్పందించడం లేదని, తద్వారా కోర్టు గడువును కూడా ఉల్లంఘించారని ఎరిక్‌సన్ ఇది వరకు తన పిటిషన్‌లో పేర్కొంది. ఆర్‌కామ్ ఆస్తుల కొనుగోలుపై అంబానీ అన్నదమ్ములు ఇద్దరు కూర్చుని మాట్లాడుకోవాలని కోర్టు ఈ సందర్భంగా తాజాగా సూచించింది. పరస్పరం మాట్లాడుకొని స్పెక్ట్రమ్ బకాయిల చెల్లింపు విషయంలో ఒక నిర్ణయానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. మరోవైపు స్పెక్ట్రం ట్రేడ్ మార్గదర్శకాలకు కట్టుబడి ఆర్‌కామ్ కొనుగోళ్లపై సిద్ధంగా ఉన్నారా అని జియోను కోర్టు ప్రశ్నించింది. అయితే ముందస్తు బకాయిల నేపథ్యంలో ఆర్‌కామ్‌కు ఫిజికల్ గ్యారంటీ ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని జియో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టుకు తెలిపారు. ఈ అంశంలో ట్రాయ్ నిబంధనలను పాటించాల్సి ఉందని అన్నారు.

వివాదమిలా..

దేశవ్యాప్తంగా ఆర్‌కామ్ టెలికాం నెట్‌వర్క్ నిర్వహణకు సంబంధించి 2014లో ఎరిక్సన్ ఏడేళ్ల కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే 2016 నుంచి చెల్లింపులు చేయకపోవడంతో సెప్టెంబర్ 2017లో ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూప్‌లో భాగమైన రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ టెలికంలపై ఎరిక్సన్.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సీఎల్‌టీ)లో దివాలా పిటిషన్ వేసింది. ఈ కేసు పలు పరిణామాల మధ్య తుదకు 2017 సెప్టెంబర్ నాటికి రూ.550 కోట్లు చెల్లించాలని ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసింది. గడువులోగా ఈ మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఎరిక్సన్ మళ్లీ కోర్టుకెళ్లడంతో డిసెంబర్ 15 నాటికి అవకాశం కల్పించింది. బకాయిలు చెల్లించడంలో ఆర్‌కామ్ రెండు సార్లు విఫలమయ్యింది. దీంతో తాజాగా ఎరిక్‌సన్ అభ్యర్థన మేరకు సుప్రీం మరోమారు కల్పించుకుంది. ప్రస్తుతం ఆర్‌కామ్ రూ.46,000 కోట్ల పైగా అప్పుల్లో ఉంది. ఆస్తుల విక్రయం ద్వారా ఈ అప్పులను రూ.6,000 కోట్లకు తగ్గించుకోవాలని నిర్దేశించుకుంది. అయితే టెలికం శాఖ నిబంధనలతో ఈ ఆస్తుల అమ్మకంలో తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది.

నగదు లభ్యత పెంపునకు చర్యలు: ఆర్బీఐ



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యత తగ్గితే లిక్విడిటీ పెంపునకు అవసరమైన అన్ని చర్యలను చేపడతామని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. రుణాల పునర్వ్యవస్థీకరణపై సోమవారం దాస్‌తో చిన్న, మధ్యతరహా సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. పరిశ్రమల పునర్నిర్మాణం కోసం వచ్చే రుణాల దరఖాస్తుల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని శక్తికాంత బ్యాంకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగదు లభ్యత అవసరాలను ఆర్బీఐ పూర్తిస్థాయిలో పరిష్కరించిందన్నారు. అవసరమైతే మరింత నగదు లభ్యతను పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం, ఆర్బీఐ మధ్య పలు అంశాలపై సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ తమ పరిధిలోని అంశాలపై తుది నిర్ణయం ఆర్బీఐదేనని అన్నారు. వ్యవస్థకు సరిపడా ఆర్బీఐ తగినన్ని నగదు నిల్వలను అందుబాటులో ఉంచుతుందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు తగ్గడాన్ని ఆర్బీఐ కోరుకోదన్నారు. మంగళవారం బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలతో సమావేశం కానున్నట్లు శక్తికాంత్ తెలిపారు.

కేంద్రానికి 'మధ్యంతర' డివిడెండ్

ముంబయి: ఖర్చులు పెరిగిపోయి ద్రవ్యలోటుతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వం ఆర్బీఐ నుంచి వివిధ మార్గాల్లో నిధులను సమీకరించేందుకు ప్రయత్నాలను సర్కారు ముమ్మరం చేసినట్టుగా తెలుస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మధ్యంతర డివిడెండ్ కింద రూ.30,000- రూ.40,000 కోట్లు (4.32 బిలియన్ డాలర్ల -5.8 బిలియన్ డాలర్ల) అందించనుందని తెలుస్తోంది. మిగులు నిధులపై రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం మధ్య గత కొన్ని నెలలుగా బేధాభిప్రాయాలు చోటు చేసుకుంటున్న వేళ ఈ యోచన జరగడం గమనార్హం. జీఎస్టీ వల్ల ఇప్పటికే పడిపోయిన పన్ను వసూళ్ల నేపథ్యంలో ఆర్బీఐ మధ్యంతర డివిడెండ్ పేరుతో అందించే నిధులతో ద్రవ్య లోటును పూడ్చుకోవాలని కేంద్రం భావిస్తోంది. సర్కారు ఆర్బీఐ నుంచి రూ.3 లక్షల కోట్ల పైగా మిగులు నిధులను ఆశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చోటు చేసుకున్న బేధాభిప్రాయల నేపథ్యంలో ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామాకు దారి తీసింది.

నైపుణ్యత లోపంతో 1.97 లక్షల కోట్ల నష్టం



న్యూఢిల్లీ: భారత్‌లో నైపుణ్యత కొరత ఎక్కువగా ఉందని.. దీనిని తగ్గించే విధంగా తగిన చర్యలు చేపట్టిన నేపథ్యంలో రానున్న రోజుల్లో ఇది దేశ వృద్ధిరేటును భారీగా ప్రభావితం చేసే అవకాశం ఉందని యాక్సెంచర్ సంస్థ తాజా నివేదికలో తెలిపింది. రానున్న దశాబ్దపు కాలంలో ఇంటెలిజెంట్ టెక్నాలజీల్లో భారీగా పెట్టుబడులు రానున్నాయని.. ఈ నేపథ్యంలో దేశ వృద్ధి రేటు మెరుగ్గా రాణించే అవకాశం ఉందని ఈ నివేదిక తెలిపింది. అయితే ఇందుకు తగ్గ నైపుణ్యత కలిగిన నిపుణుల కొరత ఏర్పడితే మాత్రం ఆర్థిక వ్యవస్థకు దాదాపు 1.97 లక్షల కోట్ల వరకు దెబ్బపడే అవకాశం ఉందని ఈ నివేదిక విశ్లేషించింది. దేశ నైపుణ్యత పెంపు విప్లవంలో కృత్రిమ మేథస్సు, వర్చువ్ రియాల్టీ, బ్లాక్‌చైన్, వంటి టెక్నాలజీలు కీలక భూమికను పోషించనున్నాయని నివేదిక తెలిపింది. వేగంగా నైపుణ్యతను పెంచేందుకు, తిరిగి నైపుణ్యతను అదించేందుకు ఈ టెక్నాలజీలు విప్లవాత్మకంగా దోహదం చేయనున్నట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. తక్కువ వ్యయంతో కొత్త టెక్నాలజీలను ప్రజలు సమర్థమంతంగా అందిపుచ్చుకోవడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందని నివేదిక తెలిపింది. అనుభూతితో కూడిన ఆన్‌జాబ్ ట్రేనింగ్‌తో ప్రజలు ఎక్కువగా నేర్చుకుంటారని.. జీవితకాలం నైపుణ్యత పెంపు వల్లే ప్రజలు డిజిటల్ పరివర్తనను అందిపుచ్చుకొంటారని నివేదిక తెలిపింది.

మోటారు వాహనాల చట్టం బిల్లును ఉపసంహరించుకోవాలి

- నేడు రేపు దేశవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె
- కనీస వేతనం

రూ.24 వేలు చెల్లించాలని డిమాండ్



సమ్మె గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోటారు వాహనాల చట్టం బిల్లు-2017 సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టూరిస్ట్ పర్మిట్లను సరళతరం చేస్తూ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా వెనక్కి తీసుకోవాలని సూచించింది. మంగళ, బుధవారాల్లో దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్, బహుజన వర్కర్స్ యూనియన్లు కూడా సమ్మెలో పాల్గొంటున్నట్టు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల నాయకులు సోమవారం హైదరాబాద్ బస్‌భవన్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ వేధింపులకు గురిచేస్తున్నదని విమర్శించారు. మోటార్ ట్రాన్స్‌పోర్టు బిల్లును ఎలాగైనా రాజ్యసభలో నెగ్గించుకోవాలనే కేంద్రం యత్నాన్ని కార్మిక వర్గం తిప్పికొడుతుందని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్‌కు అనుబంధంగా ఉన్న టీఆర్ఎస్‌కేవీ సమ్మెలో పాల్గొంటున్నదని కానీ టీఎంయూ ఎందుకు సమ్మెలో పాల్గొడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సమ్మె విజయవంతం చేస్తామని అన్నారు. కార్మికులకు పెన్షనరీ బెనిఫిట్స్ కలగజేయాలని, గ్రాట్యుటీ పై వచ్చే పరిధిని కూడా పెంచాలని, కార్మికుల కనీస వేతనం రూ.24 వేలు ఉండాలని సూచించారు. టూరిస్ట్ బస్సులకు స్టేజి క్యారేజీలుగా అనుమతులివ్వడం ప్రభుత్వ రవాణా వ్యవస్థలను నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. టీఎంయూ సమ్మె చేస్తేనే టీజేఎంయూ సమ్మె చేయాలనే ఆలోచన సరైంది కాదని అన్నారు. స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు అబ్రహాం మాట్లాడుతూ పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, డీజిల్ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బస్సులకు వస్తున్న నష్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలన్నారు. కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల పెట్టుబడులు ఆర్టీసీలకు అందడం లేదని, అందువల్ల మూలధన పెటుబడిని రాష్ట్రాల ఆర్టీసీలకు చెల్లించాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి ఒక శాతం నిధులు కేటాయించాలన్నారు. బహుజన వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు కనీస పింఛన్‌ను రూ.7 వేలకు పెంచాలని అన్నారు. ఆర్టీసి బస్సులకు టోల్‌గేట్‌ల వద్ద పన్ను మినహాయించి, ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని సూచించారు. గేటర్ హైదరాబాద్ జోన్‌కు చెందిన వివిధ సంఘాల కార్మిక నాయకులు అధిక సంఖ్యలో హాజరై రెండు రోజుల సమ్మెను జయప్రదం చేస్తామని నినాదాలు ఇచ్చారు.

ఫ్లోరైడ్‌పై దృష్టి సారించలేదు..

జానా, ఉత్తమ్‌పై కేటీఆర్ విమర్శ

- సాగర్ నుంచి పలువురు టీఆర్ఎస్‌లోకి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. మంత్రులుగా ఉన్నప్పుడు నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్యపై దృష్టి సారించలేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి.. చిత్తూరు జిల్లా తాగునీటి అవసరాల కోసం రూ.వేల కోట్లు తరలించుకుపోయినా జానా, ఉత్తమ్ నోరు మెదపలేదని అన్నారు. వారిద్దరూ పదవులను పట్టుకుని వేలాడారు తప్ప ప్రజల కోసం ఏనాడూ ఆలోచించలేదని ఎద్దేవా చేశారు.

నాగార్జున సాగర్‌కు చెందిన పలువురు నేతలు సోమవారం కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... నల్లగొండలో జానారెడ్డి సహా మహామహులు మట్టికరిచారని అన్నారు. ఆ జిల్లాలో నైతికంగా అన్ని స్థానాలనూ తమ పార్టీయే గెలుచుకుందని చెప్పారు. నకిరేకల్‌లో ట్రక్కు గుర్తు వల్లే ఓడిపోయామని తెలిపారు. ఎన్నికల్లో అత్యధిక స్థానాలను తమకు కట్టబెట్టిన నల్లగొండ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామని కేటీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. హాలియా, నందికొండ మున్సిపాలిటీలకు నిధులిచ్చి అభివద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని హామీనిచ్చారు. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మ్యాజిక్ నంబర్ (273 సీట్లు) కాంగ్రెస్‌కుగానీ, బీజేపీకిగానీ వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఆ రెండు పార్టీలకు కలిపి కూడా మ్యాజిక్ నంబర్ రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 16 ఎంపీ స్థానాలను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తే ఢిల్లీ గద్దెపై ఎవరు కూర్చోవాలనే విషయాన్ని తెలంగాణే నిర్ణయిస్తుందని చెప్పారు. అందువల్ల శాసనసభ ఎన్నికల్లో చూపించిన స్ఫూర్తినే పార్లమెంటు ఎన్నికల్లోనూ కొనసాగించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.



సభలో ప్రసంగిస్తున్న కేటీఆర్

గులాబీ గూటికి రామగుండం ఎమ్మెల్యే..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామగుండం నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన ఎమ్మెల్యే కోరుకంటి చందర్... సోమవారం కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు వివేక్ తదితరులు హాజరయ్యారు.

పోలియో బాధితుడికి కేటీఆర్ హామీ..

పోలియో వ్యాధితో బాధపడుతున్న శివసాయి అనే బాలుడు (రామగుండం నియోజకవర్గానికి చెందినవారు) సోమవారం కేటీఆర్‌ను కలిశారు. రెండు కాళ్లు దెబ్బతినడంతో శివసాయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ బాలుణ్ని తక్షణం ఆస్పత్రిలో చేర్పించాలంటూ గ్రేటర్ హైదరాబాద్ టీఆర్ఎస్ నాయకుడు కట్టెల శ్రీనివాస్ యాదవ్‌ను కేటీఆర్ ఆదేశించారు. వైద్యానికయ్యే ఖర్చును భరిస్తానంటూ ఆయన హామీనిచ్చారు.



దత్తాత్రేయ.. తెలంగాణవైపు నిలబడండి

- టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

కర్నె ప్రభాకర్, ఫారూఖ్ హుస్సేన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ వాస్తవాలను మరిచి మాట్లాడుతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, ఫారూఖ్ హుస్సేన్ విమర్శించారు. తెలంగాణకు కేంద్రం నుంచి వచ్చిందేమీ లేదంటూ తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు నూటికి నూరుపాళ్లు నిజమేనని అన్నారు. ఆయన సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దత్తాత్రేయ దాటవేత ధోరణితో మాట్లాడున్నారని సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు విమర్శించారు. తెలంగాణకు రూ.2 లక్షల కోట్లను కేటాయించామంటూ అమిత్ షా చెప్పినపుడు.. సీఎం కేసీఆర్ ఆధారాలతో సహా ఖండించారని గుర్తుచేశారు. ఇలాంటి వాస్తవాలను మరిచి దత్తాత్రేయ మళ్లీ పాతపాటనే అందుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథకు రూ.24 వేల కోట్ల సాయం చేయాలంటూ నిటి అయోగ్ సిఫారసు చేసినా కేంద్రం ఎందుకు పట్టించుకోలేదని విమర్శించారు. బీజేపీ మతాన్ని నమ్ముకునే రాజకీయాలు చేస్తున్నదని వారు విమర్శిం చారు. ప్రొటెం స్పీకర్‌నుద్దేశించి ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్య లనుబట్టి ఆ పార్టీకి రాజ్యాంగం పట్ల విశ్వాసం లేదనే విషయం తేలిపోయిందన్నారు. తక్షణమే రాజాసింగ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నాగోబా జాతరను విజయవంతం చేయాలి

- గతానుభవాల దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కృష్ణ ఆదిత్య

నవతెలంగాణ- ఉట్నూర్‌టౌన్

అన్ని ప్రభుత్వ శాఖలూ సమన్వయంతో కేస్లాపూర్ నాగోబా జాతరను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కృష్ణ ఆదిత్య సూచించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర ఏర్పాట్లపై సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కృష్ణ ఆదిత్య

నాగోబా జాతరకు వచ్చే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా చూడాలన్నారు. గతంలోని అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి ఎలాంటి ఘటనలూ చోటుచేసుకోకుండా జాతరను విజయవంతం చేయాలని కోరారు. జాతరలో మంచినీరు, పారిశుధ్యం నిర్వహణలో లోపాలూ లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరలో 13 బోర్లు, రెండు చేతి పంపులు, ఆర్ఓ ప్లాంట్ నిరంతరం పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనంగా ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లతో పాటు గతంలో ఉన్న వాటిని మరమ్మతు చేయాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో దర్బార్, దేవాలయం, క్రీడా స్థలానికి అవసరమయ్యే బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం తాత్కాలిక కార్మికులను నియమించాలని చెప్పారు. జాతరలో విధులు నిర్వర్తించే సిబ్బందికి భోజన వసతి కల్పించాలని తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని, జాతరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ గోపి, ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్ కనకే లక్కేరావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ చందన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిత్రు, డీఎస్పీ వెంకట్, ఈఈటీడబ్ల్యూ నగేష్, డీఎంహెచ్ఓ రాజీవ్‌రాజ్, ఆలయ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, కేస్లాపూర్ మాజీ సర్పంచ్ నాగ్‌నాథ్ పాల్గొన్నారు.



భయం, విస్మయం, చాతుర్యం కలిస్తే... కాటిపాపలు

జానపద కళారూపాల్లో ఇంద్రజాల విద్యలను ప్రదర్శించే కళారూపాలు చాలా ప్రత్యేకమైనవి. ఎందుకంటే ఈ కళారూపాలు ప్రేక్షకుల కళ్ళ ముందే నమ్మశక్యం గాని విద్యలను ప్రదర్శించి వారిని సంభ్ర మాశ్చర్యానికి గురిచేస్తాయి. వీరు ప్రదర్శించే విద్యలను ప్రేక్షకులు ఎంత తీక్షణంగా పరిశీలించి చూసినప్పటికీ అంచనాలకు అందకుండా క్షణంలో, వారి కళ్ళకు గంతలు కట్టి అద్భుతాలను ప్రదర్శిస్తారు. ఈ కళారూపాలు కొన్నిసార్లు ప్రేక్షకులకు మంత్రతంత్రాలు ఉన్నాయనే నమ్మకాన్ని కూడా కలిగించడం విశేషం. ఇటువంటి కళారూపాల్లో సాధనా శూరులు ,బీరన్న లు, యక్షిణి, విప్రవినోదులు ,మోడీ, గారడీ, దేవర పెట్ట వేషం, మహమ్మదీయుల మోళీ, కాటి పాపలు ప్రధానమైనవి. ఇందులో కొన్ని కళారూపాలు నశించిపోగా మరికొన్ని అవసాన దశలో ఉన్నాయి. సాధనా శూరులు, బీరన్నలు, కాటిపాపలు మనుగడలో ఉన్నాయి. వీటిలో సాధనా శూరులు పద్మశాలి కులాన్ని, బీరన్న లు యాదవులను మాత్రమే ఆశ్రయించి ప్రదర్శనలిస్తూ ఆశ్రిత కళారూపాలుగా కొనసాగుతున్నాయి. కాటి పాపలు ప్రదర్శి:చేవారు మాత్రం తమ కట్టడి గ్రామాల్లోని అన్ని కులాలను ఆశ్రయించి ఇంద్రజాల విద్యలను ప్రదర్శి స్తారు. వీరు శైవాన్ని ప్రధానంగా అనుసరించే బుడగ జంగాలలో బేడ వర్గానికి చెందినవారు. వీరికే కాటి పాపలు లేదా కాటికాపరులు అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఈ కళాకారులు కాటి లోపల పాపల మాదిరిగా పడుకుంటారు కాబట్టి కాటిపాపలని అలాగే కాటికి కాపర్లు గా ఉండటంతో కాటికాపర్లు అనే పేరు వచ్చిందని చెబుతారు. హరిశ్చంద్రుని కాలం నుండి చేస్తున్న వృత్తి అని చెప్పుకుంటారు.భూపాలపల్లి జిల్లా, పంగిడిపల్లి గ్రామం (టేకుమట్ల మండలం)లో ఉన్న పురాణం పెద్దరాజబోసు, పురాణం చిన్న రాజబోసు, పురాణం రమేష్ అనే కాటిపాప కళాకారులతో సమభాషించి తెలుసుకున్న సమాచారంతో రాసిన వ్యాసం ఇది.

కాటికాపరుల వద్ద ఉండే రాగి శాసనం "అంగ వంగ కళింగ కాశ్మీర నేపాల భూపాల ద్రావిడ విధర్భ మొదలైన 56 దేశములలో పుణ్యం కోసం కాటి పాపడు 5 వేల వరహాలు బిక్షం అడిగి విశ్వనాథునికి ముఖ మంటపం కట్టించి, నాగభరణం చేయించి, విఘ్నేశ్వరునికి షోడశ పూజ గావించి, సిద్ధులకు శుద్ధ భక్తి గావించినాడని గొప్పగా చెబుతున్నది. అంతేగాక వీరి పుట్టుకకు సంబంధించి కూడా; ఆ పరమేశ్వరుని చిత్ర కంటి మంట చేత మన్మధుడు భస్మ మైనప్పుడు ఆ పరమేశ్వరుడు చెమట తీసి కాటిలో వేస్తే కాటిపాపడు పుట్టెనని, అతనే కాటి కర్త గా నిలిచెనని తెలుస్తున్నది. ఈ కాటి పాపనికి జయ నామ సంవత్సరం మార్గశిర మాసంలో గురువారం నాడు కాశీ విశ్వనాథుడు కాటి కాపరులకు రాగి ధర్మ శాసనాన్ని రాసి ఇచ్చినాడు.

ఈ శాసనంలో కాటికి పుట్టినవాడు కాటి పాపడు కనుక కాటిలో కాల్చిన, బొందలో పూడ్చినా అన్ని కులాల వారు 516 రూపాయలు, ఆవులను ల్యాగలను, చనిపోయిన వ్యక్తిసొమ్ము లను, తలె ముంతను ఇవ్వాలని ఖరారు చేసి, ఇది కాశీ విశ్వనాధుని శాసనమని చెప్పబడింది. అంతేకాకుండా వీటితో పాటుగా బోనుగెడుగింజలు, మూల కాడి బియ్యం, ముఖం మీది బట్ట వీరికి సమర్పించాలని రాసి ఉంది. వీరికి ఇదే కాకుండా కడుపుల కొడుకు పుడితే కాటిపాపని కట్నమని ,మానెడు సోడు గింజలు, శిశువు బొడ్డు మీద 300 రూపాయలు ఇవ్వాలి. ఈ శాసనం మీది నియమాలు తప్పకూడదని ఒకవేళ తప్పితే కాశిలో గోహత్య శిశుహత్య బ్రహ్మ హత్య చేసినంత పాపం తగులుతుందని చెబుతుంది.

కళాకారులకు వంశపారంపర్యంగా సంక్రమించిన కట్టడి గ్రామాలుంటాయి. ఆయా గ్రామాలకు ప్రతి సంవత్సరానికొకసారి వెళతారు. వీరు దీపావళి తరువాత చెట్ల తీర్థం పోయి, పోచమ్మ తల్లి బోనాలుచేసుకుంటారు. ఆ తరువాత తమ కుల దైవమైన గుస్సాయి పండుగ చేసుకొని కట్టడి గ్రామాలకు బయలుదేరతారు. తిరిగి శ్రావణమాసంలో ఇంటికి వస్తారు. ఇట్లా సంవత్సరంలో ఒక నెల రెండు నెలలు మాత్రమే ఇంటి దగ్గర ఉండి మిగతా నెలలు సంచారం చేస్తూనే ఉంటారు.

కళాకారులు వేషధారణలో బుర్రమీసాలు, పొడవైన గడ్డం కలిగి, విభూదితో నుదట అడ్డ నామాలు, మధ్యలో పెద్ద బొట్టు పెట్టుకుంటారు. మెడలో చంద్ర వాల గొలుసు, రుద్రాక్ష మాలలు, మకన కుందనాలు, కొనక పోగులు, రక రకాల ఉంగరాలు ధరిస్తారు. కొందరు తలకు రుమాలు చుట్టుకుంటే మరికొందరు ఈకల మాదిరిగా ఉండే ఇత్తడి కిరీటాన్ని పెట్టుకుంటారు. ఇవే కాకుండా పలు రకాల రంగుల కండువాలు, నల్లని కోటు వేసుకుంటారు. చేతిలో సంద్ర కర్రకు ఒక పక్క జోల సంచిని మరొక పక్క బోనుగను తగిలించుకొని, నపేరా పట్టుకొని చూపరులకు భీకరంగా కనిపిస్తారు. వీరు గ్రామానికి వెళ్ళగానే మొదట గ్రామ పెద్దలను, సర్పంచిని, పోలీస్ పటేల్‌ను కలిసి తమ రాక సమాచారాన్ని చెప్తారు. ఆ తర్వాత గ్రామంలో బోనుగను ఊపుకుంటూ ఇంటింటికి ప్రతిఫలం కోసం పాటలు పాడుకుంటూ తిరుగుతారు. ఈ సందర్భంలో ఎవరైనా ధాన్యం గానీ, డబ్బులు గానీ ఇస్తే వారికి శుభోదయం అంటూ



కంటి వెలుగు చల్లగా ఉండి
ఐలోని మల్లన్న కొమురెల్లి మల్లన్న
నరసింహస్వామి దీవన రాయేసునిదీవన కలిగి
ముట్టింది ముత్యమై పట్టింది బంగారమై.....

కొడుకులు బిడ్డలు మనమలు మనవరాళ్ళు చల్లగా ఉండాలని, పంటలు బాగా పండాలని దీవనార్తి పెట్టి, కొమ్ముపట్టి ఊదుతారు. ఈరకంగా గ్రామంలో తిరుగుతున్నప్పుడు గతంలో ఆ ఇంట్లో ఎవరైనా చనిపోయినప్పుడు వారి పేరుమీద వీరికిచ్చిన వెండి ఆభరణాలను, ఆ ఇంటి వారికి గుర్తు చేసి ఇంటి యజమానిని స్మరిస్తారు. అట్లాగే ఇదే సమయంలో ఆ ఇంట్లోని ముత్తాతలు తాతలను తలచి దీవనార్తి పెడతారు. వీరిదగ్గర ఉండే జోల సంచిలో ఇంద్రజాల విద్యలకు ఉపయోగపడే ఎముకలు, గచ్చకాయలు, రాళ్లు, కట్టెబొమ్మలు (చెక్కబొమ్మలు) ఉంటాయి. గ్రామంలో బోనుగను ఊపుకుంటూ తిరుగుతూ కచ్చీరు దగ్గర కాని లేదా నాలుగు బాటల కూడలిలో కాని కూర్చొని ఇంద్రజాల విద్యను ప్రదర్శిస్తారు. తమ దగ్గర ఉండే జోల సంచిని ముందు పెట్టుకొని ప్రేక్షకులు గుమికూడగానే పాటలు పాడుతూ 'నపేరా' ఊదుతూ ప్రదర్శనకు సిద్ధమవుతారు. ప్రదర్శనలో ఇద్దరు కళాకారులు ఉంటారు. ఇందులో ఒకరు ప్రధానంగా సంభాషిస్తూ విద్యలు ప్రదర్శిస్తుంటే... మరొకరు అతడి సంభాషణకు ఊ కొడుతూ, ప్రదర్శించే అంశాన్ని వివరిస్తూ 'బోనుగ'ను ఊదుతూ ప్రేక్షకులను ఆకర్షిస్తారు.

ప్రదర్శనలో సహజంగా ప్రేక్షకులను ఆకర్షించే విధంగా సంభాషణలు ఉంటాయి. గ్రామంలోని కులాలను ప్రస్తావిస్తూ, వారి గుణగణాలను తెలియపరుస్తూ నవ్విస్తారు. ముందుగా కళాకారుల ప్రదర్శనలో శివశంకరుడు, హరిశ్చంద్ర మహారాజు, పోశమ్మ తల్లి, గణేష్ విగ్రహాలను తీసి పాటలు పాడటం జరుగుతుంది. అంతేగాకుండా తాము ప్రదర్శించే విద్యలకు తెలంగాణ లోనే పేరెన్నిక గన్న రాయేసుని మొక్కుబడులను కూడా సందర్భానుగుణంగా ప్రస్తుతిస్తూ ప్రేక్షకులను ఆకర్షిస్తారు. ప్రదర్శనలో భాగంగానే జోల సంచి నుండి బుచ్చమ్మ, బుచ్చయ్య అనే ఇద్దరు భార్యాభర్తల బొమ్మలను తీస్తారు. పూర్వం వీరిద్దరు కాటికాపరులకు భిక్ష పెట్టలేదని, వీరింటి పేరు కుక్కలోళ్లని వ్యంగ్యంగా దూషిస్తూ హాస్యాన్ని పండిస్తారు. అట్లాగే వెటకారంగా అనిపించకుండా ఉండేవిధంగా బూతులను కూడా ప్రయోగిస్తూ హాస్యాన్ని కలిగిస్తారు. వీరు జోలలో నుండి మాయా బొమ్మను తీసి దానితో ప్రేక్షకులకు దండం పెట్టించి బొమ్మ మాట్లాడినట్లుగా భ్రమకలిగిస్తారు. అట్లాగే పాములను, తేళ్లను, కప్పలను సృష్టించి భయకంపితులను చేస్తారు. శివశంకరుని తలచుకుని నోట్లో నుండి రాళ్లను, గచ్చకాయలను ఒక్కొక్కటిగా తీస్తూ ఆశ్చర్యాన్ని కలిగిస్తారు. అట్లాగే ఊర పిచ్చుకను సృష్టించి దానిచేత పలికించి మాయంచేస్తారు. ప్రేక్షకులలో పిల్లలుంటే వారిమీద హాస్యోక్తులను చిలికిస్తూ ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగిస్తారు. ప్రేక్షకులు తోచినంత ఇస్తే తీసుకొని దీవనార్తి పెడతారు.

కళాకారులు తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన ఈ విద్యను గౌరవిస్తూ తమ సంస్కృతిని నిలుపుకుంటూ వస్తున్నారు. అయితే కళాకారులు ఈ ఇంద్రజాల విద్యలు తమతోనే అంతరించిపోకుండా ఉండాలని, తమ వారసులకు కూడా నేర్పుతూ వస్తున్నారు. తమ సంస్కృతి పరిరక్షణలో తామే ముందుటున్నామని అంటున్నారు. తమ ఆర్థిక పరిస్థితి మాత్రం అంతంత మాత్రంగానే ఉందని వాపోతున్నారు.

-డా॥సురేష్ బాసని
మొబైల్:9989417299




అలనాటి గ్రామ న్యాయాధికారి


రాచరికం కాలంలో రాజు తన అధికార హోదా వల్ల మొత్తం సామాజిక న్యాయానికి సంరక్షకుడుగా ఉండేవాడు. సంప్రదాయ కుటుంబ పద్ధతులు, కుల, మత, నైతిక నియమాలు, సంఘ సంస్థల నియమాలు సక్రమంగా అమలయ్యేలా రాజు పర్యవేక్షించేవాడు. ఆయా సామాజిక వ్యవస్థలే సంబంధిత ప్రజల బృందానికి న్యాయాన్ని అందించే ప్రాథమిక న్యాయస్థానాలుగా పనిచేశాయి. ప్రజా బృందాల మధ్య తలెత్తే చాలా వివాదాలను ఆయా కుటుంబాల పెద్దలు, కుల పెద్దలు, మత బోధకులు లేదా సంఘ నిర్వాహకులు పరిష్కరించేవారు. భారతదేశంలో చాలా వివాదాల్లో తీర్పులు చెప్పే అట్టడుగు స్థాయి ప్రజాన్యాయస్థానాలు ఇవి. ఈ సామాజిక సంస్థలను న్యాయాన్ని అందించే ప్రాథమిక వనరులుగా మన న్యాయకోవిదులు కూడా అంగీకరించారు. ఏదైనా పై స్థాయి సంస్థ నిర్దిష్ట కేసుల విచారణను చేపట్టినప్పుడు ఆయా ప్రజానీకపు పద్ధతులను, ఆచారాలను కూడా పరిగణనలోనికి తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుంది. ఇవి కాకుండా వర్ణాలు, ఆశ్రమాల కోసం నిర్దేశించిన ధర్మాలు కూడా ఉన్నాయి. మధ్యయుగం నాటి న్యాయ వ్యవస్థలో గ్రామస్థాయి న్యాయస్థానాల గురించిన సమాచారం... మరీ ముఖ్యంగా కింది స్థాయి న్యాయాధికారిగా గ్రామాధికార పాత్రను ఇప్పుడు చూద్దాం.

ప్రాచీన కాలం నుంచి మనదేశంలో గ్రామ సభ అందరి ఆమోదం పొందిన ప్రజా న్యాయస్తానంగా ఉంది. తనకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దవలసిందని కోరుతూ బాధిత పక్షం చేసిన విజ్ఞప్తిపై వివాదాన్ని విచారణ చేయడానికి గ్రామాధికారి సమావేశపరిచే ఉపసంఘమే ఈ న్యాయస్థానం. గ్రామాధికారి అంటేనే రాజు ప్రతినిధి. న్యాయస్థానం కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూడవలసిన బాధ్యత అతడి పై ఉండి స్మృతులలో నిర్దేశించిన వివాదంలో చిక్కిన వారి కులం, శ్రేణికి సంబంధించిన వాస్తవాలు తెలిసినవారితో సంఘాన్ని ఏర్పాటుచేసి సమావేశపరచాలి. ధర్మశాస్త్రాల ఆధారంగా తటస్థంగా మెలిగి నిష్పక్షపాత తీర్పు ఇచ్చే ఒకరిద్దరు బ్రాహ్మణులను అవసరమైతే ఇతర గ్రామాల నుంచి కూడా ప్రత్యేకంగా ఆహ్వానించేవారు. ఆ రోజుల్లో ఈ పద్ధతి చాలా సాధారణం. కొన్ని దాన శాసనాల్లో ఈ బ్రాహ్మణులను దాన స్వీకర్తలుగా పేర్కొన్నారు. రెండవ చాళుక్య భీమునికి చెందిన కోలవెన్ను శాసనాల్లో దాన స్వీకర్త కుమారులు, మనుమళ్లు 'వరగోష్ఠ'లలో చక్కటి న్యాయవాదులన్న అభివర్ణన ఉంది. రాజులు ఏర్పరచిన అగ్రహారాల్లో కొందరు బ్రాహ్మణ న్యాయకోవిదులు ఉండేవారని దీన్ని బట్టి స్పష్టమవుతుంది. అవసరమైనప్పుడు కొంత నామమాత్రపు ప్రతిపలం చెల్లించి గ్రామాధికారి వీరి వీరి సేవలను వినియోగించుకోక తప్పని సందర్భాల్లో పెద్దల సహాయంతో గ్రామాధికారే వివాదాలను పరిష్కరించేవాడు. ఇతడిని 'కొన్ని శాసనాలు 'గ్రామణి' అని పేర్కొంటున్నాయి. ఉమికిలి గ్రామానికి వేమరాజు అనే వ్యక్తిని 'గ్రామణి'గా నియమించిన సందర్భంలో, సంబంధిత వ్యక్తుల నుంచి 'తాంబూలం'తో పాటు ఒక 'తూము' ధాన్యాన్ని వసూలు చేసుకోవడానికి రాజు అనుమతించినట్లు మొదటి అమ్మరాజు శాసనం అంటున్నది. కౌలు, దస్తావేజులు, వివాహం, ఒప్పందాల వంటివి కుదుర్చుకునేటప్పుడు సంబంధిత పక్షాల, తాంబూలంతో పాటు నగదు లేదా వస్తు రూపంగా కొంత ప్రతిఫలాన్ని గ్రామాధికారికి చెల్లించడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. ఉభయపక్షాలు ఒప్పందానికి కట్టుబడి ఉండేలా ఈ చెల్లింపులు జరిగేవి. ఒప్పందాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే గ్రామాధికారి పరిస్థితిని చక్కదిద్దేవాడు. ఒప్పందానికి కట్టుబడని వాడిని శిక్షించేవాడు. గ్రామణి లేదా 'రెడ్డి'కి మేజిస్ట్రేట్ మాదిరి విధులను అప్పగించేవారు.



-మౌక్తిక్





ప్రాచీన కాలం నుంచి బంగారం అంటే విపరీతమైన మక్కువ చూపిస్తున్నాడు మనిషి. అందుకే దాన్ని సంపాదించడానికి రకరకాల పాట్లు పడుతున్నాడు. ఖనిజరూపంలో ఉన్న బంగారాన్ని గనుల నుంచి వెలికి తీసి శుద్ధి చేయడం చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. అలాగే బంగారపు గనులు కూడా తక్కువే. అందువల్ల కావలసిన బంగారాన్ని చౌకగా ఉత్పత్తి చేయడం కుదరడంలేదు. దీంతో కొంతమంది తక్కువ విలువ ఉండి ఎక్కువ పరిమాణంలో లభించే సీసం వంటి లోహాలను బంగారంగా మార్చడానికి ప్రయత్నాలు చేశారు. మరి కొందరు పాదరసాన్ని బంగారంగా మార్చే ప్రయత్నం చేశారు.

రకరకాల శాస్త్రాలు అభివృద్ధి చెందుతున్న తరుణంలో మనిషికి అనేక కొత్త విషయాలు తెలుస్తున్నాయి. లోహల రంగుని, రూపాన్ని మార్చడం సాధ్యమని కొందరు నిరూపిస్తున్నారు. వాటిలోని కాఠిన్యాన్ని, మృదుత్వాన్ని అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడానికి వీలుపడుతోంది. అలాంటప్పుడు ఇతర లోహాలను బంగారంగా మార్చడం ఎందుకు వీలుపడదు అనే ప్రశ్న తలెత్తింది. ద్రాక్షరసం వైన్‌గా, వైన్ వెనిగర్‌గా, గొంగలిపురుగు సీతాకోక చిలుకగా మారుతుందన్న విషయం ఆనాటి ప్రజలకు తెలుసు. జీవమే ఇన్ని మార్పులకు లోనవుతున్నప్పుడు నిర్జీవ పదార్థాలను మార్చడం ఎందుకు వీలుపడదనే ఆలోచన తలెత్తింది. కృత్రిమంగా సమకూర్చే ఖనిజ లవణాలతో మొక్కలు వేగంగా ఎదగడం కూడా వారి దృష్టిని ఆకర్షించింది. అదే ప్రక్రియను వెనక్కి తిప్పి ఎదుగుదల నిదానంగా సాగేటట్లు చేయగలిగితే ముసలితనం, మరణాలను జయించడానికి ఆస్కారం ఉందని నాటి రసవాదులు తలచారు. ఇదే క్రమంలో బంగారాన్ని తయారుచేయవచ్చని భావించారు. అయితే వీటిలో ఏది సాధించాలన్నా పరుసవేది (ఫిలాసఫర్స్ స్టోన్) తప్పనిసరని వారు నమ్మారు.

బంగారాన్ని తయారుచేయాలని...



మానవుడు జంతు దశను దాటి క్రమమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని జీవించే స్థాయికి వచ్చేటప్పటికి కొన్ని లోహల పాత్ర కీలకమయింది. ఆర్థిక వ్యవస్థ మనుగడకు అవసరమైన కరెన్సీ (ద్రవ్యం) ముద్రణకు అరుదుగా లభించే లోహల నిల్వలను ప్రాతిపదికగా తీసుకున్నారు. అలా బంగారం, వెండి వంటి విలువైన లోహలు ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర నిర్వహించే స్థాయికి పెరిగాయి. అదే తరుణంలో ప్రపంచంలోని చాలా సమాజాల సంస్కృతి ఈ విలువైన లోహలతో పెనవేసుకుపోయింది. ఇందుకు మంచి ఉదాహరణ భారతదేశమే. పుట్టుక, వివాహం, చావు, పండగ... సందర్భం ఏదయితే ఏం.. భారత దేశంలో బంగారంతో సంబంధం లేని సామాజిక వ్యవహారం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రపంచ వ్యాప్తంగా అటు ఆర్థిక వ్యవస్థ మనుగడకు, ఇటు సామాజిక, సాంస్కృతిక అవసరాలకు బంగారం కేంద్రంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఎవరి దగ్గర బంగారం ఉంటే వారే బలవంతులు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో యుద్ధాల్లో బంగారాన్ని చేజిక్కించుకోవడం ఒక లక్ష్యంగా ఉండేది. ఇంత ప్రాముఖ్యం ఉన్న బంగారం దొరికే ప్రాంతాలను గుర్తించి తవ్వి తీసి వాడుకకు అనుకూలంగా తయారుచేయడం చాలా ఖర్చుతోను, శ్రమతోనూ కూడిన పని. అంత శ్రమపడి తీద్దామన్నా అది ఎక్కడపడితే అక్కడ దొరికే ఖనిజం కాదాయె. అందుకే కృత్రిమంగా బంగారాన్ని తయారుచేయగలిగితే ఎంతబాగుండు అనే ఆలోచన కలిగింది.

ప్రాచీన, మధ్యయుగాల్లో తత్వవేత్త (ఫిలాసఫర్స్)లకు సమాజంలో ఎంతో విలువ ఉండేది. వారే సమాజ మనుగడలో కీలక భూమిక నిర్వహించేవారు. ఇప్పుడు మనం చూస్తున్న అనేక ఆధునిక శాస్త్రాలు అన్నీ అప్పట్లో తత్వశాస్త్రంలో భాగంగా ఉండేవి. అంటే తత్వవేత్త అనేక శాస్త్రాల్లో ప్రావీణ్యం గడించి ఉండేవాడు. అరిస్టాటిల్ వంటి తత్వవేత్త బహుముఖ ప్రజ్ఞతో ఎన్నో శాస్త్రాల అభివృద్ధికి ఎలా పాటుపడ్డాడో ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. అంటే అప్పట్లో తత్వవేత్తల్లో చాలా మంది సైంటిస్టులన్నమాట. బంగారం తయారుచేయాలని ప్రయత్నించిన మొదటి తరం సైంటిస్టులు కూడా ఈ ఫిలాసఫర్సే. అయితే వీరు బంగారం, ఇతర విలువైన లోహలు తయారు చేయడానికి ఒక రాయిని తయారు చెయ్యాలని ప్రయత్నించారని, ఆ రాయిపేరే ఫిలాసఫర్స్ స్టోన్ (పరుసవేది) అనీ భావిస్తారు. నిజానికి పరుసవేదిని తయారు చేశారంటే బంగారాన్ని తయారుచేసినట్లే లెక్క. ఎందుకంటే ఈ పరసువేదితోనే బంగారం తయారు చేస్తారని చెబుతారు. అలాగే పరుసవేదికి చాలా శక్తులు ఉంటాయని వాటితో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, యవ్వనంగా ఉండటంతోపాటు చనిపోయినవారు బతకవచ్చనీ నమ్మేవారు. అందుకే 'పరుసవేది' అనే పదం ప్రాచీన మధ్యయుగాల్లో ఎందరో రాజులకు నిద్రలేకుండా చేసింది. పరుసవేది సహాయంతో దేశంలో బంగారు గుట్టలను సృష్టించి ద్రవ్యం (డబ్బు) విలువ పడిపోయేలా చేస్తారేమోననేది వారి భయం. అలాగే పరుసవేదికి ఉన్న శక్తులతో రాజ్యాధికారాన్ని కైవశం చేసుకుంటారనీ భయపడేవారు. ఈ అన్ని కారణాల వల్ల తమ రాజ్యాల్లో పరుసవేదిని తయారు చేయడం నిషేధించారు. అంటే బంగారాన్ని తయారుచేయడం నిషిద్ధమన్నమాట.


ఎందరో బంగారం తయారు చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. రసాయనాల వల్ల మతి భ్రమించి పిచ్చివాళ్లయ్యారు. మన చరిత్రలో నాగార్జునాచార్యుడు (సిద్ధనాగార్జునుడు) బంగారం తయారుచేశాడని అంటారు కాని దాన్ని ధృవీకరించే ఆధారాలు ఇప్పటివరకు లభించలేదు.

- భూపేంద్ర



71 ఏండ్ల చరిత్రకు నాంది పలికింది. దిగ్గజ సారథులకు సైతం సాధ్యం కాని ఘనతను కోహ్లీ సాధించాడు. ఇప్పటివరకూ ఆస్ట్రేలియాలో 11 పర్యాయాలు పర్యటించిన టీమిండియా ఏ ఒక్క పర్యాయమూ సిరీస్ విజయానికి నోచుకోలేదు. ఈ పర్యటనల్లో కేవలం ఐదు విజయాలను మాత్రమే నమోదు చేసుకోగల్గింది. ప్రస్తుత నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో చేజిక్కించుకొని మొత్తం ఏడు విజయాలను ఆసీస్ గడ్డపై సాధించినట్లైంది. ఆసీస్ గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్‌ను గెల్చిన కోహ్లీ సేనకు రాష్ట్రపతి, ప్రధాని, సచిన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

71 ఏండ్ల చరిత్రకు నాంది



- కోహ్లీ సేన 2-1తో సిరీస్ కైవసం
- టీమిండియాపై ప్రశంసల వెల్లువ

సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీసేన చరిత్ర సృష్టించింది. బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్ ట్రోఫీని 2-1తో కైవసం చేసుకొని పలు రికార్డులు తిరగరాసింది. సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్టుకు చివరిరోజు ఆట వర్షం కారణంగా పూర్తిగా రద్దు టీమిండియా నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో గెల్చుకున్నట్లయ్యింది. దీంతో కంగారూ గడ్డపై 71 ఏండ్లలో సాధ్యంకాని టెస్టు సిరీస్ విజయాన్ని కోహ్లీ సేన సొంతం చేసుకుని రికార్డు నెలకొల్పింది. ఇంతకుముందు 1980, 1985, 2002, 2004 పర్యటనల్లో మాత్రం భారత్ టెస్ట్ సిరీస్‌లను డ్రా చేసుకోగల్గింది. ఇప్పటివరకూ భారత్ 11 పర్యాయాల్లో ఆస్ట్రేలియాతో ఆడిన 47 టెస్టుల్లో కేవలం ఏడు మ్యాచ్‌లలో మాత్రమే విజయాలను నమోదు చేసుకోగల్గింది. గత ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్, ఆ తర్వాత ఇంగ్లాండ్ సిరీస్‌లలో టీమిండియా ఓడిపోయింది.

నాల్గోటెస్ట్‌లో కుల్దీప్ ఐదు వికెట్లతో విజృంభించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియాకు 322 పరుగుల భారీ ఆధిక్యత లభించింది. కోహ్లీ ఆసీస్‌ను ఫాలోఆన్‌కు ఆహ్వానించగా వెలుతురులేమితో నాలుగో రోజు ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు చేసింది. అనంతరం ఆటకు వర్షం అంతరాయం కలిగించడంతో నాలుగో రోజు ఆట ముగిసింది. వరుణుడు ఐదోరోజు కూడా కరుణించకపోవడంతో సోమవారం ఆట ఒక్క బంతి కూడా పడకుండానే తుడిచి పెట్టుకుపోయింది. దీంతో 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన భారత నయావాల్ పుజారా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను గెలుచుకున్నాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్ -662/7 డిక్లేర్డ్
ఆసీస్ తొలి ఇన్నింగ్స్ - 300
ఆసీస్ రెండో ఇన్నింగ్స్ - 6/0

3-1తో ముగించాలనుకున్నా : కోహ్లీ

వెలుతురులేమి, వరుణుడు పలుమార్లు అంతరాయం కలిగించిన సిడ్నీ టెస్ట్‌ను 3-1తో ముగించాలని అనుకున్నానని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. సిడ్నీ టెస్ట్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగుల భారీస్కోర్ చేయడంతోనే సిరీస్ విజయం ఖాయమైందన్నాడు. వెలుతురులేమి, వర్షం కారణంగా సిడ్నీ టెస్ట్ చివరి రెండురోజుల ఆట పూర్తిగా రద్దు కావడంతో సిరీస్‌ను 2-1తో ముగించాల్సి వచ్చిందన్నాడు. అంతేగాక మూడోటెస్టు గెలుపుతోనే భారత్‌కు సిరీస్ విజయం దాదాపు ఖాయమైందని, సిరీస్‌ను కైవసం చేసుకున్నందుకు ఆనందంగా ఉందని టీమిండియా విరాట్ అన్నారు. టెస్ట్ సిరీస్‌లో పుజారా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని అతనికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. రాబోయే సిరీస్‌లలోనూ భారత్ తన హవా కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

30 ఏండ్ల తర్వాత ఫాలోఆన్ ఆడిన ఆసీస్

సొంతగడ్డపై ఆసీస్ ఫాలోఆన్ ఆడటం 30 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1988లో చివరిసారి ఇదే సిడ్నీ మైదానంలో ఇంగ్లాండ్‌తో ఫాలోఆన్ ఆడిన ఆసీస్ ఆ మ్యాచ్‌ను డ్రా ముగించింది. ఇక విదేశాల్లో 2005లో చివరగా ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫాలోఆన్ ఆడిన ఆసీస్ పరాజయం పాలైంది. ప్రస్తుత టెస్ట్‌లో నాలుగు, ఐదోరోజు ఆట పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో టీమిండియా 2-1తో సిరీస్‌ను గెల్చింది. తద్వారా ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ నెగ్గిన ఆసియా జట్టుగానూ భారత్ రికార్డు సృష్టించింది.

కోహ్లీ సేనపై ప్రముఖుల ప్రశంసలు

♦ ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక టెస్టు విజయం దేశాన్ని గర్వపడేలా చేసింది : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

♦ ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచి కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది : ఐసిసి

♦ మరిచిపోలేని ఈ విజయాన్ని అందించిన టీమిండియాకు అభినందనలు. భారత్‌లోని ప్రతి క్రికెట్ అభిమాని గర్వపడుతున్నాడు. సమిష్టి కృషితోనే ఈ విజయం : వీరేంద్ర సెహ్వాగ్

♦ టీమిండియా అద్భుతంగా ఆడింది. మిమ్మల్ని చూసి గర్వపడుతున్నా భారత బ్యాటింగ్ లైనప్‌కి వెన్నెముకగా నిలిచిన పుజారాకు అభినందనలు. బుమ్రా బౌలింగ్ అద్భుతం : హర్భజన్ సింగ్

వృత్తి మిధ్య

డిమాండ్ ఉన్న ఏడు కోర్సులు రద్దు

- ఇంటర్ బోర్డు ఇష్టారాజ్యం
- పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో వృత్తి విద్య పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నది. ప్రభుత్వ వృత్తి విద్యా కాలేజీల్లో కనీస ప్రమాణాల్లేవని విద్యావేత్తలు, అధ్యాపక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. సరిపోయినన్ని నిధులు లేకపోవడంతో కునారిల్లుతున్నాయి. అవసరమైనంత మంది అధ్యాపకుల్లేక వృత్తి విద్యలో చేరిన విద్యార్థులకు నాసిరకమైన చదువులు అందుతున్నాయి. దీంతో వృత్తి విద్య ఇప్పుడు మిథ్యగా మారింది. ఇంకోవైపు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు పొందేందుకు వృత్తివిద్యలో విద్యార్థులు చేరుతున్నారు. ఈ అవకాశాన్ని తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డు విద్యార్థులకు లేకుండా చేసింది. డిమాండ్ ఉన్న ఏడు కోర్సులను 2017-18 విద్యాసంవత్సరంలో రద్దు చేసింది. అదీ విద్యాసంవత్సరం ప్రారంభమైన తర్వాత ఆ కోర్సులు రద్దు చేస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది. ఏటా జూన్ 1వ తేదీ నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమవుతుంది. వృత్తి విద్యలో ఏడు కోర్సులు రద్దు చేస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ 2017, జూన్ 6న సర్క్యులర్ జారీ చేశారు. ఇంటర్ విద్యాశాఖ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కొన్ని కాలేజీ యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సును పునరుద్ధరించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. 2018-19 విద్యాసంవత్సరంలో రద్దు చేసిన ఆప్తాల్మిక్ కోర్సును పునరుద్ధరించాలని 2018, మార్చి 14న ఇంటర్ బోర్డును హైకోర్టు ఆదేశించింది. 2018-19 విద్యాసంవత్సరంలోనూ ఆ కోర్సును పునరుద్ధరించలేదు. హైకోర్టు ఆదేశాలనూ ఇంటర్ బోర్డు బేఖాతరు చేసింది. హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో కొందరు విద్యార్థులు ఆయా కోర్సుల్లో చేరారు. ఇంటర్ బోర్డు ఆ కోర్సులకు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు విద్యార్థులు ఆ కోర్సుల్లో చేరాలని భావిస్తున్నారు. ఇంకోవైపు వృత్తి విద్యా కాలేజీలూ ఆ కోర్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ ఇంటర్ బోర్డు అనాలోచిత నిర్ణయంతో విద్యార్థులు నష్టపోతున్నారు. రద్దు చేసిన కోర్సుల్లో చేరిన విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. ఇప్పుడు కోర్టు ధిక్కరణ కింద కొందరు విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరుగుతున్నది.

వృత్తి విద్యలో చేరేది పేద విద్యార్థులే

పదో తరగతి పాసయ్యాక ఆర్థిక ఇబ్బందులు, పై చదువులు చదవలేక, వెంటనే ఉపాధి పొందాలనీ భావించే వారు వృత్తి విద్యా కోర్సుల్లో చేరుతారు. వృత్తి విద్యా కోర్సుల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు చెందిన పేద విద్యార్థులే ఎక్కువ మంది చేరుతున్నారు. రాష్ట్రంలో 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వాటిలో 100కుపైగా కాలేజీల్లో వృత్తి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. 200కుపై ప్రయివేటు జూనియర్ కాలేజీలు వృత్తి విద్యా కోర్సులు అందిస్తున్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి 1.50 లక్షల మంది వృత్తి విద్యా కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు చదివినా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించే పరిస్థితి లేదు. ఒకవేళ కల్పించినా తక్కువ సంఖ్యలోనే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తున్నాయి. ప్రయివేటు రంగంలో ఉపాధి అవకాశాలన్నీ ఇంజినీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివిన వారికే దక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో చదువు పూర్తయిన వెంటనే ఉపాధి లభించేది వృత్తి విద్యా కోర్సులు. అదీ పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్మీడియెట్ విద్యార్హతతో ఉపాధి దొరుకుతున్నది. అందుకే ఈ కోర్సులకు డిమాండ్ ఉన్నది. డిమాండ్ ఉన్న వృత్తి విద్యాకోర్సులను రద్దు చేయడంతో విద్యార్థులను వ్యతిరేకత వస్తున్నది. ఇంకోవైపు కొన్ని కాలేజీ యాజమాన్యాలూ ఈ నిర్ణయాన్ని తప్పుపడుతున్నాయి. గత ఐదేండ్ల కాలంలో ఈ ఏడు వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియను పరిశీలించిన తర్వాతే ఎక్కువ సంఖ్యలో మొగ్గు చూపడం లేదనే కారణంతోనే రద్దు చేశామని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికైనా రద్దు చేసిన వృత్తి విద్యా కోర్సులను పునరుద్ధరించి విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



కోర్టు ఆదేశాలు అమలు చేయాలి : జావీద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

రాష్ట్రంలో ఇంటర్ బోర్డు రద్దు చేసిన వృత్తి విద్యా కోర్సులను పునరుద్ధరించాలి. ఇంటర్ బోర్డు అవగాహన రాహిత్యంతో గత విద్యాసంవత్సరం నుంచి కొన్ని వృత్తి విద్యాకోర్సులను ఎత్తివేసింది. ఇంటర్ బోర్డు నిర్ణయాన్ని హైకోర్టు తప్పుపట్టిందనీ, ఆ కోర్సులను యధావిధిగా కొనసాగించాలనీ ఆదేశించింది. అయినప్పటికీ ఇంటర్ బోర్డు అధికారులు హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదు. కోర్టు అదేశాలను అమలు చేయాలి. ఈ కోర్సులను ఎత్తేయడం వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్కిల్ ఇండియా పేరుతో అనేక వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెడుతుంటే రాష్ట్రంలో ఉన్న కోర్సులను ఎత్తేయడం దారుణం.

అవగాహన లేక రద్దు చేయడం దారుణం : ప్రభాకర్, ఒకేషనల్ విద్యార్థి

వృత్తి విద్యా కోర్సుల పట్ల అవగాహన లేకుండానే ఇంటర్ బోర్డు ఏడు కోర్సులను రద్దు చేయడం దారుణం. వృత్తి విద్యా కోర్సుల వల్ల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వం ఖర్చును తగ్గించుకునే భాగంలోనే ఆ కోర్సులను రద్దు చేసింది. చైనా, జపాల్ వంటి దేశాల్లో వృత్తి నైపుణ్యం ఉండడం వల్లే అభివృద్ధి సాధ్యమవుతున్నది. భారత్‌లో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించాలంటే రద్దు చేసిన వృత్తి విద్యా కోర్సులను పునరుద్ధరించాలి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన వారికి నాణ్యమైన విద్య అందించాలి. పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువ అవగాహన కల్పించాలి.

ఇంటర్ బోర్డు రద్దు చేసిన వృత్తి విద్యా కోర్సులు

1. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్ఎస్)
2. ప్రింటింగ్ టెక్నాలజీ (ఓల్డ్ డీటీపీ అండ్ ప్రింటింగ్ టెక్నాలజీ)
3. ఫ్యాషన్ అండ్ గార్మెంట్ మేకింగ్ (ఎఫ్‌అండ్ జీఎం)
4. హోటల్ ఆపరేషన్స్ (హెచ్‌వో)
5. డెంటల్ టెక్నీషియన్ (డీటీ)
6. డెంటల్ హైజీనిస్ట్ (డీహెచ్)
7. ఆప్తాల్మిక్ టెక్నీషియన్ (ఓటీ)

అశ్రునయనాల నడుమ బుచ్చమ్మ అంత్యక్రియలు

- హాజరైన తమ్మినేని, వీరయ్య



నవతెలంగాణ- సిటీబ్యూరో

సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సౌత్ సిటీ కమిటీ కార్యదర్శి నల్లపు సోమయ్య తల్లి నల్లపు బుచ్చమ్మ(93) అంత్యక్రియలు సోమవారం న్యూబోయిగుడ శ్మశాన వాటికలో అశ్రునాయనాల నడుమ ముగిశాయి. బుచ్చమ్మ ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. బుచ్చమ్మ భౌతికకాయాన్ని పలువురు సీపీఐ(ఎం) నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, నంద్యాల నర్సింహారెడ్డి, బి.వెంకట్, టి.జ్యోతి, ఆంధ్రప్రదేశ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వర్‌రావు, సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాస్‌రావు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు జె.వెంకటేష్, పాలడుగు భాస్కర్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత ఉన్నారు.

గిన్నిస్ బుక్‌లో పోలవరం



పోలవరం: ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు పనుల్లో సోమవారం రెండు ప్రపంచ రికార్డులు ఆవిష్కృతమయ్యాయి. గతంలో చేపట్టిన 21,580 క్యూబిక్ మీటర్ల పనులను 16 గంటల్లోనే నవయుగ సంస్థ అధిగమించింది. 24 గంటల్లో 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులతో గిన్నిస్ రికార్డుకెక్కింది. ప్రపంచ రికార్డు స్థాయిలో కాంక్రీట్‌ను నవయుగ సిబ్బంది డంప్ చేశారు. నిన్న ఉదయం 8 గంటల నుంచి ఈ రోజు ఉదయం 8గంటల వరకు నిరంతరాయంగా కాంక్రీట్ పోసి రికార్డు సృష్టించారు.

దీంతో పోలవరం పనుల్లో రికార్డు నమోదైనట్టు గిన్నిస్ రికార్డు ప్రతినిధులు ప్రకటించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు వద్దే ప్రతినిధులు గిన్నిస్ రికార్డు ధ్రువపత్రాన్ని ఏపీసీఎం చంద్రబాబుకు అందజేశారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.